రాజభాషా రత్నం

- బాల్యం నుంచి హిందీపై అంతులేని మమకారం
- అనువాదకురాలిగా విశేష ప్రతిభ
- ఉత్తరాదికి తెలుగు సాహితీ వెలుగులు
- ఆచార్య (రిటైర్డు) సూరపనేని శేషారత్నం ఘనత ఇది

జర్నీ JOURNEY 2



జీవన గమనంలో వారధి



- కష్టసుఖాల్లో వెన్నంటి నడిచే శ్రేయోభిలాషి
- నిజమైన స్నేహానికి నమ్మకమే పునాది
- ఆలోచనల సంగమమే స్నేహానికి ప్రాతిపదిక
- మనుషులు వేరైనా ఒకే మనసుగా ఆలోచించేవారు స్నేహితులు
- స్వార్థం, అవసరం, అవకాశవాదం అనే పదాలకు చోటులేనిది స్నేహం
- కాలంతోపాటు మారిన అర్థం
- అవసరాల ప్రాతిపదికగా మారిన తత్వం

నేడు స్నేహితుల దినోత్సవం

... సెంటర్‌స్ప్రెడ్‌లో

ఆంధ్రజ్యోతి
విశాఖపట్నం

andhrajyothy.com ఆదివారం 6 ఆగస్టు 2017 16 పేజీలు

మన్యంలో.. సంచార వైద్యం

మండలానికొక ఆరోగ్య రథం



అనంతగిరి చేరుకున్న ఏపీఎండీసీ మొబైల్ ఆరోగ్యకేంద్రం వాహనం (ఇన్‌సెట్‌లో) వాహనంలో ఆధునిక ల్యాబ్ పరికరాలు

- తొలివిడతలో అనంతగిరి కేంద్రంగా వైద్యసేవలు
- అత్యాధునిక పరికరాలతో పరీక్షలు
- రూ.45 లక్షలతో మొబైల్ వ్యాన్
- అన్ని రకాల పరీక్షలు చేయవచ్చు
- క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష కూడా..
- దశలవారీగా అన్ని మండలాలకు వాహనాలు

13

నత్తనడకన పోలవరం

ఎడమ కాలువ ఆరో ప్యాకేజీ పనుల్లో తీవ్ర జాప్యం

- ఇంకా పనులు ప్రారంభించని కాంట్రాక్టు సంస్థ
- నోటీసులు జారీచేసిన అధికారులు
- కాంట్రాక్టును రద్దు చేయాలంటూ ప్రభుత్వానికి సిఫార్సు



నక్కపల్లి మండలం సీతంపాలెం వద్ద అసంపూర్తిగా వున్న కాలువ పనులు

నక్కపల్లి/ఎలమంచిలి: పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ కాలువకు సంబంధించి ఆరో ప్యాకేజీ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. జిల్లాలో అన్ని ప్యాకేజీ పనులు ఊపందుకున్నప్పటికీ ఆరో ప్యాకేజీ పనులు ప్రారంభం కాకపోవడానికి సంబంధిత కాంట్రాక్టు సంస్థే కారణమని గుర్తించి ఆ సంస్థను తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు ప్రభుత్వానికి కాంట్రాక్టు సంస్థ అయిన మధుకాన్ నిర్లక్ష్యంపై

... మిగతా 14వ పేజీలో

మత్తుకు చిత్తు



రైల్వే న్యూకాలనీలోని శ్రీనివాసమందుల దుకాణం

- బానిసలుగా మారుతున్న విద్యార్థులు
- గుట్టుగా కొంతమంది మందుల దుకాణాల యజమానుల విక్రయాలు
- ఔషధ నియంత్రణ అధికారులకు నేరుగా ఫిర్యాదు చేస్తున్న తల్లిదండ్రులు
- పోలీసులకు సమాచారం అందడంతో ఆకస్మిక దాడులు
- ఒక డిస్ట్రిబ్యూటర్ నుంచి భారీగా నిషేధిత మందులు స్వాధీనం

... వార్త 13వ పేజీలో

వణుకుతున్న పినపాడు

జ్వరాలతో మంచం పట్టిన గిరిజనం



జ్వరంతో నడవలేని స్థితిలో ఉన్న మృతురాలు ఆశ కార్యకర్త కుమార్తె మల్లీశ్వరి

- నలుగురి పరిస్థితి ఆందోళనకరం
- ముగ్గురి మరణంతో భయాందోళనలో గ్రామస్థులు
- మృత్యువు నుంచి కాపాడాలని పూజలు
- మొక్కుబడిగా వైద్య శిబిరం..
- జాడ లేని వైద్యాధికారి

10

పల్లెకు జ్వరం

ప్రభుత్వ ఆస్పత్రుల వైపే రోగుల మొగ్గు

16



రాజభాషా రత్నం

బాల్యం నుంచి హిందీపై అంతులేని మమకారం ● అనువాదకురాలిగా విశేష ప్రతిభ ● ఉత్తరాదికి తెలుగు సాహితీ వెలుగులు ● మన సంస్కృతీ సంప్రదాయాల పరిచయం

'గిఫ్ట్‌ప్యాక్'కు సాహిత్య అకాడమీ అవార్డు ● జ్ఞానపీఠ్ కమిటీ తెలుగు కన్వీనర్‌గా సేవలు ● గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులపై ప్రాజెక్టు

ఆచార్య (రిటైర్డు) సూరపనేని శేషారత్నం ఘనత ఇది ● రావూరి భరద్వాజ రచనల అనువాదంతో సంతృప్తి

రావూరికి, ఇనాక్‌కు నా హయాంలోనే అవార్డు ● రచయితగా నాకు ఆనందాన్నిచ్చిన అంశం ఇది

జర్నీ JOURNEY

సాహిత్య అభిలాష ఓ ప్రత్యేక వ్యాపకం... రచయితగా రాణించాలంటే భాషపై పట్టుంటే సరిపోదు...సమాజాన్ని చదవాలి. అదీ పరభాషలో పట్టు సాధించాలంటే పట్టుదలతో కృషిచేయాలి. బాల్యం నుంచే రాజభాష హిందీపై ఆసక్తి పెంచుకున్న ఆమె అందులోని లోతుల్ని చూడాలని తపన చెందారు. భాషపై పట్టుసాధించాక అనువాదకురాలిగా మారారు. 42 పుస్తకాలు రాసిన ఆమె కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడా స్వీకరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ (రిటైర్డ్) సూరపనేని శేషారత్నం ఘనత ఇది. 'ఉత్తరాది రచయితల ఆధిపత్యం సాగుతున్న రోజుల్లో తెలుగు రచయిత గొప్పతనం, రచనల గొప్పతనంతోపాటు మన సంస్కృతి సంప్రదాయాలను ఉత్తరాది వారికి పరిచయం చేసింది నేనే. వాస్తవానికి ఈ లక్ష్యంతోనే అనువాదకురాలిగా మారాను' అంటున్న శేషారత్నం జీవితంలోని కొన్ని సంఘటనల సమాహారమే ఈ వారం జర్నీ.

(ఆంధ్రజ్యోతి/ విశాఖపట్నం)

మాతృభాషపై పట్టు సాధించాలని, రచనలు చేయాలని ఆశించడం సహజం. కానీ ఆమె రాజభాష హిందీపై మక్కువ పెంచుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం నుంచి రావడంతో జాతీయ భావాలు అధికంగా ఉండడం కూడా ఇందుకు కొంత కారణం. పాఠశాల చదువు ముగిసే సరికి హిందీలో 'విశారద' పాసయ్యారు. పీయూసీలో మంచి మార్కులు రావడంతో వైద్య విద్యలో చేరే అవకాశం ఉన్నా ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి చూపారు. చివరికి హిందీలో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి అధ్యాపకురాలిగా స్థిరపడ్డాడు. సూరపనేని శేషారత్నం ఘనత ఇది. తనను పలకరించిన 'ఆంధ్రజ్యోతి' వద్ద అంతరంగాన్ని ఆవిష్కరించారు.

బాల్యం నుంచే హిందీపై మక్కువ

బాల్యం నుంచే హిందీభాషపై మక్కువ కలిగింది. మా ఊరిలో వాతావరణం కూడా ఇందుకు దోహదపడింది. స్వాంత్ర్యం వచ్చిన తొలిరోజులు కావడంతో జాతీయవాద భావజాలం బలంగా ఉండేది. ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాలనుకునే వారు. నాన్న నాగభూషణం స్వాతంత్ర్య సమరయోధులు. దీంతో మాకు హిందీ నేర్పించేందుకు ఆయన ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేశారు. ఆయన ఏడాదిపాటే చెప్పినా ప్రతి ఒక్కరికీ హిందీపై ఇష్టం ఏర్పడింది. మేం చదువుకునే ఉంగుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో దత్తు టీచర్ హిందీ బోధించేవారు. అతని భార్య ఇంటి వద్ద హిందీకి సంబంధించి ప్రాథమిక, మాధ్యమిక పరీక్షలకు ట్యూషన్ చెప్పేవారు. ప్రతిరోజూ పాఠశాల ముగిసిన తర్వాత హిందీ ట్యూషన్‌కు వెళ్లేవాళ్లం. స్కూల్‌ఫైనల్ తరువాత పీయూసీ, బీఎస్సీలో కూడా సెకండ్‌లాంగ్వేజ్ హిందీ తీసుకున్నా. దీనివల్ల పీజీలో హిందీలో సీటొచ్చింది. పరిశోధకురాలిగా చేరిన తరువాత హిందీపై మరింత మక్కువ ఏర్పడింది.

తెలుగు గొప్పదనం తెలియాలనే...

ఉత్తరాది హిందీ కవులు, రచయితలు తమ రచనలను తెలుగులోకి అనువదించే వారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు మనకు తెలియాలన్నది వారి ఉద్దేశం. మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, మన కవులు, రచయితల గొప్పతనం, సాహిత్యం ఉత్తరాది వారికి తెలియజేయాలన్న కుతూహలం నాలో కలిగింది. దేశంలో మూడొంతుల మంది మాట్లాడే హిందీ భాషలోకి తెలుగు రచనలు అనువదించాలని నిర్ణయించాను. జానపద సాహిత్యం, బాలసాహిత్యంపై రెండు పుస్తకాలు హిందీలో రాశాను. ఇవి సొంత రచనలు. వీటికి ఎంతో పేరు రావడంతో రచయితగా తృప్తికలిగింది. ఆ తర్వాత అడవి బాపిరాజు నుంచి కమల కుమారి వరకు 19 మంది రచయితల కథలను హిందీలోకి అనువదించి 'మసీదు పావురం' పేరుతో పుస్తకం తీసుకువచ్చాను.

రావూరి 'జీవన సమరం'తో మంచిపేరు

ప్రఖ్యాత తెలుగు రచయిత రావూరి భరద్వాజ తెలుగు నేలలో 56 వృత్తులపై రాసిన జీవన సమరం పుస్తకాన్ని హిందీలోకి అనువదించాను. ఆయా వృత్తుల పుట్టు పూర్వోత్తరాలు, మూలాలు, ఎలా అంతరించిపోయాయి అనే దానిపై ఆయన పరిశోధన చేసి రాసిన పుస్తకమే 'జీవన సమరం'. ఈ పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ ముద్రించింది. ప్రఖ్యాత రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి రాసిన 'తన మార్గం' పుస్తకాన్ని హిందీలోకి అనువదించా. దీన్ని కూడా కేంద్ర సాహిత్య అకాడమీ ముద్రించింది. తెలుగు రచయిత జయంతి పాపారావు రాసిన 'వెతుకు...వెంటాడు...వేటాడు' పుస్తకాన్ని 'గిఫ్ట్‌ప్యాక్' పేరుతో అనువదించా. ఈ పుస్తకానికి 2006లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

ఉదయం ఎండ...సాయంత్రం వాన

పోస్టుగ్రాడ్యుయేషన్ చదివేందుకు 1970లో విశాఖ వచ్చినప్పుడు విశాఖ ఎంతో ప్రశాంతంగా ఉండేది. ఉదయం ఎండకాస్తే సాయంత్రానికి వర్షం కురిసేది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేది. ప్రభుత్వ మానసిక ఆసుపత్రి తరువాత జనావాసాలు ఏమీ ఉండేవి కావు.

జ్ఞానపీఠ్ అవార్డు తెలుగు బోర్డు కన్వీనర్



ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ అవార్డు ఎంపిక కమిటీలో ప్రాంతీయ భాషకు ఒక బోర్డు ఉంటుంది. ముగ్గురు సభ్యులతో ఉండే ఈ కమిటీకి రెండుసార్లు కన్వీనర్‌గా పని చేశా. నేను కన్వీనర్‌గా ఉన్నప్పుడే రావూరి భరద్వాజకు జ్ఞానపీఠ్ అవార్డు వచ్చింది. రావూరి రచనలను అప్పటికే హిందీలోకి నేను అనువదించి ఉన్నా. రావూరి పేరు తెలియని తెలుగు సాహితీ ప్రియులు ఉండరు. కానీ సి.నారాయణరెడ్డి తర్వాత మరెవరికీ జ్ఞానపీఠ్ అవార్డు రాలేదు. ఈ విషయాన్ని కమిటీ దృష్టికి తీసుకువెళ్లాను. దీంతో రావూరి రచనలపై కమిటీలో చర్చసాగింది. అనంతరం రావూరి రచనలన్నీ పంపాలని అవార్డు కమిటీ కోరింది. హిందీలోకి అనువదించిన రావూరి రచనలు సేకరించి కమిటీకి అందజేశాను. ఆయన రచనలు పరిశీలించిన కమిటీ రావూరికి జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటించింది. రచయితగా ఆయనకు న్యాయం జరిగిందని సంతోషించా. అలాగే జ్ఞానపీఠ్ అవార్డు పరిధిలోని మూర్తి దేవి పురస్కార్ కమిటీలో జ్యూరీ సభ్యురాలిగా ఉన్నప్పుడే కొలకలూరి ఇనాక్‌గారికి మూర్తిదేవి పురస్కార్ వచ్చింది. నా హయాంలో ఇద్దరు తెలుగు రచయితలకు ఈ పురస్కారాలు దక్కడం సంతృప్తినిచ్చింది. యువత కెరీర్ తపనలో కుటుంబాలకు దూరమైన నేపథ్యంతో 'పరుగు' అనే పుస్తకం రాశా. త్వరలో ఇది విడుదల కానుంది. కేంద్ర సాహిత్య ఆకడమీ కోసం రచనలు చేస్తున్నాను. ఇంటర్ విద్యార్థులకు హిందీ పాఠ్యాంశాలు రాశాను.

గ్రామీణ ప్రజల జీవనంపై ప్రాజెక్టు

1976లో ఆంధ్రవిశ్వవిద్యాలయం హిందీ విభాగంలో అధ్యాపకురాలిగా చేరాను. ఆచార్యురాలి హోదాలో 2006లో పదవీ విరమణ చేశాను. అధ్యాపకురాలిగా కంటే రచయితగానే సంతృప్తినిచ్చింది. వృత్తిపరంగా నాలుగు ప్రాజెక్టులు చేపట్టాను. ఈస్థటిక్ స్టడీస్, దళిత సాహిత్యం, మైథలాజికల్ స్టడీస్ పూర్తి చేశాను. స్వాతంత్ర్యానంతరం ఉత్తర, దక్షిణభారతంలో గ్రామీణ ప్రజల జీవన పరిస్థితులపై తెలుగు, హిందీ కవులు రాసిన నవలల ఆధారంగా చేపట్టిన అధ్యయనం త్వరలో యూజీసీకి నివేదించాలి. ప్రతి విషయంలో గ్రామీణ ప్రజలు దోపిడీకి గురవుతున్నారని తెలిసింది. రాజకీయాలు, ఆర్థిక ఇబ్బందులు, సాంఘిక కట్టుబాట్లు, మతపరమైన దోపిడీలో చిక్కుకుంటున్నారు. దక్షిణాదికంటే ఉత్తరాదిలో గ్రామీణ ప్రాంత ప్రజల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది.



వాజ్‌పేయి నుంచి రెండుసార్లు అవార్డు

పందొమ్మిది మంది తెలుగు రచయితల కథలను 'మసీదు పావురం' పేరుతో హిందీలోకి అనువదించిన పుస్తకానికి అప్పటి ప్రధాని వాజ్‌పేయి చేతులు మీదుగా అవార్డు తీసుకున్నాను. 'హిందీ రైటర్స్ ఆఫ్ నాన్ హిందీ స్పీకింగ్ ఏరియాస్' కోటాలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో ఈ అవార్డు ఇచ్చింది. 2001లో కేంద్రీయ సంస్థాన్ నేతృత్వంలో లక్నోలో వాజ్‌పేయి చేతులు మీదుగా 'సౌహార్థ సమ్మాన్' అవార్డు అందుకున్నా. దక్షిణాఫ్రికాలో జోహాన్స్‌బర్గ్‌లో 2007లో జరిగిన ఎనిమిదో ప్రపంచ హిందీ మహాసభల్లో భారత్ తరపున పదిమంది రచయితలను సత్కరించి అవార్డు ఇస్తే వారిలో నేనూ ఉన్నా. భోపాల్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ చేతులు మీదుగా 'సర్వభాషా సాహిత్య సన్మాన్' పురస్కారం అందుకున్నా. ఇటీవల మధ్యప్రదేశ్ ప్రభుత్వం హిందీభాషా సమ్మాన్ అవార్డు ప్రదానం చేసింది. ఈ ఏడాది మే 30న అప్పటి రాష్ట్రపతి చేతులు మీదుగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఇచ్చే 'గంగాశరణ్ సింహ' పురస్కారం అందుకున్నా. నూరేళ్ల తెలుగు కథ కోసం రచయిత జయంతి పాపారావుతో 'నూరేళ్లు... నూరు కథలు...నూరుగురు కథకులు' పేరిట 2010లో ఒక పుస్తకం తీసుకువచ్చాం. ఆయా కథలు ఏ పత్రిక/ వార/మాసపత్రికలో ప్రచురితమయ్యాయో సేకరించాం.

మెడిసిన్‌లో సీటొచ్చినా చేరలేదు

కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని ఎలుకలపాడు మా సొంతూరు. నాన్న నాగభూషణం వ్యవసాయం చేసేవారు. అమ్మ అన్నపూర్ణ. మేము నలుగురం. నాకు ముగ్గురు సోదరులు. మూడో తరగతి వరకు సొంతూరులో చదివి ఆరో తరగతికి గుడివాడ వెళ్లి ఏడాదిలోనే తిరిగి వచ్చేశాను. ఏడో తరగతి నుంచి పొరుగూరు ఉంగటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాను. ఎస్ఎస్ఎల్‌సీ వరకు అక్కడే చదివి పీయూసీకి విజవాడ మేరీస్టెల్లా కళాశాలలో చేరాను. డిగ్రీ కోసం గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలకు వెళ్లాను. పీయూసీలో ఎక్కువ మార్కులు రావడంతో మెడిసిన్‌లో సీటొచ్చింది. డిగ్రీ పూర్తిచేసి బీఈడీ చేస్తే ఉద్యోగం వస్తుందని పెద్దన్నయ్య చెప్పడంతో వైద్యవిద్యలో చేరే ఆలోచనను మానుకున్నాను. అప్పట్లో సైన్స్‌లో ఉపాధి అవకాశాలు తక్కువ. బీఈడీ చేయాలని చెప్పడంతో పీజీలో ఎమ్మెస్సీకి బదులు ఎంఏ హిందీలో చేరాను. తరువాత ఎమ్మెస్సీ చేయాలనుకున్నా పరిశోధనల కారణంగా వీలుకాలేదు.

పీజీలో సిద్ధాంత వ్యాసం తప్పనిసరి

అప్పట్లో భాషా కోర్సులు చదివే విద్యార్థులకు పీజీ ఫైనల్ ఇయర్‌లో సంస్కృతం పేపరు ఉండేది. ఇంకా సిద్ధాంత వ్యాసం (డిజర్టేషన్) తప్పనిసరి. దీంతో హిందీలో ప్రఖ్యాత రచయిత సుమన్‌పై ఓ పుస్తకం



రాశాను. ఆ తర్వాత రచనలపై మక్కువ ఏర్పడింది. పాఠశాల స్థాయి నుంచి కవిత్వం రాసినా పీజీ నుంచి మరింత ఇష్టమేర్పడింది. నాన్న పదిహేనేళ్లు సర్పంచ్‌గా పనిచేయడంతో పంచాయతీ లైబ్రరీ మా ఇంట్లో ఉండేది. లైబ్రరీలోని పుస్తకాలు చదివే అలవాటు ఉండడంతో రచనలపై ప్రభావం పడింది.

జగన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు.. రాష్ట్రానికి ఇచ్చే సందేశం ఇదేనా అని ఆగ్రహం

అనకాపల్లి: నడిరోడ్డుపై చంద్రబాబును కాల్చి చంపాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక బైపాస్ రోడ్డులోని ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లలో ముఖ్యమంత్రి అవుతానని ప్రచారం చేసుకుంటున్న జగన్ రాష్ట్రానికి ఇచ్చే సందేశం ఇదేనా అని ప్రశ్నించారు. చంపడం, నరకడం అనే అప్రజాస్వామిక మాటలు మాట్లాడే జగన్ ప్రజలకు ఏం చేస్తాడన్నారు. చంద్రబాబుపై జగన్ చేసిన వ్యాఖ్యలు అసందర్భంగా ఉన్నాయన్నారు. ఫ్యాక్షన్ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి అటువంటి మాటలు రాకపోతే ఇంకేం మాట్లాడతారని ఆయన విమర్శించారు. ఓ రాష్ట్రానికి ప్రతిపక్ష నేత అయి ఉండి పాలకపక్షం తప్పులు చేస్తే సరి చేయాల్సిన జగన్ ఇలా మాట్లాడడం సరికాదన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు, బుద్ద నాగజగదీశ్వరరావు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 13 ఏళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లు ప్రతిపక్ష నాయకుడిగా పనిచేశారని, అటువంటి వ్యక్తిపై ఇష్టానుసారం మాట్లాడడం మంచిదికాదన్నారు. ఈ వ్యాఖ్యలతో జగన్ నిజస్వరూపం పూర్తిగా ప్రజలకు తెలిసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు గుణపాఠం తప్పదన్నారు. ఇప్పటికే సగం పార్టీ ఖాళీ అయిపోయినా బుద్ధి రాలేదన్నారు. 12 కేసుల్లో ఎ1 ముద్దాయిగా ఉన్న జగన్‌కు రేపోమాపో జైలుకు పోవడం ఖాయమని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తానని జగన్ భ్రమలో ఉన్నాడన్నారు. జగన్ మాటలు విన్న ప్రజలకు చంద్రబాబునాయుడుపై మరింత సానుభూతి పెరిగిందన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ వైపీసీ అధినేత జగన్ సైకో మాదిరిగా వ్యవహరిస్తున్నారన్నారు. నక్సలైట్లు, ఫ్యాక్షనిస్టు మాట్లాడే భాష మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునే విధంగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. ఇటువంటి వ్యక్తి రాజకీయాలకు పనికిరాడని, తిరిగి జైలుకు పంపాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌యూసీసీ సభ్యుడు గుత్తా ప్రభాకర చౌదరి, బొడ్డేడ రామచంద్రరావు పాల్గొన్నారు.

జగన్‌కు పిచ్చిపట్టింది: ఎమ్మెల్యే అనిత



విశాఖపట్నం: వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు పిచ్చిపట్టి సైకోలా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే అనిత అన్నారు. శనివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్‌ది ఫ్యాక్షన్ ఫ్యామిలీ కావడంతో విద్రోహ చర్యలను ప్రేరేపించేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. తాతకు తగ్గ మనవడిగా ఫ్యాక్షనిజమ్‌ను నరనరాన జగన్ జీర్ణించుకున్నారని ఆరోపించారు. జగన్‌ను నమ్ముకున్నవారంతా రోడ్డును పడతారని జోస్యం చెప్పారు. జగన్ సైకిక్ స్వభావానికి భయపడి వారి ఎమ్మెల్యేలు ఇతర పార్టీల్లో చేరుతున్నారని అనిత విమర్శించారు. కేసుల మాఫీ కోసం జగన్ ఢిల్లీ నాయకుల కాళ్లు కూడా పట్టుకున్నారని ఆరోపించారు. నంద్యాలలో ఓడిపోతే చేతులకు గాజులు తొడుక్కుంటానన్న వ్యాఖ్యలకు స్పందిస్తూ.. అపజయానికి మహిళలు గుర్తా అని ప్రశ్నించారు. మహిళలపై జగన్ చూపిస్తున్న వివక్షతకు ఇది నిదర్శనమని అనిత అన్నారు.

నిరంతర అధ్యయనంతోనే ఉన్నతి సాధ్యం

హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 5 : నిరంతర అధ్యయనం, వృత్తి పట్ల బలమైన ఆత్మవిశ్వాసం న్యాయవాదుల ఉన్నతికి సోపానాలని ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్ అన్నారు. సిరిపురం వుడా చిల్డ్రన్స్ ఎరీనా థియేటర్‌లో శనివారం విశాఖ న్యాయవాదుల సంఘం నిర్వహించిన డీవీ సుబ్బారావు స్మారక వృత్తిలో నైపుణ్యాల వృద్ధిపై ప్రత్యేక శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని నేర్చుకోవడం, పునశ్చరణ తరగతుల్లో పాల్గొనడం అవసరమన్నారు. న్యాయశాస్త్రం ఉత్సాహవంతమైన అంశమని, సమాజంలో అవసరాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు న్యాయవాదుల ప్రతిభకు దర్పణంగా నిలుస్తాయని చెప్పారు. గతంలో నేర శిక్షాస్మృతి పరిధిలో సెక్షన్లకు ఇచ్చే ప్రాధ్యానతకు, ప్రసుత్తం మార్పులకు మధ్య వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. గతంలో నిరాదరణ పొందిన చెక్కుల విషయంలో, నేటి పరిస్థితుల్లో మార్పులను సోదాహరించారు. మనిషి ఎదగడానికి అవసరమైన సప్త సూత్రాలను వివరించారు. రంపం పనిచేయాలంటే సానపెట్టాలన్నారు. న్యాయవాద వృత్తిని పదునైన రంపంతో పోల్చారు. విషయగ్రాహ్యం లేకపోతే రాణించలేమని చెబుతూ భక్త మార్కేండేయ కథలో ఇమిడి ఉన్న శాస్త్రీయతను సోదాహరించారు. న్యాయశాస్త్రం సాగరం వంటిదని, సరైన అధ్యయనం, భాషాపరిజ్ఞానం లోపిస్తే ఎదుగుదల సాధ్యం కాదన్నారు. చదివే అంశాలపై స్పష్టత, అవసరమైన విషయాలను మాత్రమే ప్రస్తావించాలన్నారు. నేర శిక్షాస్మృతిలోని పలు విషయాలను వివరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వెంకటజ్యోతిర్మయి మాట్లాడుతూ మౌలిక సూత్రాలు, వృత్తిలో క్రమశిక్షణ, కోర్టులో ప్రవర్తించే తీరు సాక్షుల విచారణ, వివరించే తీరుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పూసర్ల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల జగదీశ్వరరావు, 2వ అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి యు.సత్యారావు, ప్రముఖ న్యాయవాది డీవీఎస్ఎస్ సోమయాజులు తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సదస్సు ఆదివారం కూడా కొనసాగనుంది.

నూకరత్నానికి ఇంటి వద్దే డెంగ్యూ, పచ్చకామెర్లు

సమాచారం ఇవ్వని తల్లిదండ్రులు, విద్యార్థిని

కోనాం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి

చీడికాడ: ఇంటర్ విద్యార్థిని నూకరత్నం తల్లిదండ్రుల వద్ద ఉన్నప్పుడే డెంగ్యూ, పచ్చకామెర్లకు వైద్యం పొందిందని, తగ్గిన తర్వాత పాఠశాలకు వచ్చిందని కోనాం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మీదేవి చెప్పారు. ఆమె ఆ రెండు వ్యాధులతో బాధపడిందని, వైద్యం చేయించామని ఆమె తల్లిదండ్రులు చెప్పలేదని, కనీసం నూకతర్నం కూడా తమకు ఆ విషయం చెప్పలేదన్నారు. ఈ రెండు వ్యాధులకు వైద్యం చేయించామని తమకు చెప్పి ఉంటే నూకరత్నానికి ప్రత్యేక ఆహారం ఇచ్చి ఉండేవారమన్నారు. ఈ విషయం చెప్పకపోవడం వల్ల తోటి విద్యార్థులకు అందించే మెనూలో గుడ్డు, మాంసం తినడం వలనే ఈ వ్యాధులు మరలా వచ్చి ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. జూలై 26న జ్వరం వచ్చిందని నూకరత్నం చెప్పిన విషయాన్ని తమ సిబ్బంది చెప్పలేదని, కనీసం తనకు కూడా సమాచారం ఇవ్వకుండా నూకరత్నం తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆమెను అమ్మమ్మతో పంపించడం తమ సిబ్బంది తప్పేనని అన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల జూలై 27, 28, 29 తేదీల్లో తాను సెలవు పెట్టానని లక్ష్మీదేవి తెలిపారు.



ఎం.లక్ష్మీదేవి, ప్రిన్సిపాల్

విద్యార్థినిని తీసుకువెళ్లిన ఆమె అమ్మమ్మ 27న సాయంత్రం ఆర్ఎంపీ వైద్యునికి చూపించడంతో అతడి సలహా మేరకు కనీసం 28న ఉదయం పెద్దాస్పత్రికి తీసుకువెళ్లి ఉంటే బాగుండేదన్నారు. 30 మధ్యాహ్నం వరకూ నూకరత్నాన్ని ఇంటి వద్దే ఉంచి, అర్ధరాత్రి కాకినాడ పెద్దాస్పత్రికి తీసుకువెళ్లారన్నారు. అక్కడ వైద్యం పొందుతూ, 31వ తేదీ అర్ధరాత్రి ఆమె మృతి చెందినట్లు తెలిసిందన్నారు. అయితే తమ సిబ్బంది నిర్లక్ష్యంతోపాటు విద్యార్థి తల్లిదండ్రులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓ మంచి విద్యార్థినిని కోల్పోయామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు తమపై ఏ చర్య తీసుకున్నా సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు.

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, ఉత్సవాలు... తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి

విలేకరుల ఫోన్ నంబర్లు

అరకులోయ	94408 67497	డుంబ్రిగుడ	94918 02681
అరకు రూరల్	94401 13448	హుకుంపేట	85000 97775
అనంతగిరి	73828 27555	ముంచంగిపుట్టు	94928 19993
అనంతగిరి రూరల్	94411 79874	పెదబయలు	94923 44301

అలంకారప్రాయంగా ఎన్‌టీఆర్ సుజల పథకం

అరకురూరల్: పట్టణంలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ సుజల పథకం గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపం కారణంగా మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ప్రస్తుతం ఇది అలంకారప్రాయం మిగిలింది. ఈ పథకం ద్వారా ప్రజలకు ఏమేర ఉపయోగపడుతుందనే కనీస ఆలోచన లేకుండా ఏర్పాటు చేయడంతో ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. ఈపథకం ఏర్పాటుకు అధికారులు హుడావుడి చేశారు. తాగునీటి సరఫరాకు తగిన నీరు లేకపోయినప్పటికీ ఓవర్ హెడ్ ట్యాంకు, ఆర్‌వో ప్లాంట్‌లకు నీటిని శుద్ధిచేసేలా చర్యలు చేపట్టారు. శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులతో పథకం ప్రాంరంభించేలా చర్యలు చేపట్టారు. ప్రారంభమైన కొన్నాళ్లకే పథకం పరిస్థితి అలంకారప్రాయంగా మారింది. ఆ నీటి నుంచి దుర్వాసన రావడం, అడుగు భాగంలో మట్టి చేరడం, మట్టివాసన రావడం వంటివి



నిరుపయోగంగా వున్న ఎన్‌టీఆర్ సుజల పథకం

లోపాలను కొద్దిరోజులకే గమనించిన ప్రజలు వినియోగించడం మానేశారు. ఈ ప్లాంట్‌కు పక్కనే ఉన్న రూ.కోటి పథకానికి సంబంధించిన ట్యాంకు నుంచి వచ్చే నిల్వ నీటిని శుద్ధజలాలుగా వినియోగించే ప్రయత్నం చేశారు. ఆనీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో సుజల పథకం కొద్ది నెలలకే మూతపడింది. తొలుత అరకులోయ పట్టణ పరిధిలోని ఓ డ్వాక్రా సంఘం మహిళకు నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. పథకమే సక్రమంగా నడవకపోవడం ఎప్పటికప్పుడు సమస్యలతో మూత పడుతుండడంతో నిర్వాహకులు సైతం విడిచిపెట్టారు. నిరుపయోగంగా వున్న ఈ పథకం వున్న చోటే నూతనంగా బోరు వేశారు.

ప్రహరీగోడ నిర్మించారు. పలుమార్లు ఆర్‌వో ప్లాంట్‌లకు సంబంధించిన సామగ్రి మార్చారు. ఇలా సుమారు రూ.8 లక్షలు వరకు దఫదఫాలుగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిధులు వ్యయం చేశారు. తప్పా పట్టణ వాసులకు మాత్రం శుద్ధినీటి జలాలు పంపిణీ చేయడంలో విఫలమయ్యారు.

అన్ని పంచాయతీలను ఓడీఎఫ్‌లుగా తీర్చిదిద్దుతాం

ఎంపీడీవో, రమేష్‌రామన్,అనంతగిరి



ఇంటర్వ్యూ

ప్రశ్న: మండల పరిషత్ సాధారణ అభివృద్ధి నిధులు ఎంతవరకు అందుబాటులో వున్నాయి?

జవాబు: ప్రస్తుతం రూ.5 లక్షల వరకు మండల సాధారణ అభివృద్ధి నిధులు అందుబాటులో వున్నాయి. వాటిని కార్యాలయ నిర్వహణతో పాటు మంచినీటి సమస్య పరిష్కారానికి ఖర్చుచేస్తున్నాం.

ప్ర: ప్రస్తుతం మండల పరిషత్‌కు ఆదాయ మార్గాలు ఏమిటి?

జ: మండలంలో ఒక్కో వ్యక్తికి ఎనిమిది రూపాయలు చొప్పున ప్రభుత్వం నిధులను ఇస్తుంది. ప్రతీ మూడు నెలలకొకసారి ఈ నిధులు అందుతాయి.ఇసుక ఉచితం కావడంతో ఆనిధులు నిలిచిపోయాయి.

ప్ర: భూ రిజిస్ట్రేషన్‌ల వల్ల ఎంత ఆదాయం వస్తుంది?

జ: మండలంలో ఐదు గిరిజనేతర పంచాయతీల నుంచి భూ రిజిస్ట్రేషన్‌ల వల్ల రాయల్టీ వచ్చేది. గడిచిన నాలుగేళ్లుగా ఆనిధులు అందాల్సిఉంది.పంచాయతీలకు, మండల పరిషత్‌కు కలిపి ఐదు లక్షల వరకు ఆనిధులు రావాలి.

ప్ర: ఓడిఎఫ్‌గా పంచాయతీలను ఎప్పటికి తీర్చిదిద్దగలరు?

జ:ఇప్పటికే మూడు పంచాయతీలను ఓడీఎఫ్‌లుగా తీర్చిదిద్దాం.పెదకోటలో 99 శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.అక్టోబర్ నాటికి పైనంపాడు, బొర్రా, చిలకలగెడ్డ, జీనబాడు పంచాయతీలను ఓడిఎఫ్‌లుగా తీర్చిదిద్దుతాం. అన్ని పంచాయతీలను ఈఏడాదిలోగా ఓడీఎఫ్‌లుగా మారుస్తాం.

-అనంతగిరిరూరల్

ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ


కాశీపట్నంలో ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

అనంతగిరిరూరల్: ఘాట్‌రోడ్డులో ప్రమాదాల నివారణకు తమ వంతు బాధ్యతగా డ్రైవింగ్ చేస్తామని మోటారు యూనియన్ ప్రతినిధులతో అనకాపల్లి మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ సత్యనారాయణ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌ఆర్‌పురం రహదారిలో బుధవారం జరిగిన ప్రమాదాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా శనివారం కాశీపట్నం,బొర్రాలలో మోటారు యూనియన్ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు డ్రైవర్లే బాధ్యత వహించాలన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. లైసెన్స్ లేని డ్రైవర్లను ప్రోత్సహించవద్దని ఆయన సూచించారు. బొర్రాలో పర్యాటకులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మోటారు యూనియన్ ప్రతినిధులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి కానిస్టేబుల్ కూర్మారావు,కాశీపట్నం సర్పంచ్ దేముడు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

పెదబయలు: ఆదివాసీల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బి.సన్నిబాబు అన్నారు. మండల కేంద్రంలో శనివారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కె.శరభన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు బి.సన్నిబాబు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోహితాసు, కోమటి, బి.రామారావు, రాజేశ్వరి, కె.మూర్తి, సీహెచ్ రామకృష్ణ,కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సన్నిబాబు

అరకులోయలో భారీ వర్షం


అరకులోయలో వర్షం కురుస్తున్న దృశ్యం

అరకురూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో శనివారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నరకు పైగా కురిసిన వర్షంతో వరికి ఊపిరి పోసినట్టయిందని పలువురు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఉదయం 11.30 సమయంలో ప్రారంభమైన వర్షం సుమారు రెండు గంటల పాటు కురిసింది. అరకులోయ ప్రాంతం అంతా వర్షం కురవడంతో పూర్తిగా చల్లగా బడింది.

చిన్నారుల ఆరోగ్యానికి తల్లిపాలు వరం


కిలగాడలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు: చిన్నారుల ఆరోగ్యానికి తల్లిపాలు వరమని కిలగాడ పంచాయతీ సర్పంచ్ సీహెచ్ రాజేశ్వరి అన్నారు. శనివారం కిలగాడ పంచాయతీ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు 1, 2ల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా అంగన్‌వాడీల పి.భవానీ, సీహెచ్ యశోదల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ సర్పంచ్ సీహెచ్ రాజేశ్వరి హాజరయ్యారు. అనంతరం మహిళలు, చిన్నారుల, అంగన్‌వాడీలతో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ పసిపిల్లలకు రోగ నిరోధక శక్తికి తల్లి పాలు అవసరమన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని పొందాలని సూచించారు. అప్పుడే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా వుంటారన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ, కొండమ్మ, సింహాచలం, పుష్పావతి, ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయిపల్లి, కె.కొత్తూరు, చెరువుపాకల, మల్కర్‌పుట్టు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షం కురిస్తే వారపు సంత చిత్తడే


బురదలో కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకుసంతబయలులో నిర్వహించే వారపుసంతలో వర్షం కురిస్తే చిత్తడిగా మారుతోంది. దీంతో కూరగాయాలు విక్రయించే చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారపుసంతలో కూరగాయలు, గిరిజనుల సేకరించి తీసుకొచ్చే ఆటవీ ఉత్పత్తులు ఈ బురదలోనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. అయినా ఇక్కడ కనీసం డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేసేందుకు ఈ సంతలో ఆశీలు వసూలు చేసే వారు కనీసం దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వర్షాకాలంలో అరకు వారపుసంతలో సంత చేసేందుకు వచ్చిన గిరిజనులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించాలని గిరిజనులు కోరుతున్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

పెదబయలు: మండలంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి కె.సింహాచలం అన్నారు. ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం సమావేశం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో వేడుకలను నిర్వహించేందుకు సమావేశంలో నిర్ణయించారు. ఎంపీపీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం, థింసా నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు వంటిని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


జీనబాడు వసతి గృహంలో ఇరుకుగా ఉన్న బంకర్‌బెడ్లు


జీనబాడు పాఠశాలలో పూర్తికాని బయో టాయిలెట్లు

సమస్యల్లో జీనబాడు ఆశ్రమోన్నత పాఠశాల

- చాలీచాలని గదుల్లో వసతి
- మరుగుదొడ్లు చాలక అవస్థలు
- భోజనాలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

అనంతగిరిరూరల్: మండలంలోని జీనబాడు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలోగల సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. ఈపాఠశాలలో 303 మంది విద్యార్థినులు విద్యనభ్యసిసున్నారు. వసతి గృహంలో వీరికి ఎనిమిది మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో వుండగా సెప్టిక్ ట్యాంకు నిండిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. బయో టాయిలెట్ల నిర్మాణం పూర్తికాక అవి నిరుపయోగంగా మారాయి. దీంతో విద్యార్థినులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న గదిలో పది బంకర్‌బెడ్లను పక్కపక్కనే వేసి వాటిపైనే విద్యార్థులు పడుకోవాల్సి వస్తోంది. దేవరాపల్లికి సమీపంలో వున్న ఈ పాఠశాలలో బంకర్‌బెడ్లు ఇరుకుగా వుండడంతో విద్యార్థినులు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. భోజనాలు చేసేందుకు ప్రత్యేకమైన డైనింగ్ హాల్ లేకపోవడంతో పాఠశాల వరండాలోనే అంతమంది విద్యార్థినులు తినాల్సి పరిస్థితి నెలకొంది. వర్షాకాలం అయినందున వారు భోజనాలను చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.


జీనబాడు పాఠశాలలో వరండాలో కూర్చొని భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లాం



వసతి గృహంలో నెల కొన్న సమస్యలను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకొని వెళ్లాం. ఇటీవల ఆయన పాఠశాల పర్యటించిన సమయంలో మరుగుదొడ్లను పరిశీలించారు.అదనంగా పాఠశాల భవనం అవసరం ఉంది.వసతి గృహంలో వేడి నుంచి ఉపశమనం కల్పించేందుకు 36 ఫ్యాన్లను ఏర్పాటుచేయనున్నాం.

లెంకారాములు,
ప్రధానోపాధ్యాయులు

తపాలా సేవలను సద్వినియోగపరచుకోవాలి


కుమడలో పోస్టాఫీసును ప్రారంభిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు: తపాలా సేవలను ప్రజలంతా సద్వినియోగపరచుకోవాలని కుమడ ఎంపీటీసీ సభ్యుడు ఎం.మత్స్యపడాల్ అన్నారు. శనివారం మండలంలోని కుమడ పంచాయతీ కేంద్రంలో నూతన తపాలా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మత్స్యపడాల్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో తపాలా సేవలు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. తపాలా శాఖలో సేవింగ్ ఖాతాలు ఉన్నాయని, వాటిని తెలుసుకుని ఖాతాలు తెరిచి సద్వినియోగించుకోవాలన్నారు. అలాగే రంగబయలు, బుంగాపుట్టు, దోడిపుట్టు పంచాయతీ కేంద్రాల్లో సైతం పెదబయలు ఇన్‌చార్జి ఎస్‌పీఎం పి.భాస్కర్‌రావు పోస్టల్ బ్రాంచి కార్యాలయాలను ప్రారంభించారు. పోస్టల్ సేవలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది సీహెచ్ కృష్ణారావు, కొండబాబు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




బాలింతలకు అవగాహన కల్పిస్తున్న గీతం యూనివర్సిటీ విద్యార్థులు, హాజరైన బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

బాలింతలకు అవగాహన కార్యక్రమం

తల్లిపాల ప్రాముఖ్యతపై వివరిస్తున్న గీతం విద్యార్థులు

అనంతగిరి: తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యమని గీతం వర్సిటీ విద్యార్థులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గీతం యూనివర్సిటీ కమ్యూనిటీ హెల్త్ విభాగం వైద్యులు సాయిదాస్,శ్రీవిద్యలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, కనీసం బిడ్డకు ఆరునెలల వచ్చేవరకు అయినా తల్లిపాలు ఇవ్వాలని అన్నారు. అలా ఇవ్వడం వల్ల బిడ్డకు మేధోసంపత్తి పెరగడమే కాకుండా ఆరోగ్యంగా వుంటారన్నారు. మన్యంలో అధికంగా రక్తహీనతతో గర్భిణులు, చిన్నారులు వుంటున్నారని, దానికి కారణం మన పరిసరాల్లో దొరికే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులతో పండించే ఆకుకూరల్లో అధికంగా పోషక విలువలు వున్నాయన్నారు. మన్యంలో అధికంగా గర్భిణులు, బాలింతలు తగు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్నారు.

అలా కాకుండా గర్భిణిగా వున్న ప్రతీఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతగిరి మండలంలోనే తొలుత ఈఅవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. భవిష్యత్తులో గీతం వర్సిటీ నుంచి మరికొన్ని అవగాహన కార్యక్రమాలను చేపట్టి తల్లిపాలు ప్రాముఖ్యత గర్భిణులు,బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మరింత అవగాహన కల్పించనున్నామని గీతం ప్రతినిధి సతీష్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి శారద,సూపర్‌వైజర్లు రాజేశ్వరి,సుశీల, లక్ష్మి,ప్రాజెక్ట్ అసిస్టెంట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కించుమండ వారపుసంత ఆశీలు వేలం


ఆశీలు వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ వారపుసంతలో ఆశీలు వసూలుకు పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు వేలం పాట నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ వేలం పాటకు ఈవోపీఆర్‌డీ, ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి పాల్గొని పాటను నిర్వహించగా హరిబారికి గాసినాయుడు అనే గిరిజనుడు రూ.1.32లక్షలకు 2017-18 సంవత్సరానికి సంబంధించి ఆశీలు టెండర్‌ను దక్కించుకున్నాడు. టెండర్ నిర్వహణ అనంతరం 50 శాతం డబ్బులు పంచాయతీకి కట్టాల్సి వుండగా రూ.68వేలు పంచాయతీకి కట్టారు. ఈ ఆశీల ద్వారా పంచాయతీ అభివృద్ధికి నిధులు వినియోగిస్తామని మీనాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ డొమిని, కార్యదర్శి భానుప్రియా, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, హరిబారికి సూర్యరావు పాల్గొన్నారు.

టీడీపీ బూత్, పంచాయతీ కమిటీల ఎన్నిక

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని రైతుబజార్ తూనిక కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన తెలుగుదేశంపార్టీ సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు ఆధ్వర్యంలో బూత్‌కమిటీ, పంచాయతీ కమిటీని ఎన్నుకున్నారు. 18 గ్రామ పంచాయతీలకు చెందిన కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల సమక్షంలో కమిటీలను నిర్వహించారు. తెలుగుదేశం పార్టీని మన్యంలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ మండలంలో బూత్‌కమిటీ, పంచాయతీ కమిటీలను పార్టీ ఆదేశాల మేరకే నిర్వహిస్తున్నట్టు సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కె.సుబ్బారావు, ఎం.స్వామి, మాజీ ఎంపీపీ కె.ధన్నేరావు, సీనియర్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

గోరాపుర్‌లో గడపగడపకూ వైసీపీ

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ గోరాపుర్‌లో శనివారం వైసీపీ గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆపార్టీ మండల అధ్యక్షుడు శెట్టి సొర్రు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరకు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టి పాల్గుణ పాల్గొని ఇంటింటి కెళ్లి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన పరిచారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లలో గిరిజన ప్రాంతంలో జరిగిన అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. కురిడి సర్పంచ్ వంతాల గెన్ను పాల్గుణ ఆధ్వర్యంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.శ్రీరాములు, ఎంపీపీ వి.జమున, కురిడి ఎంపీటీసీ సభ్యుడు మహదేవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కమ్మిడి. చిన్నబ్బి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వాడకంతో ఆదా

టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి జి.రామ్మూర్తి


గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు: గ్యాస్ వాడ కంతో ఆదా అవు తుందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి జి.రామ్మూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గ్యాస్ గొడౌన్‌ను ప్రారంభించారు. పలువురు ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ఉచిత గ్యాస్ కనెక్షన్లను గిరిజనులకు అందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.బలరాం, ఎంపీటీసీ సభ్యులు కె.గాసిరావు, జె.రాంచందర్, వైసీపీ మండల అధ్యక్షుడు ఎ.చిట్టిబాబు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు : వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై చర్యలు తప్పవని రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతుకు రుణాలు అందేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి కొత్త విధానంలో రైతులు వ్యవసాయం చేసేలా అధికారులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ వినూత్న రీతిలో పనిచేయడానికి వీలుగా ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్టు అమలు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు అమలు ద్వారా వ్యవసాయంలో పలు మార్పులు రానున్నాయన్నారు. జిల్లాలో రైతులకు 15 వేల ఎల్ఈసీ కార్డులకు 5,105 కార్డులు మాత్రమే పంపిణీ చేయడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సాగుచేస్తున్న ప్రతి రైతుకూ రుణాలు అందేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కౌలు రైతుల విషయంలో బ్యాంకర్లు అనుసరిస్తున్న తీరు మారాలన్నారు. అర్హులందరికీ రుణాలు అందజేయాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరిజవహర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ లక్ష్యాలను సాధించినవారికి జిల్లాల వారీగా గ్రేడింగ్‌లు ఇస్తున్నామని, దీని ఆధారంగా పనితీరును గుర్తిస్తామన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా డి గ్రేడ్‌లో వున్న 17 మందిని విధుల నుంచి తొలగించామన్నారు. చంద్రన్న రైతు క్షేత్రాల సందర్శన సమయంలో వ్యవసాయాధికారులు అందుబాటులో లేకపోతే సస్పెండ్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ సృజన, వ్యవసాయశాఖ జేడీ శివప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

నేటి నుంచి ఆర్టీసీలో లింక్ టికెట్ సౌకర్యం

దూర ప్రాంతాలకు వెళ్లేవారికి రూ.20లకు టికెట్

విశాఖపట్నం:

దూరప్రాంత సర్వీసుల్లో ప్రయాణించే వారికి కొంత రాయితీ కల్పించేందుకు ఆర్టీసీ లింక్ టిక్కెట్ సౌకర్యాన్ని ఆదివారం నుంచి అమలుచేస్తోంది. విశాఖ నుంచి బెంగళూరు, చెన్నై, తిరుపతి, కడప, కర్నూలు, ప్రొద్దుటూరు, శ్రీశైలం, విజయవాడ, అమలాపురం, భీమవరం, నరసాపురం, భద్రాచలం తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారికి ఈ లింక్ టికెట్ సౌకర్యం లభిస్తుంది. ఇది ఆదివారం నుంచి అమల్లోకి వస్తోందని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి.సుదేశ్‌కుమార్ తెలిపారు.

లింక్ టికెట్ అంటే...

జిల్లాలోని అరకు, పాడేరు, నర్సీపట్నం, తగరపువలస, పెందుర్తి ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు హైదరాబాద్, తిరుపతి ఇతర దూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకుంటే వారు నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు, ఎన్ఏడీ జంక్షన్‌లలో బస్సు ఎక్కుతారు. అయితే వారు తమ ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఇక్కడకు వచ్చేందుకు రూ.50కు పైగా చార్జి అవుతుంది. ఇలాంటివారికి టికెట్‌లో రాయితీ కలిపోంది. రూ.20కే లింక్ టికెట్ మంజూరు చేస్తోంది. ప్రయాణికులు దూర ప్రాంతాలకు తీసుకున్న టికెట్‌ను కండక్టర్‌కు చూపిస్తే రూ.20కే లింక్ టికెట్ ఇస్తారు.

నేడు గ్రేడ్-2 పండిట్లకు పదోన్నతుల కౌన్సెలింగ్

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): గ్రేడ్-2 తెలుగు, హిందీ పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతుల కౌన్సెలింగ్ ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరగనున్నదని డీఈవో జి.నాగమణి తెలిపారు. పదోన్నతులకు హాజరయ్యే టీచర్లు విధిగా సర్వీస్ రిజిస్టర్ తీసుకురావాలని సూచించారు.



అచ్యుతాపురం జంక్షన్ వద్ద ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల



జగన్‌పై ఎలమంచిలి సీఐకి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

జగన్‌పై అచ్యుతాపురం పీఎస్‌లో కేసు

ఇటువంటి వ్యక్తి రాజకీయాల్లో ఉంటే ప్రజాస్వామ్యం ఖూనీ

జగన్‌పై 'పంచకర్ల' మండిపాటు

అచ్యుతాపురంలో భారీ ర్యాలీ

అచ్యుతాపురం: జగన్ వంటి వారు నాయకులైతే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఎలమంచిలి ఎమ్మెల్యే, తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం అచ్యుతాపురం జంక్షన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా చేసిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లు ప్రతిపక్ష నాయకుడిగా, 15 ఏళ్లు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, 35 ఏళ్లు రాజకీయ అనుభవం కలిగి ప్రజాస్వామ్యానికి లోబడి పనిచేస్తున్న వ్యక్తిని పట్టుకుని రోడ్డుమీద కాల్చాలి అని అనుచిత వ్యాఖ్యలు చేయడం అప్రజాస్వామికమన్నారు. తాత ఫ్యాక్షనిస్టు, తండ్రి ఫ్యాక్షనిస్టు, నువ్వు రాజకీయాల్లోకి రాకముందునుంచి ఆర్థిక నేరస్తుడివి, ఎంపీగా ఉంటూ 16 నెలలు జైలులో ఉన్నవాడివి, అటువంటి నేరచరిత్ర కలిగిన నీవు ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబునాయుడు మీదే అనుచిత వ్యాఖ్యలు చేసిన నీవు ప్రజాస్వామ్యాన్ని ఎలా గౌరవిస్తావన్నారు. దీనిని తెలుగుదేశం శ్రేణులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈఒక్క రోజుతో అంతా ఊరుకోకుండా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. తొలుత అచ్యుతాపురం నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి భారీ ర్యాలీని నిర్వహించారు. రౌడీ జగన్ నశించాలి, సైకో జగన్ డౌన్‌డౌన్, 420 జగన్ నశించాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జగన్‌పై ఫిర్యాదుని ఎలమంచిలి సీఐ కెకెవీ విజయనాథ్‌కి అందజేశారు. ఈకార్యక్రమంలో అచ్యుతాపురం, మునగపాక ఎంపీపీలు చేకూరి శ్రీనివాసరాజు, ఆడారి మంజు, అచ్యుతాపురం, మునగపాక,రాంబిల్లి మండల పార్టీ అధ్యక్షులు రాజాన రమేష్‌కుమార్, దాడి మునిలినాయుడు, ధూళి రంగనాయకులు, జడ్పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జిల్లా తెలుగుదేశం కార్యదర్శి పి.తులసీరామ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ పోలీసు పేరెడ్ గ్రౌండ్స్‌లో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ శాఖల తరుపున చేపడుతున్న పథకాల ప్రగతి శకటాలను ప్రదర్శనకు సిద్ధం చేయాలని సూచించారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో డీఆర్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఎస్‌ఈగా వేణుగోపాల్ బాధ్యతల స్వీకారం



విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరుగా కె.వేణుగోపాల్ శనివారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరంలో ఎస్‌ఈగా పనిచేస్తున్న ఆయన ఇటీవల బదిలీల్లో విశాఖకు వచ్చారు. ఎస్‌ఈగా పనిచేసిన గజేంద్ర గత నెలలో ఉద్యోగ విరమణ చేయడంతో పీఆర్ ఈఈ రవిబాబు ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు నిర్వహించారు.

నదీ తీరాల్లోనే ఏర్పడిన నాగరికతలు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్

నెహ్రూచౌక్ (అనకాపల్లి): నదుల ఒడ్డునే నాగరికతలు ఏర్పడ్డాయని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కె.జనార్దన్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ర్యాలీ ఫర్ రివర్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రజల జీవన విధానం, సంస్కృతి, నాగరికతలు నదుల ఒడ్డునే ఏర్పడ్డాయన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన నదులు కొంతమంది స్వార్థపరుల వల్ల, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కృషించిపోయాయన్నారు. అనంతరం ర్యాలీ ఫర్ రివర్స్ పోస్టర్‌ను ఆయన అవిష్కరించారు. ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గావాసుదేవ్ మాట్లాడుతూ నదులు ప్రవహించే 16 రాష్ట్రాల్లో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యటించి నదులు వాటిపై జరిగే అక్రమాల కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి కె.పరమేశ్వరరావు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ కె.చిన్నికృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రమేష్, రాజ్‌కుమార్, హిమబిందు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కనుసన్నల్లోనే రాహుల్‌గాంధీపై దాడి

డీసీసీ అధ్యక్షుడు బాలరాజు

నర్సీపట్నం: గుజరాత్‌లో ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీపై దాడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనుసన్నల్లోనే జరిగిందని డీసీసీ అధ్యక్షుడు పి.బాలరాజు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై జరిగిన దాడికి సంబంధించి ఇప్పటివరకు ఎవరిపైనా గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బట్టి గుజరాత్‌లోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాల అండదండలతోనే ఈ దాడి జరిగిందన్నారు.



దేశం కోసం ప్రాణాలర్పించిన నేతల కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీ ఇటువంటి దాడులకు భయపడరన్నారు. దేశ ప్రజల అండదండలు ఉన్న ఆ కుటుంబంపై ప్రభుత్వమే దాడి జరిపించడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటన్నారు. అయితే అధికారం ఎవరికి శాశ్వతం కాదన్న విషయాన్ని బీజేపీ నాయకత్వం గుర్తించాలన్నారు.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి

అధికశాతం మంది జ్వర పీడితులు

పెరుగుతున్న టైఫాయిడ్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి శనివారం రోగుల తాకిడి పెరిగింది. వారం రోజులుగా వాతావరణ మార్పులతో జ్వరాలు అధికమయ్యాయి. శనివారం వారపుసంత కావడంతో అధిక సంఖ్యలో రోగులు సీహెచ్‌సీకి వచ్చి వైద్యసేవలు పొందారు. దీంతో సీహెచ్‌సీ రోగులతో కిటకిటలాడింది. జ్వరాలతో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సీహెచ్‌సీకి అధిక సంఖ్యలో వచ్చారు. వీరిలో అధిక శాతం మందికి మలేరియా జ్వరాలని నిర్ధారణ అయ్యింది.



రోగులతో కిటకిటలాడుతున్న సీహెచ్‌సీ

అనకాపల్లి విద్యార్థికి 305వ ర్యాంకు

ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా నియామకం

అనకాపల్లి రూరల్: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్(ఎస్ఎస్‌సీ)2016-17 సంబంధించి పరీక్షా ఫలితాల్లో అనకాపల్లి గవరపాలెంకు చెందిన విద్యార్థి కర్రి రాజా త్రివిక్రమ్ పరదేశినాయుడు 305వ ర్యాంకు సాధించాడు. ఆలిండియా స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షల్లో పరదేశినాయుడు ఉత్తమ ర్యాంకు సాధించి ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యాడు. ఈపరీక్షల్లో దేశం మొత్తం మీద 18 లక్షల మంది అభ్యర్థులు పాల్గొనగా వారందరిలో పరదేశినాయుడు 305 ర్యాంకు సాధించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



కేఆర్‌టీ పరదేశినాయుడు

ఇచ్చింది మరచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకం ఉంచుకోవడమే నిజమైన స్నేహం
...గాంధీజీ

జీవన క్రమంలో కొత్త స్నేహాలు చేయని మనిషి కొంత కాలానికి ఒంటరి వాడవుతాడు
..శామ్యూల్ జాన్సన్



నా స్నేహితుడు దగ్గర నేను నిజాయితీగా ఉంటాను. లోతుగా ఆలోచిస్తాను
...ఎమర్సన్

కల్పాంతాలు కాలగతి చెందినా కోట్ల సంవత్సరాల ప్రస్థానంలో చెదిరిపోని బంధం స్నేహం
...గుంటూరు శేషేంద్రశర్మ

Happy Friendship Day

జీవన గమనంలో వారధి

నేడు స్నేహితుల దినోత్సవం



● స్వార్థం, అవసరం, అవకాశవాదం అనే పదాలకు చోటులేనిది స్నేహం
● కాలంతోపాటు మారిన అర్థం
● అవసరాల ప్రాతిపదికగా మారిన తత్వం

తోడూ...నీడ స్నేహితుడు

● కష్టసుఖాల్లో వెన్నంటి నడిచే శ్రేయోభిలాషి

● మనుషులు వేరైనా ఒకే మనసుగా ఆలోచించేవారు స్నేహితులు

● ఆలోచనల సంగమమే స్నేహానికి ప్రాతిపదిక
● నిజమైన స్నేహానికి నమ్మకమే పునాది

విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

'స్నేహమే నా జీవితం... స్నేహమేరా శాశ్వతం, స్నేహమే నాకున్నది ...స్నేహమే నా పెన్నిధి' అన్నాడో సినీకవి. 'నిప్పులాంటి మనిషి' చిత్రంలోని ఈ పాట స్నేహం అంతరార్థాన్ని తెలియజెప్పే జీవిత సత్యం. స్నేహం 'నిప్పు'లాంటిది. స్నేహితుడు 'నిప్పు'లాంటి నిజాయితీపరుడైతే ఆ స్నేహం జీవితాంతం వర్ధిల్లుతుంది. జీవన గమనంలో తోడూ, నీడగా కలిసి సాగుతాడు. పొరపాటు జరిగితే జీవితం కలగా కరిగి పోతుంది. కల్లోలమవుతుంది. స్నేహానికి 'నమ్మకం' పునాది. పరస్పర విశ్వాసం ప్రాతిపది. మనసులు కలవాలి... ఒకరినొకరు తెలుసుకోవాలి...స్నేహంలో గెలవాలి...వారే నిజమైన స్నేహితులు. కష్టాల్లో ఉన్నప్పుడు మన తోడూ నీడగా మెలిగిన వాడే నిజమైన స్నేహితుడు. కాలంతోపాటు స్నేహం అర్థం మారిపోయింది. మంచి స్నేహితుడి కోసం కాగడా పెట్టి వెతకాల్సిన రోజులు. స్నేహం అంటే అవసరం, అవకాశం, ఉపయోగం, డబ్బు, హోదా...అన్నవి పర్యాయ పదాలుగా మారిపోయింది. అంతరాలకు విలువలేదు. ఆలోచనలు కలిసే అవకాశం లేదు. మనసులు గెలిచే వారు కాదు. 'పుబ్బలో పుట్టి మఘలో మాడిపోయినట్టు' ఇలా పుట్టి అలా మురిగిపోతున్న స్నేహాలే ఎక్కువ. ఇందుకు కాలంతోపాటు మనుషుల మనస్థత్వాలో వచ్చిన మార్పే కారణం. నేడు స్నేహితుల దినోత్సవం (ఫ్రెండ్‌షిప్ డే) సందర్భంగా నిపుణులతో మాట్లాడి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

అంతరాలకు దూరం

కష్టసుఖాల్లో, లాభనష్టాల్లో ఎల్లప్పుడూ అండగా ఉండేవాడు నిజమైన స్నేహితుడు. నిజమైన స్నేహానికి పేద, ధనిక, వయసు తారతమ్యాలు ఉండవు. ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకం, విశ్వసనీయతే వారి స్నేహానికి బాట. ముఖ్యంగా కష్ట సమయంలో వెన్నుతట్టి ప్రోత్సహించే వాడే అసలు సిసలైన స్నేహానికి నిదర్శనంగా భావించవచ్చు. నిజమైన స్నేహంలో ఒకరిపై ఒకరికి పూర్తి విశ్వాసం ఉండాలి. అప్పుడే స్నేహం చిరకాలం ఉంటుంది. ఒకరి తోడును మరొకరు ఎంజాయ్ చేయాలి. నమ్మకం ఏర్పర్చుకోవాలి. విలువలు, విశ్వసనీయత చెదిరిపోకుండా చూసుకోవాలి. ప్రస్తుతం ఇటువంటి పరిస్థితి చాలావరకు కనిపించడం లేదు. సుఖాల్లో అన్నింటా అండగా ఉన్నట్లు కనిపించే వారు స్నేహితుడు కష్టాల్లో ఉన్నాడనే సరికి ముఖం చాటేస్తున్నారు. ఎదుటి వ్యక్తి స్థాయి, స్థోమతను అనుసరించి స్నేహం చేస్తున్నారు తప్ప నిజాయితీ కనిపించడం లేదు.



స్నేహానికి పరిధులు ఉంటాయి

ఎంతటి స్నేహానికైనా కొన్ని పరిధిలు ఉంటాయి. వాటిని తెలుసుకుని తదనుగుణంగా మసలుకుంటే వారి స్నేహంలో ఎటువంటి పొరపొచ్చాలు వచ్చేందుకు అవకాశమే లేదని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా కొన్ని విషయాల్లో జాగ్రత్త వహిస్తే వారి స్నేహం ఎల్లకాలం పదిలంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

● స్నేహానికి భంగం కలిగించేలా ప్రవర్తన ఉంటే గమనించి మార్చుకోవాలి.
● చిన్న విషయాలను పట్టించుకోకూడదు. చిన్నవిషయాన్ని భూతద్దంలో చూసుకుని సెల్ఫిష్‌గా ఆలోచించకూడదు.
● ఎదుటివాడు మనతో ఎలా ఉండాలని కోరుకుంటామో మనం కూడా ఎదుటివాడితో అలాగే ఉండాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.
● స్నేహంలో లాభ, నష్టాల బేరీజు అసలు ఉండకూడదు. ఈ బేరీజులు ప్రవేశిస్తే మనస్పర్థలు వచ్చే అవకాశం ఉంటుంది.

కొన్నింటికి దూరంగా ఉండాలి

నిజమైన స్నేహితుడు కొన్ని పనులకు దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. సద్విమర్శ మంచిదేగాని అదే పనిగా విమర్శిస్తూ ఉండడం వల్ల దురభిప్రాయం కలిగించే అవకాశం ఉంది. దీనివల్ల ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు తలెత్తే అవకాశం ఉంది. విమర్శ ముల్లులా గుచ్చుకోకుండా సున్నితంగా ఉండేలా చూసుకోవాలి. దానివల్ల ఇద్దరి మధ్య మంచి భావన ఉండేందుకు అవకాశం ఉంది. అదే సమయంలో అతిగా పొగడ్తలు కూడా మంచిది కాదు. నిరంతరం పొగడ్తల్లో ముంచెత్తేవాడు కూడా నిజమైన స్నేహితుడు కాడు. స్నేహితుని మాటల్లో, ప్రవర్తనలో నిగూడ అర్థాలున్నాయేమోననే అనుమానాన్ని దరిచేయనీయకూడదు. స్నేహంలో నిజాయితీ, పారదర్శకత ముఖ్యమైన విషయాలని గుర్తుంచుకోవాలి.

ఆలోచనలు కలవాలి

బాల్యం నుంచి జీవితంలో ఎంతోమంది తారసపడుతుంటారు. ఎంతోమందితో సన్నిహితంగా మెలుగుతుంటాం. వీరందరూ స్నేహితులు కాలేరు. మనకంటూ ప్రాణమిత్రులు, మనమంటే ప్రాణమిచ్చే మిత్రులు కొందరే మిగులుతారు. వీరంతా చిన్ననాటి నుంచి పరిచయస్థులు కావచ్చు. ఉద్యోగ జీవితంలో కలిసిన వారు కావచ్చు. నిజమైన స్నేహితుల బంధంలో గాఢత ఉంటుంది. ఇందుకు కారణం ఇద్దరి ఆలోచనలూ ఒకేలా ఉండడమే. ఇద్దరి మనస్థత్వాలు ఒకరికొకరు ప్రతిబింబంలా ఉంటాయి. ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకునే



సంప్రదాయం ఉంటుంది. ఒకరి తప్పులను మరొకరు ఎత్తిచూపుకునే చొరవ కనిపిస్తుంది. తప్పుడు మార్గాలవైపు వెళితే హెచ్చరించే అన్యోన్యత కనిపిస్తుంది. నిజమైన స్నేహంలో ప్రేమ, ఆప్యాయత, కరుణ, జాలి, భయం, ఆందోళన, హెచ్చరించే స్వరం వంటివన్నీ ఉంటాయి. నిజమైన స్నేహితుడి సంరక్షణకు వీటిని ఉపయోగించేందుకు ఎప్పుడూ వెనుకడుగు వేయని వాడే స్నేహితుడు. కఠినంగా వ్యవహరించడం వల్ల స్నేహం దెబ్బతింటుందని తెలిసినా స్నేహితుడి భవిష్యత్తు కోసం అలా వ్యవహరించే వాడే నిజమైన స్నేహితుడు. ప్రస్తుతం ఇటువంటి పరిస్థితి లేదు. తప్పుచేసినా శెభాష్ అంటూ భుజం తట్టడం, తప్పుడు మార్గాలవైపు నడుస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరించడం, తప్పుడు మార్గాలను ప్రోత్సహించడం కనిపిస్తోంది. ప్రస్తుత స్నేహాలన్నీ పైపై మెరుగుల్లాగా భ్రమపడేవే అంటే అతిశయోక్తి కాదు.

స్నేహం... మూడక్షరాల మంత్రమిది. జీవితాన్ని గెలవాలన్నా, జీవితంలో నిలవాలన్నా మంచి స్నేహితుని ఆసరా అవసరం. మంచి స్నేహానికి అంతరాల్లేవు...స్థాయీ భేదాలు ఉండవు. కష్టసుఖాల్లో జీవితాంతం తోడూనీడగా కలిసి నడిచిన వాడే నిజమైన స్నేహితుడు. జీవితంలో ఎందరితోనో స్నేహం కుదరొచ్చు...కానీ జీవితాంతం దాన్ని కొనసాగించేవాడే అసలైన స్నేహితుడు. 'ఏ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజ్ ఎ ఫ్రెండ్ ఇన్‌డీడ్'...అన్నది ఇంగ్లీష్ సామెత. కష్టాల్లో కలిసి సాగేందుకు ఇష్టంగా వెంట నడిచేవాడు మిత్రుడు. మనిషి సంఘజీవి. ఒంటరిగా జీవించలేడు. మన అవసరాల్లో అన్ని వేళలో నేనున్నానని ముందుకు వచ్చేవాడే స్నేహితుడు. స్వార్థం, స్థాయి, హోదా, కులం, మతం ఇవన్నీ స్నేహానికి వ్యతిరేక పదాలు. పరస్పర నమ్మకమే స్నేహానికి పునాది. ఆలోచనల సంగమం స్నేహం. తనువులు వేరైనా ఆలోచనల్లో ఒక్కటిగా సాగిపోయే వారే ఆప్తమిత్రులు.

కష్టమైనా భరించేవాడు

కొన్ని సందర్భాల్లో స్నేహితుడి ప్రవర్తన వింతగా, ఇబ్బందికరంగా, కష్టంగా అనిపించినా తట్టుకునేవాడే నిజమైన స్నేహితుడు. స్నేహితుడిలో లోపాలున్నా వాటిని పట్టించుకోకుండా ఉండేవాడే ఆప్తమిత్రుడు. అయితే దీనికి కొన్ని పరిమితులు ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. మన స్నేహంలో నిజం ఉన్నప్పటికీ ఎదుటివారి స్నేహంలో అది లోపించినప్పుడు అటువంటి వారికి దూరంగా ఉండడమే మంచిది. అదే సమయంలో చెడు అలవాట్లకు, తిరుగుళ్లకు అలవాటుపడిన వారిని వీలైనంత వరకు మంచి మార్గంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని, మనమే మారుతున్నట్లు అనిపిస్తే వారికి దూరంగా వచ్చేయడమే మేలని నిపుణులు చెబుతున్నారు. మహాభారతంలో దుర్యోధనుడు, కర్ణుడు ప్రాణస్నేహితులు. కర్ణుడు గొప్ప పరాక్రమవంతుడు, ధీరుడు, నీతిమంతుడు. అయినప్పటికీ ప్రాణస్నేహితుడు దుర్యోధనుడు తప్పుచేస్తున్నా వారించకుండా అతని మార్గంలోనే ప్రయాణించి యుద్ధం కోరితెచ్చుకుని ప్రాణాలు పోగొట్టుకున్నాడు. స్నేహితుడిలోని తప్పొప్పులను ఎత్తిచూపిన వాడే మన మేలు కోరేవారు. స్నేహితుడు తప్పుచేస్తే దాన్ని బలంగా చెప్పాలి. మార్చేందుకు ప్రయత్నించాలి.



స్నేహం కోసం...



షేక్ ముక్తర్ బాషా



బాషా ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

■ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ఆదర్శం
■ సామాజిక కార్యకర్త బాషా స్నేహితుల ఘనత ఇది

అనకాపల్లి :

షేక్‌ముక్తర్ బాషా...27 ఏళ్ల ఈ యువకుడు సామాజిక ఉద్యమ కార్యకర్త. 'సమాలోచన' సంస్థలో పనిచేస్తూ పేదలకు అండగా నిలిచే వాడు. పర్యావరణం, సామాజిక న్యాయం కోసం ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరిగే ప్రజాఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవాడు. మన్యంలో అభివృద్ధి పేరుతో చేస్తున్న పర్యావరణ విధ్వంసంతో కలత చెందేవాడు. పేదలకు రేషన్ కార్డులు, విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇప్పించడంలో సహాయపడేవాడు. ఎవరికి ఏ కష్టం వచ్చినా అర్థరాత్రి, అపరాత్రి అనకుండా ముందుండి నడిచేవాడు. బాషా స్నేహితులు నరేష్, కిశోర్, సుందర్‌గణేష్, సురేష్, గణేష్, భాను, చిరంజీవి. సామాజిక కార్యకర్తగా తమ స్నేహితుడి సేవా గుణాన్ని చూసి మురిసిపోయేవారు. బాషా తమ స్నేహితుడని గర్వంగా చెప్పుకునేవారు. అటువంటి స్నేహితుడు బాషా 2012లో వడదెబ్బ తగిలి హఠాన్మరణం చెందాడు. దీంతో స్నేహితులంతా కలత చెందారు. బాషా ఆశయాన్ని బతికించాలని తలపోశారు. ఇందుకోసం బాషా చారిటబుల్ ట్రస్టు ప్రారంభించారు. సమాలోచన, బాషా చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. స్నేహితుడి ఆశయాన్ని కాపాడడం తోపాటు సమాజంలో అతన్ని చిరంజీవిని చేస్తున్నారు. హుద్‌హుద్ తుపాను సమయంలో నిలువనీడ కోల్పోయిన వారికి అండగా నిలిచారు. జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లో విద్యుత్ సౌకర్యంలేని గ్రామాల్లో సోలార్ లైట్లు వెలిగేలా చేశారు. రెండు రాష్ట్రాల్లో ఉత్తమ సేవలందిస్తున్న కార్యకర్తలను ఎంపికచేసి బాషా జ్ఞాపకార్థం మెమెంటో, నగదు బహుమతి అందజేసి సత్కరిస్తున్నారు. ఈ ఏడాది వృద్ధులు, పిల్లలను కాలుష్యం నుంచి కాపాడేందుకు విశ్వమానవ వేదిక ద్వారా పనిచేస్తున్న ఎం.సురేష్‌ను కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, రిటైర్డు ఐఏఎస్ అధికారి ఈ.ఎ.ఎస్.శర్మ ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు చేతులు మీదుగా సత్కరించి 25 వేల నగదు, మెమెంటో అందించారు.



సేవా కార్యక్రమాల్లో సభ్యులు

మారిన అర్థం

స్నేహమనే పదానికి ఇప్పుడు అర్థం మారింది. గతంలో క్లాస్‌మేట్, ఊరివాడు స్నేహితుడు. సోషల్ మీడియా పుణ్యమా అని ఇప్పుడు ముక్కుమొహం తెలియని వాడు స్నేహితుడు. ఈ స్నేహాల్లో చాలావరకు అవసరాలు, అవకాశాలే తప్ప నిజాయితీ ఉండడం లేదు. స్నేహం ఏర్పర్చుకునే ముందు కొన్ని అంశాలు ముఖ్యం.

● వ్యక్తిగత పరిచయం లేకుండా స్నేహం చేయడం మంచిది కాదు. మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ స్నేహానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వకూడదు.
● తెలియని వారు మెసేజ్‌లు పంపినా సమాధానం ఇవ్వకపోవడమే మంచిది.
● స్నేహం కోరే వ్యక్తి అంతరంగాన్ని గ్రహించాలి. అతని/ఆమె స్నేహ హస్తంలోని నిజాయితీని గుర్తించాలి. లేదంటే మహిళలను ఆర్థికంగా, శారీరకంగా వినియోగించుకునే వారు ఉంటారు.
● ఎవరితోనైనా నిజంగా స్నేహం చేయాలనిపిస్తే తల్లిదండ్రులు, తోటి స్నేహితులకు తెలిసేలా చేయడం అన్నివేళలా శ్రేయస్కరం.

స్నేహితుడు ఎలా ఉండాలి?

నిజమైన స్నేహితుడు ఎలా ఉండాలి? అన్న ప్రశ్నకు పలురకాల సమాధానాలు కనిపించినా వాటి సారాంశం మాత్రం ఒక్కటే. నిజమైన స్నేహానికి కొన్ని గురుతులు ఏమిటంటే...



● స్నేహితుడిలోని తప్పొప్పులను నిర్భయంగా, నిర్మొహమాటంగా చెప్పగలగాలి. స్నేహితుడు ఏమనుకుంటాడో అని నిజాలు ఎప్పటికీ చెప్పలేని వాడు స్నేహితుడు కాలేడు.
● స్నేహితుడికి కష్టం, నష్టం కలిగే పక్షంలో దాన్ని తెలియజేసేందుకు అవసరమైతే తన స్నేహాన్ని త్యజించిన వాడై ఉండాలి.
● స్నేహితుని సంతోషాన్ని ఎల్లప్పుడూ కోరుకునేవాడై ఉండాలి. పరస్పర గౌరవం నిజమైన స్నేహంలో ఉంటాయి. అటువంటి స్నేహమే చిరకాలం నిలుస్తుంది.
● కష్టనష్టాల్లో భరోసా కల్పించే వాడై ఉండాలి. స్నేహితుడి విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోనివాడు, ఒకటికి రెండు ఆలోచించే వాడై ఉండాలి. ● నిజమైన స్నేహంలో సహానుభూతి ఉంటుంది. స్నేహితుడి కీర్తిప్రతిష్ఠలు పెంచడానికే ప్రయత్నిస్తుంటారు.

ఇవి స్నేహితుడి లక్షణాలు కావు

కొన్ని రకాల లక్షణలను బట్టి వారిది నిజమైన స్నేహమా? కాదా? అన్నది చెప్పేయవచ్చు. కొంతమంది వ్యక్తిగత స్వలాభం కోసం స్నేహం చేస్తుంటారు. తన అవసరం కొంతమంది స్నేహం అనే ముసుగు ధరిస్తారు. డబ్బు, హోదా, అవసరం, ఆనందం, కోరికలు వంటి వాటి కోసం చాలామంది స్నేహమనే ముసుగు వేసుకుని చేతులు కలుపుతారు. అటువంటి వారితో సదా అప్రమత్తంగా ఉండాలి.

◆ గిఫ్ట్ ఆర్టికల్స్‌కు విపరీతమైన డిమాండ్
◆ కిటకిటలాడిన మార్కెట్లు



స్నేహ సందడి

ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం


కానుక మదిలోని భావాన్ని వ్యక్తపరిచే అందమైన సాధనం. అనురాగంలోని గాఢతను తెలియజేసే అపురూప మాధ్యమం. మనం నోటితో చెప్పలేని అనేక విషయాలు మనం ఇచ్చే కానుక ద్వారా చెప్పొచ్చు. స్నేహితుల దినోత్సవం రోజున అందించే 'కానుక'కు అందుకే అంతటి ప్రాధాన్యం. మనసెరిగిన స్నేహితుడిని మంచి గిఫ్ట్‌తో మురిపించాలి...స్నేహశీలి అయిన సహచరికి విశేష బహుమతి అందించాలి...సర్‌ప్రైజ్ చేయాలి, ప్రత్యేకత చాటుకోవాలి...ఇలా పలు ఆలోచనలతో మార్కెట్‌కు తరలివచ్చిన స్నేహితులతో శనివారం సందడి నెలకొంది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రాణ స్నేహితులకు గిఫ్ట్‌లు, హ్యాండ్ బ్యాండ్స్ వంటివి ఇచ్చేందుకు యువతలో ఆసక్తి కనిపించింది. వ్యాపారులు కూడా అమ్మకాలు పెంచుకునేందుకు స్నేహితుల మనసెరిగి ప్రత్యేకమైన వస్తువులతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. నగరంలోని డాబాగార్డెన్స్, ద్వారకానగర్, మద్దిలపాలెం, సిరిపురం జంక్షన్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లోని షాపుల్లోనూ, షాపింగ్‌మాల్స్‌లోనూ ప్రత్యేక కౌంటర్‌లు పెట్టి మరీ ఫ్రెండ్‌షిప్ డే వస్తువులు విక్రయిస్తున్నారు.











డిమాండ్ భారీగానే...

నగరంలోని పలు గిఫ్ట్ ఆర్టికల్స్ షాపులకు, బేకరీ షాపులకు, స్వీట్స్ దుకాణాలకు స్నేహితుల దినోత్సవ సందడి భారీగానే తాకింది. ఉదయం నుంచే షాపులన్నీ స్నేహితులతో సందడిగా మారాయి. తమకు ఇష్టమైన వారికి అందించేందుకు స్పెషల్ ఫ్రెండిషిప్ మగ్స్, డిఫరెంట్ కొటేషన్స్‌తో ఉన్న ఫ్రెండిషిప్ బాండ్స్, బ్రేస్‌లెట్స్, డిజైన్డ్ కీ చైన్స్, లైటింగ్ విత్ కలర్ ల్యాంప్, చైన్స్, ఫ్రెండిషిప్ కొటేషన్స్‌తో కూడిన బుక్స్, క్యాలండర్స్, స్క్రోల్ బుక్స్, ఫొటో ఫ్రేమ్స్, పిల్లోస్, వుడెన్ ఫ్రేమ్స్, టాయ్స్, ఫ్రెండిషిప్ కొటేషన్స్‌తో కూడిన గ్రీటింగ్ కార్డ్స్, ఫోల్డింగ్స్, మ్యూజికల్ ఫొటో కార్డ్స్, డిఫరెంట్ డిజైన్స్‌తో కూడిన చాక్లెట్లు వంటివి మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఇవన్నీ రూ.10 నుంచి రూ.10 వేల ధరల్లో మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఇవికాకుండా స్వీట్స్, బేకరీ షాపుల్లో కూడా ఫ్రెండిషిప్ డే సందడి కనిపిస్తోంది.

విలువ కట్టలేనిది

స్నేహితుడు ఇచ్చిన కానుక ఎంతటి విలువైనదనే కంటే ఎంత ఆప్యాయతతో ఇచ్చాడన్నదే ముఖ్యం. పిడికెడు అటుకులు ఇవ్వగానే కుచేలుడి స్నేహమాధుర్యానికి పొంగిపోయాడు శ్రీకృష్ణుడు. ఇప్పటి స్నేహంలో కొంత స్వార్థం, సంకుచిత భావాలున్నా ఇప్పటికీ గొప్ప స్నేహి తులు ఉన్నారు. అటువంటి వారంతా తమ స్నేహితులకు అపురూప కానుకలు ఇస్తుంటారు.



ఫ్రెండ్‌షిప్ డే ఎందుకు?

అమెరికా ప్రభుత్వం 1935 ఆగస్టు మొదటి శనివారం ఓ వ్యక్తిని హత్యచేసింది. అతని మరణవార్త విని మరునాడు అతని స్నేహితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై స్పందించిన అమెరికా ప్రభుత్వం వీరి స్నేహానికి గుర్తుగా అప్పటి నుంచి ఏటా ఆగస్టు మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా ప్రకటించినట్టు చరిత్ర చెబుతోంది.

ఒకరి తర్వాత ఒకరిగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.. మరో నలుగురు మృత్యువుతో పోరాడుతున్నారు.. చాలా మంది చలి జ్వరాలతో మూలుగుతున్నారు.. ఎప్పుడు ఏ వార్త వినాల్సి వస్తుందోనని మిగిలిన వారు భయాందోళన చెందుతున్నారు.. ఎవరికీ ప్రమాదం కాకుండా కాపాడాలని తమ ఆరాధ్య దైవానికి పూజలు చేస్తున్నారు.. ఇదీ చింతపల్లి మండలం పినపాడు గిరిజన గ్రామంలోని దయనీయ స్థితి.

జ్వరాలతో మంచం పట్టిన గిరిజనం

- నలుగురి పరిస్థితి ఆందోళనకరం
- ముగ్గురి మరణంతో భయాందోళనలో గ్రామస్థులు
- మృత్యువు నుంచి కాపాడాలని పూజలు
- మొక్కుబడిగా వైద్య శిబిరం..
- జాడ లేని వైద్యాధికారి





శుక్రవారం మరణించిన రామకృష్ణ

వణుకుతున్న పినపాడు

చింతపల్లి: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పినపాడు గ్రామం మరణ భయంతో వణుకుతోంది. ఏ క్షణంలో మృత్యువు ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ గ్రామంలో వారం రోజుల క్రితం ప్రబలిన జ్వరాల కారణంగా ఆశ కార్యకర్తతో సహా ముగ్గురు గిరిజనులు రోజుకొకరు చొప్పున మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ప్రస్తుతం మరో నలుగురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. పినపాడులో వ్యాధులు, వరుస మరణాలపై పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ వైద్య, ఆరోగ్య శాఖలో చలనం కనిపించడం లేదు. తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఈవో నేతల రమణ, సిబ్బంది మల్లేశ్వరరావు, వెంకటలక్ష్మి, సత్యవతి మాత్రమే గ్రామానికి వచ్చి ప్రాథమిక చికిత్స అందించారు. వైద్యాధికారి జాడ లేదు. రెండు రోజులుగా వైద్యాధికారి పీహెచ్‌సీకి కూడా రాలేదని స్థానికులు చెబుతున్నారు.

మృత్యువు నుంచి కాపాడాలని పూజలు

సర్కారు వైద్యం సకాలంలో అందకపోవడం, వరుసగా ముగ్గురు గిరిజనులు మృతి చెందడంతో స్థానిక గిరిజనులు మృత్యువు నుంచి కాపాడాలని పూజలు చేయడం ప్రారంభించారు. గ్రామంలో శుక్రవారం మృతి చెందిన జన్ని రామకృష్ణ అంత్యక్రియలు చేస్తుంటే, మరోవైపు కుల గురువు(గొరవడు)తో రోగులకు పూజలు చేయిస్తున్నారు. గ్రామంలో ఎవరూ మృతి చెందకుండా కాపాడాలని ఆదివాసీల ఆరాధదైవాన్ని ప్రార్థిస్తున్నారు.

బలహీనులను చేసిన ఆచారం

పినపాడు గ్రామ గిరిజనుల ఆచారం రోగులను మరింత బలహీనులను చేసింది. గిరిజన గ్రామాల్లో ఎవరు మరణించినా మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేవరకూ పొయ్యి వెలిగించరు. ఎటువంటి ఆహారం తీసుకోరు. మరణం సంభవించిన గృహంలో వారికి తోడుగా ఉంటారు. ఇది ఆదివాసీలకు అనాదిగా వస్తున్న ఆచారం. గ్రామంలో 2వ తేదీన కిరసని సువర్ణ మృతి చెందింది. ఆమె మృతదేహానికి మూడో తేదీన అంత్యక్రియలు నిర్వహించారు. అదే రోజు ఆశ కార్యకర్త జన్ని విమల మృతి చెందింది. ఆమె మృతదేహానికి 4వ తేదీన అంత్యక్రియలు నిర్వహించగా, అదే రోజు జన్ని రామకృష్ణ మృతి చెందాడు. అతడిని 5వ తేదీన అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో వరుస మరణాలు సంభవించడంతో స్థానిక గిరిజనులు మూడు రోజుల పాటు కేవలం టీ మాత్రమే తీసుకుంటూ ఆహారం జోలికి పోకుండా ఉండిపోయారు. దీంతో వ్యాధులతో బాధపడుతున్న వారంతా శక్తి కోల్పోయి నడవలేని స్థితికి చేరారు. వైద్యాధికారి పర్యవేక్షణలో బేస్ క్యాంప్ ఏర్పాటు చేసి, మూడు రోజుల పాటు వైద్యులు చికిత్సలు అందిస్తేనే తప్ప పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం లేదు. అలాగే నడవలేని స్థితిలో ఉన్న గిరిజనులకు సెలైన్ బాటిళ్లు ఎక్కించి జ్వరాల అదుపు చేసేందుకు ప్రత్యేక చికిత్స అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



2వ తేదీన మరణించిన సువర్ణ (ఫైల్)



గురువారం మృతి చెందిన ఆశ కార్యకర్త జన్ని విమల (ఫైల్)



చలి జ్వరంతో బాధ పడుతున్న బలరామ్



మల్లీశ్వరిని కాపాడాలని పూజలు చేస్తున్న గ్రామస్థులు



జ్వర బాధితురాలు బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నలుగురి పరిస్థితి విషమం

పినపాడు గ్రామంలో నలుగురు జ్వర బాధితుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గురువారం జ్వరంతో ఆశ కార్యకర్త విమల మృతి చెందగా, ప్రస్తుతం ఆమె కుమార్తె జన్ని మల్లీశ్వరి(16) పరిస్థితి విషమంగా ఉంది. అలాగే కిముడు చంద్రమ్మ(50), జన్ని తులమ్మ(30)తో పాటు శుక్రవారం మరణించిన జన్ని రామకృష్ణ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన గూడెం కొత్తవీధి మండలం దారకొండ గ్రామానికి చెందిన నరియా బలరామ్(25) చలి జ్వరంతో వణుకుతున్నారు. వీరంతా నడవలేని స్థితిలో తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్నారు. మరి కొంత మంది గిరిజనులు కూడా జ్వరాలతో మూలుగుతున్నారు. పినపాడు వచ్చిన తాజంగి పీహెచ్‌సీ పారా మెడికల్ సిబ్బంది రోగులకు ప్రాథమిక చికిత్స చేశారు. వారి నుంచి రక్త నమూనాలు సేకరించి మలేరియా పరీక్ష చేసేందుకు తీసుకు వెళ్లారు. పారా మెడికల్ సిబ్బంది వద్ద ఆర్డీ కిట్‌లు లేకపోవడం వల్ల తక్షణమే మలేరియా ఉందా? లేదా? అని నిర్ధారించలేకపోయారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

కశింకోట రూరల్: కశింకోట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ గాయపడ్డాడు. అతన్ని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ మధుసూదనరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా సాలూరు మండలానికి చెందిన దాలి ఆదినారాయణ లారీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. తమ లారీని కశింకోట ప్రధాన రోడ్డు పక్కన ఉంచి భోజనం చేసేందుకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో కశింకోట వైపు వస్తున్న ఓ లారీ రోడ్డు దాటుతున్న ఆదినారాయణను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

ఆటో బోల్తా ఆరుగురికి గాయాలు

పాడేరు రూరల్: పోతులగరువు గ్రామం వద్ద శనివారం ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు. పెదబయలు మండలం లింగేటి పంచాయతీ మగ్గంవీధి గ్రామానికి చెందిన డూరు జానకీరావు(36), అతడి భార్య లక్ష్మీదేవి(32), కుమార్తెలు సాయి రాణి(7), మల్లేశ్వరి(3), కుంతుర్ల పంచాయతీ కె.బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన బొండా విశ్వనాథం(45), అతని భార్య అమ్మి(40) శనివారం ఆటోలో పాడేరు వస్తున్నారు. బొంగరం పంచాయతీ పోతులగరువు సమీపంలో మలుపు వద్ద ఆటో బోల్తా పండింది. దీంతో ఆటోలో ఉన్న ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు దుర్గరాజ్, సందీప్ సేవలు అందించారు. క్షతగాత్రుత్లో జానకీరావు, అతని కుమార్తె మల్లీశ్వరి(3)లను కేజీహెచ్‌కు తరలించారు.

నలుగురు మిలీషియా సభ్యుల లొంగుబాటు

గూడెంకొత్తవీధి: సీపీఐ మావోయిస్టు గాలికొండ ఏరియా కమిటీకి చెందిన నలగురు మిలీషియా సభ్యులు లొంగిపోయారని సీఐ నారాయణరావు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుంకుంపూడి గ్రామానికి చెందిన గెమ్మెల రమేష్, పీకేగూడానికి చెందిన వంతల భాస్కరరావు, లక్కవరం గ్రామానికి చెందిన పలాసి బాలయ్య, గడుతూరి సత్తిబాబు మూడేళ్లుగా గాలికొండ ఏరియా కమిటీలో పని చేస్తున్నారన్నారు. సమావేశాలు ఏర్పాటు చేయడం, కరపత్రాలు అంటించడం, మావోయిస్టులకు భోజనాలు, వసతి కల్పించడం వంటి కార్యకలాపాలకు వారు పాల్పడినట్టు చెప్పారు. పోలీసుల పిలుపుమేరకు వారంతా స్వచ్ఛందంగా లొంగిపోయారని తెలిపారు. అలాగే పెదపాడు గ్రామానికి చెందిన మిలీషియా సభ్యులు కూడా స్వచ్ఛదంగా లొంగిపోవాలని సీఐ కోరారు. లొంగిపోయిన వారిపై కేసులు ఎత్తివేసి పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎస్ఐ చంద్రశేఖరావు ఉన్నారు.



మిలీషియా సభ్యులతో సీఐ, ఎస్ఐ

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నక్కపల్లి: ఉద్దండపురం జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మరణించాడు. వేంపాడు నుంచి ఒక యువకుడు ద్విచక్ర వాహనంపై తుని వెళ్తూ, ఉద్దండపురం హైవే వద్ద రోడ్డు దాటుతున్న బీద సత్యనారాయణ(65)ను ఢీకొట్టాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. స్థానిక పోలీసులు వెంటనే నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే సత్యనారాయణ మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సింహాచలం తెలిపారు.

పాముకాటుతో యువకుడి అస్వస్థత

పాడేరు రూరల్: మోదాపల్లి పంచాయతీ గుర్రగరువు గ్రామానికి చెందిన కొర్రా గణేశ్వరరావు(26) పాముకాటుకు గురయ్యాడు. శనివారం పొలంలో పని చేస్తున్న సమయంలో పాము కాటేసింది. అస్వస్థతకు గురైన గణేశ్వరరావును కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించామని వైద్యాధికారి దుర్గరాజ్ తెలిపారు.

వివాదాస్పదంగా కల్యాణ మండపం స్థలం

- అన్నవరంలో మార్కింగ్ ఇచ్చిన వైసీపీ నేతలు
- పంచాయతీ అనుమతి లేదని సర్పంచ్ ఫిర్యాదు
- స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ, ఈఓపీఆర్‌డీ
- అనుమతి లేకుండా నిర్మించొద్దని హెచ్చరిక
- ముదురుతున్న టీడీపీ, వైసీపీ నేతల పోరు


వైసీపీ నేతలు మార్కింగ్ ఇచ్చిన స్థలం

చోడవరం: చోడవరం పంచాయతీ శివారు అన్నవరం గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణంపై తెలుగుదేశం, వైసీపీ నాయకుల మధ్య వివాదం ముదురుతుంది. విశాఖ డెయిరీ నిధులతో కల్యాణ మండపం నిర్మాణానికి గతంలో స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు శంకుస్థాపన చేశారు. అయితే నిధుల సమస్య కారణంగా పనులు ప్రారంభం కాలేదు. అయితే ఇటీవల అన్నవరంలో కల్యాణ మండపం నిర్మాణాన్ని పది లక్షల రూపాయలతో చేపట్టేందుకు ఎమ్మెల్యే రాజు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే అన్నవరంలో కల్యాణ మండపం నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి గ్రాంటు నుంచి రూ.18 లక్షలను వైసీపీ నేత కరణం ధర్మశ్రీ మంజూరు చేయించారు. ఈ నిధులతో కల్యాణ మండపం నిర్మించడం కోసం శనివారం వైసీపీ నాయకులు మార్కింగ్ ఇచ్చారు. వైసీపీ నాయకులు మార్కింగ్ ఇచ్చిన స్థలం, గతంలో ఎమ్మెల్యే రాజు శంకుస్థాపన చేసిన స్థలం ఒకటే కావడంతో రెండు పార్టీల మధ్య వివాదానికి దారితీసింది. వైసీపీ నాయకులు మార్కింగ్ ఇచ్చిన స్థలం గ్రామ కంఠమని, దీనికి పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా వైసీపీ నేతలు మార్కింగ్ ఇస్తున్నారని, అధికార పార్టీకి చెందిన సర్పంచ్ దొమ్మేసి అప్పలనర్స, కొందరు వార్డు సభ్యులు పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పాలకవర్గం నుంచి


పోలీసులు, సర్పంచ్, వైసీపీ నేతల మధ్య వాగ్వాదం

అందిన ఫిర్యాదు మేరకు మధ్యాహ్నం ఈఓపీఆర్‌డీ ఆంజనేయులు, పంచాయతీ ఈవో చంద్రశేఖర్, ఎస్‌ఐ కె.మల్లేశ్వరరావు అన్నవరంలో వివాదాస్పద స్థలం వద్దకు చేరుకున్నారు. వైసీపీ నేతలు ఇచ్చిన మార్కింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో ఎలాంటి కట్టడాలు చేయవద్దని అన్నవరం పాలసంఘం అధ్యక్షుడు సూరిబాబు, స్థానిక వైసీపీ నాయకులు పందిరి శ్రీనులకు పంచాయతీ ఈవో చంద్రశేఖర్, ఎస్‌ఐ మల్లేశ్వరరావు సూచించారు. అనుమతి లేకుండా పంచాయతీ స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో స్థానిక వైసీపీ నేతలకు, సర్పంచ్, పోలీసులు అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అన్నవరంలో కల్యాణ మండపం నిర్మాణం చేపడతామంటూ ఎమ్మెల్యే, సర్పంచ్‌లతో సహా ఆరుసార్లు శంకుస్థాపన చేశారని, ఆరేళ్లు గడచిపోయినా ఎందుకు నిర్మించలేదని స్థానిక పాలసంఘం అధ్యక్షుడు సూరిబాబు అధికారులను నిలదీశారు. ఇదే కల్యాణ మండపంతో శంకుస్థాపనలు చేసిన ఇతర ప్రాంతాల్లో పూర్తయినా, అన్నవరంలో మాత్రం ఎందుకు చేపట్టలేకపోయారని, ఇపుడు తాము నిధులు మంజూరు చేయించుకుంటే పని ప్రారంభించకుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాము నిర్మాణం చేపట్టాలనుకున్న స్థలంలోనే మార్కింగ్ ఎందుకు ఇవ్వాలసి వచ్చిందంటూ టీడీపీ నాయకులు వాదనకు దిగడంతో కొద్దిసేపు అధికారులకు స్థానిక సర్పంచ్, వైసీపీ నాయకులకు వాగ్వాదం జరిగింది. చివరకు కల్యాణ మండపం నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే అనుమతి మంజూరు అంశం పరిశీలిస్తామని, అంతవరకూ ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని పంచాయతీ ఈవో స్పష్టం చేశారు. కాగా కల్యాణ మండపం నిర్మించే స్థలం వ్యవహారంలో అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టవద్దని ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్థానిక వైసీపీ నేతలు స్టేషన్‌కు వచ్చి చెప్పాలని ఎస్‌ఐ సూచించారు. దీంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

మీకో పద్ధతి, మాకో పద్ధతా?

- జగన్ దిష్టిబొమ్మ దహనంపై ఎమ్మెల్యే మండిపాటు
- రాజీనామా చేసి పోటీ చేస్తా... మీరు సిద్ధమా?
- అధికార పార్టీ నాయకులకు బూడి సవాల్


విలేకరులతో మాట్లాడుతున్న ముత్యాలునాయుడు

మాడుగుల: అసెంబ్లీ సమావేశాల్లో వైసీపీ అధినేత, ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డిపై మంత్రులు యనమల రామకృష్ణుడు, కింజరాపు అచ్చెన్నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేశారని, నంద్యాల సభలో జగన్ మాటలను వక్రీకరించి దిష్టిబొమ్మలను దహనం చేయడం ఎంతవరకు సమంజసమని మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులకు ఒక్క పద్ధతి, ప్రతిపక్ష నేతలకు ఒక పద్ధతా అని అన్నారు. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముత్యాలనాయుడు మాట్లాడారు. తాను రాజీనామా చేసి పోటీకి దిగుతానని, పోటీ చేయడానికి అధికార పార్టీ నాయకులు సిద్ధమా అని సవాల్ విసిరారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర జైలుకే అని టీడీపీ నేతలు అన్నారని గుర్తు చేశారు. అధికార పార్టీ నాయకులు మూడున్నరేళ్లలో ఇసుక నుంచి మొదలుకుని నీరు-చెట్టు, పింఛన్‌లు తదితర పథకాల్లో రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించి అడ్డగోలుగా సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. జన్మభూమి కమిటీలను రద్దుపరచి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మొదటి విడత జన్మభూమి కమిటీ సభ్యులు దొంగలని, రెండో విడత వచ్చే సభ్యులు గజదొంగలు అవుతారని విమర్శించారు. అఖిలప్రియ వైసీపీ జెండా పట్టి గెలిచారని, జగన్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.

జిల్లా సబ్ జూనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక రేపు

గవరపాలెం (అనకాపల్లి) : అనంతపురం జిల్లాలో ఈ నెల 19 నుంచి 21 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు విశాఖ జిల్లా జట్ల ఎంపిక ఈ నెల ఏడో తేదీన జరగనుందని విశాఖ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కాశీ, కేఎన్‌వీ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్‌లో ఉదయం ఎనిమిది గంటల నుంచి ఈ ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పీఈటీ జి.రాజును 97051 43380 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

9న సీఎం అరకు రాక

- ఆదివాసీ దినోత్సవానికి హాజరు
- దత్తత గ్రామం సందర్శన


విశాఖపట్నం : ఈ నెల 9న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో పర్యటించనున్నారు. అరకులోయలో అధికారికంగా జరిగే ఆదివాసీ దినోత్సవానికి సీఎం హాజరై ప్రసంగిస్తారు. అనంతరం అరకులోయ మండలం సీఎం దత్తత గ్రామం పెదలబుడులో పర్యటించి అభివృద్ధి పనులు సమీక్షించనున్నారని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నామని పేర్కొన్నారు. జూన్ 5న సీఎం అరకు పర్యటన వర్షాల కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జిల్లాలో ముఖ్యంగా ఏజెన్సీలో అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో అధికారులు సీఎం పర్యటనకు వర్షం పడినా విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

అనకాపల్లి రూరల్: ప్రమాదంలో గాయపడిన ఎస్.చిట్టియ్య (55) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆదినారాయణ రెడ్డి తెలిపారు. బవులవాడ పంచాయతీ దర్జీనగర్‌వద్ద గతనెల 25వ తేదీన కారు ఢీకొనడంతో గాయపడిన ఎస్.చిట్టియ్య ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో రెండురోజుల క్రితం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు.

రేపు ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం వరకే

నూకాంబిక అమ్మవారి దర్శనాలు



అనకాపల్లి రూరల్ : చంద్రగ్రహణం కారణంగా అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దర్శనాలు పది గంటలపాటు నిలిపివేయనున్నట్టు ఆలయ ఈవో ఎన్.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే భక్తులకు అమ్మవారి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మూసివేసి మంగళవారం ఆలయ సంప్రోక్షణ అనంతరం ఉదయం 11 గంటల నుంచి అమ్మవారి దర్శనభాగ్యం కలుగుతుంద వివరించారు.

రూ.650 కోట్లతో పనులు : ఏపీడీ

పాయకరావుపేట : ఈ ఏడాది జిల్లాలో రూ.650 కోట్లతో ఉపాధి పనులు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఇప్పటికే రూ.200 కోట్ల పనులు పూర్తయ్యాయని డ్వామా అడిషనల్ పీడీ ఆనందరావు చెప్పారు. శనివారం పాయకరావుపేట వచ్చిన ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. గత ఏడాది 1.5 లక్షల కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించడం వల్ల దేశంలోనే విశాఖ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఈ ఏడాది 2.50 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికే 1.51 కోట్ల పనిదినాలు పూర్తయ్యాయని చెప్పారు. ఈ ఏడాది కూడా 1.5లక్షల కుటుంబాలకు పని కల్పించాలని నిర్ణయించామని చెప్పారు.

గంజాయి అరికట్టేందుకు ఎస్‌టీఎఫ్

విశాఖపట్నం : జిల్లాలో గంజాయి అరికట్టేందుకు స్పెషల్ టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయనున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్‌డీపీఎస్ యాక్ట్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. గంజాయి సాగు, రవాణా చేసేవారిపై కేసులు పెట్టడంపై సమీక్షించారు. జిల్లాలో గంజాయి రవాణా ముఠాని గుర్తించడం, విత్తనాలు ఎలా వస్తున్నాయి? ఎవరు పండిస్తున్నారు? కొత్తగా ఎక్కడెక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలనే అంశాలపై అధికారులు సమీక్షించారు. ఈ సమావేశానికి విశాఖ రేంజి డీఐజీ శ్రీకాంత్, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ఏఎస్పీలు హాజరయ్యారు.

అణచివేత నుంచి ఉద్భవించినవే మానవ హక్కులు

- ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీ జ్యోతిర్మయి

విశాఖపట్నం - లీగల్ : ప్రజలను పాలకులు అణచివేతకు గురి చేస్తుండడంతో ప్రజాహక్కులు ఉద్భవించాయని, పోరాటాల ద్వారా అవి సంక్రమించాయని ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నగరంలోని లయన్స్ క్లబ్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జస్టిస్ సి.పద్మనాభరెడ్డి స్మారక ఉపన్యాస కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ 'మానవ విజ్ఞానం - న్యాయస్థానాల తీర్పులు, మానవ హక్కులను పరిరక్షణలో న్యాయస్థానాలు' అంశంపై ప్రసంగించారు. నిరాడంబరత, నిష్పక్షపాతం, మానవతా విలువలు కలిగిన మహోన్నత వ్యక్తి పద్మనాభరెడ్డి అని కొనియాడారు. న్యాయస్థానాలకు న్యాయ సలహాదారుగా , పేదల పెన్నిధిగా ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. మానవ హక్కుల ఉద్భవ పరిణామాన్ని, వాటిని మానవుడు సాధించినది తీరును దుర్గాప్రసాదరావు వివరించారు. మానవ హక్కుల పరిరక్షణలో న్యాయస్థానాల కృషిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీ జ్యోతిర్మయి వివరించారు. న్యాయస్థానాలు ఇచ్చిన అనేక తీర్పులను ఉటంకించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ సురేష్, ప్రధాన కార్యదర్శి జహారా, ప్రతినిధులు ఏవీ లెనిన్, పి.వెంకటేశ్వరావు, కాండ్రేగుల జగదీశ్వరరావు, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

2024 ఒలింపిక్స్‌కు పారిస్ ఆతిథ్యం

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

అంతర్జాతీయం

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా అబ్బాసీ

పాకిస్థాన్ ఆపద్ధర్మ ప్రధానిగా పెట్రోలియం, సహజ వనరుల శాఖ మాజీ మంత్రి షహీద్ ఖాకన్ అబ్బాసీ జూలై 29న నియమితులయ్యారు. ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ మోసం, అవినీతికి పాల్పడ్డారని ఆ దేశ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఫలితంగా అతడిపై అనర్హత వేటు పడింది. పనామా పత్రాల కుంభకోణం వ్యవహారంలో షరీఫ్‌తోపాటు కుటుంబ సభ్యులపై దాఖలైన వ్యాజ్యానికి సంబంధించి అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పు వెలువ రించింది. తదుపరి ప్రధానిగా షరీఫ్ తమ్ముడు, పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి షెహబాజ్ షరీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. 45 రోజుల పాటు అబ్బాసీ తాత్కాలిక ప్రధానిగా పనిచేస్తారు.

టిబెట్‌లో ఎక్స్‌ప్రెస్ మార్గం ప్రారంభం

ప్రపంచంలోనే ఎత్తయిన పీఠభూమి టిబెట్‌లో చైనా ఎక్స్‌ప్రెస్ రహదారిని ప్రారంభించింది. కింఘై ప్రావిన్స్‌లోని గాంగ్త్సె కౌంటీని పుషు నగరంతో కలుపుతూ దీన్ని నిర్మించారు. 634.8 కి.మీ. పొడవైన ఈ మార్గం నిర్మాణానికి 25.6 వేల కోట్లను చైనా ఖర్చు చేసింది. సగటున 4 వేల మీటర్ల ఎత్తులో ఈ రహదారి ఉంటుంది. రహదారిలో 36 శాతం మంచునేల పెర్మాఫ్రాస్ట్‌పై నిర్మించారు. ఈ మార్గం ద్వారా యుషు, షినింగ్‌ల మధ్య ప్రయాణ సమయం 8 గంటలకు తగ్గింది.

చైనా గోడ కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గం

గ్రేట్ వాల్ ఆఫ్ చైనా కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గాన్ని చైనా నిర్మించనుంది. 2022 శీతాకాల ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న బీజింగ్, ఝాంగ్ జియాకు నగరాలను అనుసంధానించేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఇందులో భాగంగా మహాకుడ్యానికి చెందిన బాడలింగ్ భాగం కింద 12 కి.మీ. పొడవైన సొరంగాన్ని తవ్వనున్నారు. గోడ కిందే 102 మీటర్ల లోతున 36 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఈ మార్గంలో గంటకు 350 కి.మీ. వేగంతో రైళ్లు ప్రయాణించనున్నాయి.

చైనా చేతికి శ్రీలంక రేవు

వ్యూహాత్మక హంబంటోటా రేవులో 70 శాతం వాటాను చైనాకు విక్రయిస్తూ శ్రీలంక నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు 110 కోట్ల డాలర్ల ఒప్పందంపై జూలై 29న శ్రీలంక నౌకాయాన మంత్రి మహింద సమరసింఘే, కొలంబోలో చైనా రాయబారి జియాన్ లియాంగ్‌లు సంతకం చేశారు. నష్టాల్లో ఉన్న ఈ రేవును చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని చైనా మర్చంట్ పోర్ట్ హోల్డింగ్స్‌కు అప్పగిస్తారు. 99 ఏళ్ల పాటు ఈ లీజు ఒప్పందం కొనసాగుతుంది. ఈ ఒప్పందంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇరాన్ అధ్యక్షుడిగా రోహానీ ప్రమాణం



ఇరాన్ అధ్యక్షుడిగా హసన్ రోహానీ ఆగస్టు 3న ప్రమాణ స్వీకారం చేశారు. రోహానీ 2013లో మొదటిసారి అధ్యక్షుడయ్యారు. 2015 అణు ఒప్పందం విషయంలో, ప్రపంచ దేశాల ఆంక్షల తొలగింపులో ఈయన కీలక పాత్ర పోషించారు. 2017 మేలో జరిగిన ఎన్నికల్లో రోహానీ 57 శాతం ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

లష్కరే కమాండర్ దుజానా హతం

లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజానాను ఆగస్టు 1న భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్ జాతీయుడైన దుజానాను, అతని అనుచరుడు ఆరిఫ్ నబీదార్‌ను భద్రతా బలగాలు హతమార్చాయి. దుజానా దక్షిణ కశ్మీర్‌లో లష్కరే తోయిబా చీఫ్ కమాండర్, ఏ+++ హోదా ఉగ్రవాది. 2013లో అబు ఖాసీం మరణించాక దుజానా లష్కరే టాప్ కమాండర్‌గా ఉన్నాడు.

అవార్డులు

ఆచార్య కృష్ణకు జాతీయ ప్రతిభా అవార్డు

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్'లో ఆచార్యుడిగా పనిచేస్తున్న కె.ఎస్.కృష్ణ ప్రతిష్ఠాత్మకమైన జాతీయ ప్రతిభా అవార్డును అందుకొన్నారు. భూశాస్త్ర మంత్రిత్వ శాఖ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జూలై 27న ఈ అవార్డును అందజేశారు. ఈ సంవత్సరం జియో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి డా.కె.ఎస్ కృష్ణ ఎంపికయ్యారు. 1984లో గోవాలోని సముద్ర అధ్యయన జాతీయ సంస్థలో శాస్త్రవేత్తగా చేరి, ముఖ్య శాస్త్రవేత్త స్థాయికి ఎదిగిన ఆయన హెచ్‌సీయు ఆహ్వానం మేరకు ఇటీవలే ఆచార్యుడిగా చేరారు. ఎన్ఐఓలో చేసిన పరిశోధనలకు కృష్ణ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు.

క్రీడలు

హంగేరియన్ గ్రాండ్‌ప్రి విజేత వెటెల్


ఫెరారీ డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ హంగేరియన్ గ్రాండ్‌ప్రి విజేతగా నిలిచాడు. ఈ విజయంతో వెటెల్ ఎఫ్ 1 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తన ఆధిక్యాన్ని 14 పాయింట్లకు పెంచుకున్నాడు. జూలై 30న బుడాపెస్ట్‌లో జరిగిన రేసులో వెటెల్ మొదటి స్థానంలో, ఫెరారీకే చెందిన రైకోనెన్ రెండో స్థానంలో నిలిచాడు.

2024 ఒలింపిక్స్‌కు పారిస్ ఆతిథ్యం

2024 ఒలింపిక్స్‌కు ఫ్రాన్స్ రాజధాని పారిస్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది సెప్టెంబరు 13న పెరూలోని లిమాలో జరిగే సమావేశంలో 2024కి పారిస్, 2028కి లాస్ ఏంజిల్స్‌ను ఎంపిక చేసినట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఒసి) ప్రకటిస్తుంది. 2020 ఒలింపిక్స్‌కు టోక్యో ఆతిథ్యం ఇవ్వనుంది. 2024 ఒలింపిక్స్‌కు పారిస్, లాస్ ఏంజిల్స్ పోటీ పడగా, 1924లో తొలిసారి ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చి వందేళ్లవుతున్న సందర్భంగా పారిస్‌కు అవకాశం ఇచ్చారు. వింటర్ ఒలింపిక్స్ 2022లో బీజింగ్‌లో జరుగుతాయి.

సైన్స్ అండ్ టెక్నాలజీ

ఉత్తర కొరియా క్షిపణి పరీక్ష



ఉత్తర కొరియా నెల రోజుల్లో రెండోసారి ఖండాంతర క్షిపణిని పరీక్షించింది. 2017 జూలై 28న 'హ్వాసాంగ్-14' అనే క్షిపణిని ప్రయోగించింది. ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ దీన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ క్షిపణి 3724.9 కిలోమీటర్ల ఎత్తుకు చేరి 998 కి.మీ. ప్రయాణించింది. తూర్పు తీరానికి చేరువలో సముద్రంలో పడిపోయింది. దీని పరిధి 10 వేల కి.మీ. ఉత్తర కొరియా, రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలు విధిస్తూ అమెరికా సెనెట్ ఒక తీర్మానం చేసిన మరునాటి రోజే కొరియా ఈ పరీక్షలను జరిపింది. 750 కిలోల వార్ హెడ్‌తో ఈ క్షిపణి న్యూయార్క్, వాషింగ్టన్ నగరాలను చేరగలదు.

తొలి మానవ రహిత యుద్ధ ట్యాంక్ 'మంత్ర'

భారత్ తొలి మానవ రహిత యుద్ధ ట్యాంక్ 'మంత్ర'ను రూపొందించింది. చెన్నై సమీపంలోని అవడిలోని ట్యాంక్ పరిశ్రమలో దీన్ని తయారు చేశారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా 'కంబాట్ వెహికిల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్'లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీన్ని ప్రదర్శించారు. ఈ యుద్ధ ట్యాంక్‌లు మూడు రకాలు. నిఘా, మందుపాతరల గుర్తింపునకు వీటిని ఉపయోగించనున్నారు.

స్మృతి



ప్రొఫెసర్ పి.ఎం.భార్గవ
ప్రముఖ శాస్త్రవేత్త, సీసీఎంబీ వ్యవస్థాపక

డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పమిత్ర భార్గవ ఆగస్టు 1న హైదరాబాద్‌లో మరణించారు. 1928లో రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జన్మించిన ఆయన లక్నో యూనివర్సిటీ నుంచి ఆర్గానిక్ కెమిస్ట్రీలో పట్టా పొందారు. సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశారు. 1950-53 మధ్య ఐఐసీటీలో, 1953-56 మధ్య విస్కాన్సిన్ వర్సిటీలో పనిచేశారు. 1986లో పద్మవిభూషణ్ అవార్డు పొందారు. సీసీఎంబీ వ్యవస్థాపక సంచాలకుడిగా 1977లో బాధ్యతలు స్వీకరించి 1990 వరకూ కొనసాగారు.

స్వయం ఉపాధి



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

మయోనైజ్ అంటే క్రీమీగా చిక్కగా ఉండే సాస్ / డ్రెస్సింగ్ పదార్థమని అందరికీ తెలుసు. దీన్ని వెజిటబుల్ నూనెలు, కోడిగుడ్డు సొన, నిమ్మరసం లేదా వెనిగర్, సీజనింగ్ లేదా ఫ్రిజర్వేటివ్స్‌తో తయారు చేస్తారు. శాకాహారుల కోసం కోడిగుడ్డు లేకుండా కూడా తయారు చేస్తారు. ఈ సాస్ తెలుపు, పసుపు వర్ణాల మిశ్రమంగా కనిపిస్తుంది. రుచిలో కొంచెం తియ్యదనం ఉంటుంది.

వాడకం

మయోనైజ్‌ను ప్రధానంగా ఆహార పదార్థాల తయారీలో, వినియోగంలో విస్తృతంగా వాడతారు. సలాడ్స్, శాండ్‌విచ్‌లు బర్గర్స్ తయారీలో కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. మందుల తయారీ, పెయింట్స్, కోటింగ్స్

మయోనైజ్



మేకప్ ఉత్పత్తులు, డిటర్జెంట్స్ తయారీలో కూడా వినియోగిస్తారు. బేకరీ ఉత్పత్తులు, కాన్ఫెక్షనరీ ఉత్పత్తుల తయారీలో విస్తృతంగా వాడుతు న్నారు. ఆహార పదా ర్థాలకు పరిమ ళాన్ని అందించి ఆకర్షణీయంగా కనిపించేందుకు కూడా మయోనైజ్‌ను వినియోగిస్తారు.

చరిత్ర

ఈ సాస్‌ను 1756లో ఫ్రెంచ్ చెఫ్ Due de Richelieu కనుగొన్నారు. ఆ తరవాత ప్రపంచ వ్యాప్తంగా వివిధ ముడిపదార్థాలతో పలు రుచులతో దీన్ని తయారు చేస్తున్నారు. అమెరికాలో అత్యధిక పరిమాణంలో వినియోగించే కండిమెంట్‌గా ఇది గుర్తింపు పొందింది.

ఇండియన్ మార్కెట్

2014 నివేదిక ప్రకారం మన దేశంలో మయోనైజ్ మార్కెట్ పరిమాణం రూ.350 నుంచి 400 కోట్ల వరకు ఉందని తెలుస్తోంది. ఏటా 25 శాతం వరకు వృద్ధి పొందుతోంది.

దేశీయ మార్కెట్ వృద్ధికి కారణాలు

మారుతున్న పట్టణ ప్రజల జీవన విధానం, పట్టణాల నుంచి నగరాలకు పాకుతున్న ఆధునిక జీవన శైలి, ఆన్‌లైన్ స్టోర్స్, సూపర్ మార్కెట్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉండటం, విదేశీ ప్రయాణాలు పెరగడం వంటి కారణాల వల్ల మయోనైజ్ సాస్‌కు డిమాండ్ పెరుగుతోంది.

తయారీకి కావల్సిన యంత్ర పరికరాలు

● హై స్పీడ్ మిక్సర్ ● ట్రాన్స్‌ఫర్ పంపు ● హోమోజినైజర్ ● న్యూమాటిక్ ఫిల్లర్. ● బ్యాండ్ సీలర్ ● స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు ● టేబుల్

ముడి పదార్థాలు

మయోనైజ్ సాస్‌ను మూడు రకాలుగా తయారు చేస్తారు.
● గుడ్డు సొనతో తయారుచేసిన మయోనైజర్ ● ఎగ్‌లెస్ లేదా వెజిటబుల్ మయోనైజర్ ● హెర్బల్ మయోనైజర్. వీటికి ప్రధానంగా సోయాబీన్ ఆయిల్, ఆవనూనె, వైట్ వెనిగర్, ఉప్పు, ఇంగువ, తులసి నూనె, కరివేపాకు నూనె, గుడ్లు, ప్రిజర్వేటివ్ వంటివి అవసరం.

తయారీ విధానం

సహజంగా కలిసే లక్షణాలు లేని రెండు లేదా అంత కంటే ఎక్కువ వంట నూనెలను హైస్పీడ్ మిక్సర్‌లో నిదానంగా కలుపుతారు. మధ్య మధ్యలో ఇతర ముడి పదార్థాలను నిర్ణీత పరిమాణంలో కలుపుతూ గట్టి పేస్ట్ లా తయారు చేస్తారు. ఈ పేస్ట్‌నే మయోనైజర్ లేదా మాయో అని పిలుస్తారు. దీన్ని పెట్ బాటిల్స్, ప్లాస్టిక్ పౌచ్‌ల్లో ప్యాక్ చేసి మార్కెట్‌కు తరలిస్తారు.

ఆరోగ్య ప్రాముఖ్యం

మయోనైజ్ అనేది ఒక సమతులాహార పదార్థం. ఇది పదార్థాలకు రంగు, రుచి, సువాసనలను అందించడమే కాకుండా ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఇందులో ఉండే సోయాబీన్ ఆయిల్, ఆవ నూనెల్లోని ఆల్ఫా లినోలిక్ యాసిడ్, అత్యావశ్యక ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బితోపాటు అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు శరీరానికి ఆరోగ్యాన్ని అందిస్తాయి.

మార్కెటింగ్

చైనీస్ రెస్టారెంట్స్, పిజ్జా, బర్గర్ తయారీ సంస్థల్లో నేరుగా మార్కెట్ చేసుకోవచ్చు. గృహ వినియోగదారుల కోసం సూపర్ మార్కెట్లు, కిరాణా దుకాణాల ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలి. ఇటీవల ఆన్‌లైన్ వ్యాపారం వృద్ధి చెందుతోంది. కాబట్టి సంబంధిత వ్యాపార సంస్థలతో ఒప్పందాలు చేసుకొన్నట్లయితే లాభదాయకంగా ఉంటుంది.

పరిశ్రమ వివరాలు: పరిశ్రమ సామర్థ్యం: గంటకు 100 కిలోలు
పరిశ్రమ వ్యయం: రూ. 25 లక్షలు

మన్యంలో సంచార వైద్యం

మండలానికొక ఆరోగ్య రథం.. తొలివిడతలో అనంతగిరి కేంద్రంగా వైద్యసేవలు... అత్యాధునిక పరికరాలతో పరీక్షలు

అనంతగిరి:
ఏజెన్సీలో గిరిజనులకు వైద్యసేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) సంచార వాహనాలను సిద్ధం చేసింది. ప్రస్తుతం ఏజెన్సీలో వ్యాధుల తీవ్రత అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో అత్యాధునిక పరికరాలతో కూడిన వాహనాలను ఏపీఎండీసీ సమకూరుస్తున్నది. తొలి విడతలో రెండు వాహనాలను సిద్ధం చేసి విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు పంపించింది. ఒక్కొక్క వాహనం రూ.45 లక్షలతో తయారు చేయించింది. ఈ వాహనం మొబైల్ ఆస్పత్రిగా కూడా వినియోగిస్తున్నది. విశాఖపట్నం జిల్లాకు వచ్చిన వాహనం శనివారం అనంతగిరి మండలానికి చేరుకుంది. ఇందులో బీపీ, ఈసీజి, ఆక్సిజన్ వంటి సదుపాయాలతోపాటు ప్రయోగ శాల, మందులకు వేర్వేరుగా క్యాబిన్‌లను సిద్ధం చేసింది.

ఈ వాహనంలో అత్యాధునిక పరికరాలను అమర్చారు. ముఖ్యంగా జ్వరాలతో బాధపడేవారికి రక్తపరీక్షలు, క్యాన్సర్ ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు, ఈసీజీ, మాతా,శిశు పరీక్షలన్నీ ఈ వాహనంలో ఉన్న ప్రత్యేక ల్యాబ్‌లో చేయవచ్చు. దీనివల్ల వైద్యం అందించడంలో అలసత్వం లేకుండా సకాలంలో వైద్యసేవలు అందించనున్నారు. సంచార వైద్యకేంద్రంలో ఒక డాక్టరుతోపాటు ముగ్గురు ఆరోగ్య సిబ్బంది, ఒక ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటారు. మన్యంలో ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఈ సంచార వైద్య కేంద్రాలు సత్ఫలితాలు ఇస్తాయని మండలవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.మూరుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు అత్యవసర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ సంచార ఆరోగ్య రథాలు రూపొందించారు. రహదారి సౌకర్యం ఉన్న పంచాయతీలకు ఈ వాహనాలు వెళ్లి సమీపంలోని గిరిజనులకు వైద్యం అందించడమే వీటి ప్రధాన లక్ష్యం. ఈ మేరకు మన్యంలో ఏపీఎండీసీలో శిక్షణ పొందుతున్న స్థానిక గిరిజన యువకులను ఈ ఆరోగ్య రథాలకు మార్గదర్శకులుగా నియమించింది.వారు మన్యంలోని గ్రామాలకు మార్గదర్శకులుగా ఉంటూ అందరికి వైద్యం అందేలా చూస్తారు. ఒక్కో రథానికి ముగ్గురు ట్రైనీలు ఉంటారు. తొలి విడతలో ఒక్కో వాహనం అందుబాటులోకి రాగా, రానున్న రోజుల్లో అన్ని మండల్లాలోనూ సంచార ఆరోగ్య రథాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏపీఎండీసీ చర్యలు తీసుకుంటున్నది.



అన్ని సేవలు ఉన్నాయి..

వంతల రత్నకుమార్, ట్రైనీ, ఏపీఎండీసీ



ఈ ఆరోగ్య రథంలో ఈసీజీ, ఆక్సిజన్ వంటి సదుపాయాలతోపాటు రక్తపరీక్షలకు ల్యాబ్, మందులకు ప్రత్యేకమైన క్యాబిన్ ఉన్నాయి. ఆస్పత్రుల కంటే ఇందులో మంచి వైద్యం అందుబాటులో ఉంటుంది. ఈవారంలోనే సేవలు అందుబాటులోకి రానున్నాయి.

మత్తుకు చిత్తు

బానిసలుగా మారుతున్న విద్యార్థులు

గుట్టుగా కొంతమంది మందుల దుకాణాల యజమానుల విక్రయాలు

ఔషధ నియంత్రణ అధికారులకు నేరుగా ఫిర్యాదు చేస్తున్న తల్లిదండ్రులు

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)
స్మార్ట్‌సిటీగా ఎదుగుతున్న విశాఖలో మత్తు కలిగించే ఔషధాల విక్రయం జోరుగా సాగుతోంది. యువత, మధ్యవయస్కులే కాకుండా పాఠశాల, కళాశాల విద్యార్థులు కూడా వీటికి బానిసలుగా మారుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతానికి కోరెక్స్, వైటనర్, ఫోర్ట్విన్ వంటి వాటి వాడకానికి సంబంధించిన ఉదంతాలే బయటపడుతున్నా, కొన్ని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల వినియోగం కూడా జరుగుతోందని తెలుస్తోంది. తాజాగా ఒక యువకుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్ర, శనివారాల్లో ఒక మెడికల్ డిస్ట్రిబ్యూటర్ గోడౌన్, ఇల్లుతోపాటు అతనిచ్చిన సమాచారం మేరకు దొండపర్తిలోని ఒక మందుల దుకాణంపై దాడులు చేసి భారీగా మత్తు కలిగించే ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు.



రైల్వే న్యూకాలనీలోని శ్రీనివాసమందుల దుకాణాలు

రాష్ట్రంలో ఏకైక కాస్మోపాలిటన్ సిటీగా విశాఖ నగరం రూపాంతరం చెందుతోంది. పేరొందిన కళాశాలలు, యూనివర్సిటీలతోపాటు ఐటీ కంపెనీలు వుండడంతో రాష్ట్రేతర ప్రాంతాల నుంచి ప్రధానంగా ఉత్తరాది నుంచి విద్యార్థులు, ఉద్యోగులు నగరానికి వస్తున్నారు. దక్షిణాదికి చెందిన విద్యార్థులతో పోల్చితే ఉత్తరాది వారిపై పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ఎక్కువగా వుంటుంది. లేట్‌నైట్ పార్టీలు, డ్రగ్స్, మత్తుమందుల వినియోగం వంటివి కనిపిస్తుంటాయి. వారి ప్రభావం కారణంగా నగర యువత కూడా వాటి పట్ల ఆకర్షితులవుతున్నారు. దగ్గు నివారణకు కోరెక్స్ సిరప్, ప్రసవ సమయంలో నొప్పి నివారణకు ఫోర్ట్విన్ ఇంజక్షన్లు, మత్తు కలిగించే నైట్రోసమ్, ఆల్ప్రాజోలెమ్ వంటి మాత్రలను వైద్యుల పర్యవేక్షణలోనే వాడాల్సి వుంటుంది. మందుల దుకాణాల్లో కూడా వీటిని వైద్యుల ప్రిస్కృప్షన్ వుంటేనే విక్రయించాలి. అయితే మందుల దుకాణాల నిర్వాహకులు, డిస్ట్రిబ్యూటర్లు కాసులకు కక్కుర్తిపడి వాటిని అడ్డగోలుగా విక్రయించేస్తున్నారు. వీటిని అధికంగా వినియోగించినట్టయితే నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అయితే మందుల దుకాణాల్లో విక్రయాలపై సరైన పర్యవేక్షణ వుండడం లేదు. ఔషధ నియంత్రణ మండలి అధికారులు ఎప్పుడో ఒకసారి మొక్కుబడిగా దాడులు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. ప్రతినెలా కొన్ని మందులకు సంబంధించిన కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన వివరాలను ఔషధ నియంత్రణ మండలి అధికారులకు మందుదల దుకాణాల యజమానులు అందజేయాల్సి వున్నా ఆ పనిచేయడం లేదు. కొంతమంది తప్పుడు చిరునామాలతో కంపెనీలు, డ్రిస్టిబ్యూటర్ల నుంచి సరుకు దిగుమతి చేసుకుంటున్నారు.

యువకుడి తల్లి ఫిర్యాదుతో కదిలిన డొంక

నగరంలోని అక్కయ్యపాలేనికి చెందిన ఒక యువకుడు పదో తరగతి వరకూ చదువుకుని మానేశాడు. ఒక మందుల దుకాణంలో బాయ్‌గా చేరాడు. కొన్నాళ్ల తర్వాత అక్కడ మానేసి ప్రస్తుతం ఒక బుక్ బైండింగ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. అయితే సదరు యువకుడు మందుల దుకాణంలో పనిచేసిన సమయంలో మత్తు కలిగించే కోరెక్స్ సిరప్ వాడకానికి అలవాడు పడ్డాడు. మత్తు కలిగిస్తుండడంతో దాని వాడకానికి బానిసగా మారాడు. ప్రతిరోజూ సాయంత్రం కాగానే ఒక సిరప్ సీసా కొనుగోలు చేసుకుని వచ్చి ఇంట్లో తాగేసి నిద్రపోతున్నాడు. దీనివల్ల యువకుడి ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తూ వస్తోంది. ఈ విషయం గుర్తించిన యువకుడి తల్లిదండ్రులు వారం రోజుల కిందట నేరుగా ఔషధ నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదుచేశారు. బాధిత యువకుడి తల్లి ఇచ్చిన సిరప్ సీసాపై వున్న బ్యాచ్ నంబర్, తయారీ సంస్థ వివరాలు ఆధారంగా విజయవాడలోని డిస్ట్రిబ్యూటర్‌ను సంప్రతించారు. దానిని సీతంపేట చిరునామాలో వున్న గణపతిరెడ్డి అనే వ్యక్తికి పంపినట్టు తెలిసింది. గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకూ సుమారు 19,500 బాక్సులు పంపినట్టు అక్కడి ఇన్వాయిస్‌లో తేలింది. దీంతో వాటి ఆధారంగా డ్రగ్ కంట్రోల్ అధికారులు సీతంపేటలోని చిరునామాకు వెళ్లగా అక్కడ మందుల దుకాణం కనిపించలేదు. ఏడాదిన్నర కిందటే మందుల దుకాణం మూసేసినట్టు తేలింది. దీంతో తిరిగి విజయవాడలోని డిస్ట్రిబ్యూటర్‌ను సంప్రతించగా రైల్వే న్యూలనీలోని పులివారివీధిలో గల గణపతిరెడ్డి ఇంట్లో డెలివరీ ఇస్తున్నట్టు తెలిపారు. దీంతో గణపతిరెడ్డిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించిన డ్రగ్ కంట్రోల్ అధికారులకు ఎలాంటి సమాచారం వెల్లడించకపోవడంతో ఈనెల మూడున నాలుగో పట్టణ పోలీసులకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భారతి ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు గణపతిరెడ్డిని అదుపులోకి తీసుకుని తమశైలిలో విచారించగా తన వ్యాపార రహస్యాలతోపాటు స్టాక్‌ను ఎక్కడ భద్రపరిచాడనే వివరాలను వెల్లడించాడు.

మందుల దుకాణాలపై కానరాని పర్యవేక్షణ

నగరంలో సుమారు 800 వరకూ మందుల దుకాణాలు వున్నాయి. వైద్యుల ప్రిస్కిప్షన్‌పై మాత్రమే విక్రయించాల్సిన కొరెక్స్, ఫోర్ట్విన్, అల్ఫాజోలెమ్ వంటి మత్తుమందుల విక్రయాలకు సంబంధించి దుకాణం నిర్వాహకులు పక్కాగా రికార్డులు నిర్వహించాలి. వీటి కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన వివరాలను ప్రతీనెలా ఔషధ నియంత్రణ అధికారులకు అందజేయాలి. అయితే చాలామంది వీటిని పాటించడం లేదు. మరికొందరైతే తమ దుకాణాలు ఒకచోట వుంటే మరోకచోట అడ్రస్‌లు చూపిస్తున్నారు. వాటికి అవసరమైన స్టాక్‌లను డిస్ట్రిబ్యూటర్ల నుంచి తమ వ్యక్తిగత చిరునామాలకు తెప్పించుకుంటుండడంతో వాటి వివరాలు ఔషధ నియంత్రణ మండలి అధికారులకు చేరడం లేదు.

గుట్టుగా హెరాయిన్, కొకైన్ వాడకం...

నగరంలో గంజాయి, ఫోర్ట్విన్ ఇంజక్షన్లు, కొరెక్స్ సిరప్ లతోపాటు మత్తు కలిగించే సాధారణ మాత్రల వినియోగం ఇటీవల కాలంలో బాగా పెరిగినప్పటికీ చాలా కాలం కిందటి నుంచే జరుగుతోంది. అయితే మత్తుకలిగించే ఖరీదైన కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్ వినియోగం కూడా నగరంలో గుట్టుగా జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా నగరంలోని కార్పొరేట్ కళాశాలల్లో వీటి వాడకం వున్నట్టు కొంతమంది పేర్కొంటున్నారు. ఆయా కళాశాలల్లో వున్న ఉత్తరాదికి చెందిన విద్యార్థులు డ్రగ్స్ వాడుతున్నట్టు చెబుతున్నారు. అలాగే ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న వారిలో కొందరు కూడా వీటిని వినియోగిస్తున్నట్టు సమాచారం.

17 మంది రెవెన్యూ సిబ్బందికి సిట్ నోటీసులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ భూ కుంభకోణంపై విచారణ జరుపుతున్న సిట్ మరో 17 మంది రెవెన్యూ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీచేసేందుకు సిద్ధమవుతోంది. మాజీ సైనికుల పేరుతో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్టు నిర్ధారణకు వచ్చిన సిట్ అధికారులు ఇప్పటికే 13 మంది తహసీల్దార్లకు నోటీసులు జారీ చేసి వివరణ అడగాలని కలెక్టర్‌ను కోరిన సంగతి తెలిసిందే. ఎన్వోసీల జారీతో సంబంధమున్న ఐఏఎస్ అధికారుల నుంచి వివరణ కోరిన సిట్ ఆ సమయంలో తహసీల్దార్లుగా, డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేసిన 17 మందికి కూడా షోకాజ్ నోటీసులు జారీచేయాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిసింది. ఈ మేరకు ఆయా ఉద్యోగులకు ఒకటి, రెండు రోజుల్లో షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు.

వంద ఎకరాల భూమికి స్కెచ్‌పై సిట్ ఆరా

విశాఖ గ్రామీణ మండల తహసీల్దారు కార్యాలయం పరిధిలోని చినగదిలి సర్వే నంబర్ 1లో వంద ఎకరాల అటవీ భూమిని కొందరు సొంతం చేసుకొనేందుకు చేసిన ప్రయత్నాలపై సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై వంద ఎకరాల అటవీ భూమికి స్కెచ్ శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన కలెక్టర్ దీనిపై విచారణకు సిట్‌కు బదలాయించారు. ఈ మేరకు సిట్ అధికారులు శనివారం చినగదిలిలో ప్రభుత్వ భూమిని పరిశీలించి, కొందరిని విచారించినట్టు తెలిసింది.

రూ.6 కోట్లతో ఈపీడీసీఎల్ ఐటీ భవనం

నేడు మంత్రి కళా చేతులు మీదుగా ప్రారంభం

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఐటీ అవసరాల కోసం రూ.6 కోట్లతో నూతన భవనం నిర్మించింది. గురుద్వారా దగ్గరున్న కార్పొరేట్ కార్యాలయంలో ఇప్పుడు ఐటీ సంబంధిత వ్యవహారాలన్నీ నిర్వహిస్తున్నారు. అయితే వినియోగదారుల సంఖ్య లక్షల్లో వుండడం, వారి సమస్యల కోసం కాల్ సెంటర్ నిర్వహణ, దానికి అవసరమైన సాంకేతిక సిబ్బంది తదితరాలకు ప్రత్యేక భవనం అవసరమని గుర్తించడంతో ఏడాది క్రితం ఆ పక్కనే కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రౌండ్ ప్లస్ రెండు అంతస్థుల భవనాన్ని రూ.6 కోట్లతో నిర్మించింది. మొదటి అంతస్థులో కాల్ సెంటర్ నిర్వహిస్తారు. రెండవ అంతస్థులో లోడ్ మోనటరింగ్ సెల్, సమావేశం మందిరం ఏర్పాటు చేస్తున్నారు. ఈ భవనాన్ని ఇంధన శాఖ మంత్రి కళా వెంకటరావు ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారని సీఎండీ ఎం.ఎం.నాయక్ తెలిపారు.

రూ.కోటి 12 లక్షలతో ఏయూ స్పోర్ట్సు బోర్డు వార్షిక బడ్జెట్

విశాఖపట్నం (స్పోర్ట్సు): ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడా విభాగానికి 2017-18గాను రూ.కోటి 12 లక్షల వార్షిక బడ్జెట్ కేటాయించారు. ఏయూ పరిపాలనా విభాగంలో శనివారం జరిగిన ఏయూ స్పోర్ట్సు బోర్డు సమావేశంలో బోర్డు చైర్మన్, వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు క్రీడా విభాగానికి వరాలు కురిపించారు. బడ్జెట్ నిధుల నుంచి మల్టీ జిమ్ పరికరాలు, క్రీడా పరికరాలు, దుస్తులు, ఇతర పరికరాల కొనుగోలుతోపాటు ఆలిండియా విశ్వవిద్యాలయాల వ్యక్తిగత పోటీల్లో స్వర్ణం సాధించిన వారికి రూ.పది వేలు, రజతానికి రూ.ఐదు వేలు, కాంస్య పతకానికి రూ.మూడు వేలు నగదు ప్రోత్సాహం చెల్లించేందుకు వినియోగించేలా నిర్ణయం తీసుకున్నారు. టీం ఈవెంట్లలో గెలుపొందినవారికి కూడా నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. ఈ సమావేశంలో ఏయూ స్పోర్ట్సు బోర్డు కోశాధికారి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావు, స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.విజయమోహన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పల్లవి, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

పన్నుల శాఖ పంట పండింది..

తొలి త్రైమాసికంలో విశాఖ డివిజన్ నుంచి రూ.4 వేల కోట్లు

32 శాతం వృద్ధితో రాష్ట్రంలో ముందంజ

జీఎస్టీ అమలులోకి రానున్నట్టు ప్రకటించడంతో జూన్‌లో భారీగా సాగిన వ్యాపార లావాదేవీలు

చివరివారంలో పుంజుకున్న ఎలక్ట్రానిక్స్, రెడీమేడ్ దుస్తులు, ఇనుము, సిమెంట్ అమ్మకాలు

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

జీఎస్టీ అమలుకు ముందు వాణిజ్య పన్నుల శాఖకు భారీ ఆదాయం సమకూరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలో విశాఖ డివిజన్ రూ.4 వేల కోట్లు ఆదాయం ఆర్జించింది. జూలై ఒకటి నుంచి జీఎస్టీ అమలులోకి వచ్చింది. అయితే అంతకు ముందు మూడు నెలల కాలంలో పన్నులు వసూలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో వాణిజ్య పన్నుల శాఖదే. కొత్త రాష్ట్రంలో ఆయిల్ కంపెనీలన్నీ విశాఖ డివిజన్ పరిధిలో రిజిస్టర్ కావడంతో ఆయా సంస్థలు పన్నులు ఇక్కడే చెల్లిస్తున్నాయి. తొలి మూడు నెలల కాలానికి ఆయిల్ కంపెనీల నుంచి రూ.3,300 కోట్లు ఆదాయం వచ్చింది. ఇతరత్రా రంగాల నుంచి మరో రూ.700 కోట్లు సమకూరింది. ఉక్కు కర్మాగారం, వరుణ్ మోటార్స్, ఇతర వాహన వ్యాపారులు, ఇతరత్రా రంగాల్లో అమ్మకాలు పుంజుకోవడంతో వాణిజ్య పన్నుల శాఖకు ఆదాయం ఎక్కువగానే వచ్చింది. రాష్ట్రంలో పన్ను వసూళ్లలో వృద్ధి తొలి మూడు నెలల కాలంలో 21 శాతం వుండగా విశాఖ డివిజన్ 32 శాతం సాధించి ముందంజలో వుంది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో విశాఖ డివిజన్ రూ.3200 కోట్లు ఆదాయం వసూలు చేసింది. గత ఏడాదితో పోల్చితే మూడు నెలల కాలంలో ఏకంగా రూ.800 కోట్లు అదనంగా వచ్చింది. చమురు ధరలు స్వల్పంగా పెరగడం, ఇతరత్రా రంగాల్లో అమ్మకాలు పుంజుకోవడంతో పన్నుల వసూళ్లలో వృద్ధి నమోదైంది. కాగా జూలై ఒకటి నుంచి జీఎస్టీ అమలులోకి రానున్నట్టు ప్రకటించడంతో జూన్ రెండో వారం నుంచి పలు రంగాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. జూన్ చివరి వారంలో ఎలక్ట్రానిక్స్, రెడీమేడ్ దుస్తులు, ఇనుము, సిమెంట్ వ్యాపారాలు పుంజుకున్నాయి. ఇంకా జీఎస్టీ అమలులోకి వచ్చిన తరువాత కూడా జూలై తొలి వారం వరకు ఎక్కువ మంది వ్యాపారులు, జూన్ నెలలో అమ్మకాలు జరిపినట్టు రిటర్న్స్ చూపడంతో పన్నుల వసూళ్లలో వృద్ధి కనిపించింది. జీఎస్టీకి ముందు మూడు నెలల కాలంలో పన్నుల వసూళ్లలో వృద్ధి ఆశాజనంగా వుందన్నారు. జీఎస్టీ తరువాత పన్ను మొత్తం కేంద్రంలో జీఎస్టీ ఖాతాకు జమ అవుతుందన్నారు. వ్యాపారులు చెల్లించే పన్నుల మొత్తం తెలియాలంటే ఈనెల 20 తరువాత ఒక అంచనా దొరుకుతుందని పన్నుల విభాగం జాయింట్ కమిషనర్ కె.నాగేంద్ర తెలిపారు. విశాఖలో వ్యాపారం చేసే వర్తకుడు సరుకు కొనుగోలు చేసే చోటే పన్నులు చెల్లిస్తారని తరువాత ఇన్‌పుట్ క్రెడిట్ తీసుకుంటారన్నారు. వేరే రాష్ట్రంలో చెల్లించిన పన్నులు తరువాత కేంద్రం నుంచి రాష్ట్ర ఖాతాకు జమ అవుతాయని పేర్కొన్నారు. ఇక్కడ కేవలం అమ్మిన సరుకుపై అదనంగా వసూలు చేసిన మొత్తానికే పన్ను చెల్లిస్తారన్నారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన తరువాత వినియోగదారుల నుంచి వసూలు చేసే పన్నులను సీజీఎస్టీ, ఎజీఎస్టీ అంటూ వేరుగా పేర్కొంటూ బిల్లు ఆయన ఇవ్వాల్సిందేనని స్పష్టంచేశారు.

దిగొచ్చిన 'ఇండిగో'

రద్దు చేసుకున్న విమానం టిక్కెట్‌పై రూ.3,162లు వెనక్కి

ప్రయాణికుడికి న్యాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి):

ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ దిగొచ్చింది. విమాన ప్రయాణానికి రెండు రోజుల ముందు టిక్కెట్ రద్దు చేసుకుంటే రూ.5,912 ధరలో కేవలం రూ.208 మాత్రమే వెనక్కి వస్తుందని ప్రయాణికుడికి చెప్పిన ఆ సంస్థ ఒక్క రోజులో దారిలోకి వచ్చింది. 'రద్దు చేసుకుంటే... వీపు విమానం మోతే' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో ఆ సంస్థ వెంటనే స్పందించింది. మళ్లీ మాట మార్చి... ఆ ప్రయాణికుడికి విమానం టిక్కెట్ ధరలో 50 శాతం వెనక్కి ఇచ్చింది. వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వి.వి.కృష్ణారావు హైదరాబాద్ నుంచి విశాఖ రావడానికి ఈ నెల 4వ తేదీకి జూలై 28నే ఇండిగో విమానానికి రూ.5,912 చెల్లించి టిక్కెట్ బుక్ చేసుకున్నారు. అనుకోని కారణాలతో ఆయన ప్రయాణం రద్దు కావడంతో రెండు రోజులు ముందుగానే అంటే ఆగస్టు 2న ఆయన టిక్కెట్ రద్దు చేసుకున్నారు. పెనాల్టీలు, సర్వీసు చార్జీలు పోను కేవలం రూ.208 మాత్రమే వెనక్కి వస్తుందని అటు నుంచి సమాచారం వచ్చింది. ఈ విషయాన్ని కృష్ణారావు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకురావడంతో 'రద్దు చేసుకుంటే... వీపు విమానం మోతే' శీర్షికన కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో విమాన సంస్థ దిగి వచ్చింది. మళ్లీ కొత్త లెక్కలు వేసి, టిక్కెట్ ధరలో రూ.3,162 వెనక్కి ఇస్తున్నామని చెప్పి సమాచారం ఇచ్చింది. ఇదంతా 'ఆంధ్రజ్యోతి' వల్లనే సాధ్యమైందని కృష్ణారావు ఆనందం వ్యక్తం చేశారు. విమాన సంస్థలకు కూడా నిబంధనలు రూపొందించి, కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నత్తనడకన పోలవరం

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర నివేదికను ఉన్నతాధికారులు పంపించారు. వివరాల్లోకి వెళితే...

జిల్లాలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను 2018 నాటికి పూర్తి చేయాలని తెలుగుదేశం ప్రభుత్వం కృతనిశ్చయంతో వుంది. ఇందుకు అనుగుణంగానే ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 6,889 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పనులు శరవేగంగా సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కాని జిల్లాలోని ఆరో ప్యాకేజీ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. జిల్లాలో పాయకరావుపేట నుంచి ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరు వరకూ ఆరో ప్యాకేజీ పరిధి వుంది. 111వ నంబరు కి.మీ నుంచి 136 కి.మీ వరకూ 25 కి.మీ మేర పోలవరం ఎడమ ప్రధాన కాలువను పూర్తి చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టు సంస్థ మధుకాన్‌పై వుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.196.20 కోట్లు కేటాయించింది. వాస్తవానికి 2005 మార్చి 23 నుంచి 2007 మార్చి 22 నాటికి రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వానికి, మధుకాన్ సంస్థకు మధ్య ఒప్పందం కుదిరింది. అయితే పోలవరం కాలువకు భూముల సేకరణ, అటవీశాఖ, దేవాదాయశాఖల భూములకు సంబంధించి క్లియరెన్స్‌లు సకాలంలో రాకపోవడంతో కొన్నిచోట్ల పనులు చేపట్టే అవకాశం కలగలేదు. అన్ని క్లియరెన్స్‌ల అనంతరం 2017 డిసెంబర్ 31 నాటికి పనులు పూర్తి చేయాలంటూ ప్రభుత్వం అగ్రిమెంట్‌ను పొడిగించింది. కాని ఇప్పటికీ 57.28 శాతం మాత్రమే ఆరో ప్యాకేజీ పనులు జరిగాయి. ఆ తరువాత పనుల్లో ఎటువంటి కదలికల్లేవు. ఆరో ప్యాకేజీ కింద 1325.98 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి కాలువ పనులను సకాలంలో చేపట్టాలని ఆదేశించినప్పటికీ పనుల్లో ఎటువంటి పురోగతి కన్పించలేదని ప్రాజెక్ట్ అధికారులు ధ్రువీకరించారు. ప్రధానంగా పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో అయితే రెండేళ్ల నుంచి మీటరు పని కూడా జరగలేదని, దీనికి కారణం మధుకాన్ సంస్థ నిర్లక్ష్యమేనని ప్రాజెక్ట్ అధికారులు భావించారు. భూసేకరణ తంతు అంతా ముగిసినా పనులను సకాలంలో పూర్తిచేసేందుకు మధుకాన్ సంస్థ ముందుకు రాకపోవడంతో అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఇటీవల ఆ సంస్థకు నోటీసులు జారీ చేశారు. పనులు వేగవంతం కావాలంటే తక్షణం ఈ కాంట్రాక్ట్‌ను రద్దు చేసుకుని, కొత్తవారికి అప్పగించడం మంచిదని భావిస్తూ ఇటీవల ప్రభుత్వానికి ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు నివేదికను కూడా పంపించారు. మధుకాన్ నిర్లక్ష్యవైఖరిని రాష్ట్ర ప్రభుత్వం కూడా తీవ్రంగా పరిగణించినట్టు సమాచారం. త్వరలో టెండర్లు పిలిచి, కొత్తవారితో కాంట్రాక్ట్ కుదుర్చుకునే పనిలో అధికార యంత్రాంగం వుంది.

మధుకాన్‌కి నోటీసులు

జి.రామచంద్రరావు, ఈఈ, పోలవరం ప్రాజెక్ట్

పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి ఆరో ప్యాకేజీ కింద కాలువ తవ్వకం, లైనింగ్, వంతెల నిర్మాణం, తదితర పనుల కోసం మధుకాన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. కాని ఆరో ప్యాకేజీ పరిధిలో పనులు సరిగ్గా చేయలేదని, చాలా నిర్లక్ష్యంగా మధుకాన్ సంస్థ వుందని గుర్తించాం. ఈ మేరకు మధుకాన్ సంస్థ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వానికి కూడా ఈ సంస్థ కాంట్రాక్ట్ రద్దు చేసుకోవాలని సిఫార్సు చేస్తూ సమగ్ర నివేదికను అందజేశాం. త్వరలో ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.20
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.50
వంకాయలు(తెల్లవి)	రూ.30
వంకాయలు(నల్లవి)	రూ.30
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.30
క్యారెట్	రూ.30
క్యాబేజీ	రూ.20
బీన్స్	రూ.60
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.15
బీట్‌రూట్	రూ.30
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.--
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.30
అల్లం	రూ.50
చేమదుంపలు	రూ.30
దోసకాయ	రూ.20
కాకరకాయలు	రూ.30
ఆనపకాయ(చిన్నది)	రూ.08
ఆనపకాయ(పెద్దది)	రూ.12
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పుదినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.75
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.28
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనెధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో	
విశాఖపట్నం	323
విజయనగరం	327
శ్రీకాకుళం	327

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	82.00	80.00
విత్ స్కిన్	115.00	130.00
స్కిన్ లెస్	135.00	140.00

బెల్లం ధరలు(రూ.లలో)


	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	3490	4280
రెండో రకం	3065	3700
మూడో రకం	2565	3360

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 6



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మకంగా వ్యవహరించి సత్ఫలితాలు సాధిస్తారు. ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ పదవులు లభిస్తాయి. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఏర్పాట్లు చేసుకుంటారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం. బదిలీలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. రియల్‌ఎస్టేట్, ఫర్నిచర్ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి.



మిథునరాశి:(మే21-జూన్21): ఫీజులు, స్టేషనరీ కొనుగోలుకు నిధులు సర్దుబాటవుతాయి. పెట్టుడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. సన్నిహితుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. పూర్వమిత్రులను కలుసుకుంటారు.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): ప్రియతముల కోసం విలువైన వస్తువులు సేకరిస్తారు. స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో నిదానం అవసరం. భాగస్వామ్యాలు లాభిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): కొత్త ప్రాజెక్టుల గురించి ఆలోచిస్తారు. వైద్యం, యోగ, ధ్యానాలు, ఆహార నియమాలపై దృష్టి పెడతారు. వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక నిర్ణయాలకు తగిన సమయం కాదు.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): విద్యార్థులకు శుభప్రదం. విదేశీ విద్య కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. ప్రియతములకు సంబంధించిన ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): భూమి లావాదేవీలకు అనుకూలం, నిర్మాణరంగం వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. బంధు మిత్రుల కలయికతో ఇంట్లో సందడి నెలకొంటుంది. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లలో అసౌకర్యం కలగవచ్చు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖుల సహకారంతో విద్యాసంస్థలతో పనులు పూర్తి చేస్తారు. ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు, బోధనా రంగానికి చెందిన వారికి ప్రోత్సాహకరం. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఒక వార్త కలవరపెడుతుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): విద్య, ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. వ్యూహాత్మకంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లు చేసుకుంటారు. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): నిర్ణయాలను సమీక్షించుకుంటారు. పెట్టుబడులు, బీమా, మ్యూచువల్ ఫండ్ వ్యవహారాలపై ఒక నిర్ణయానికి వస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. విలువైన వస్తువులు కొనుగోలులో జాగ్రత్త అవసరం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): రాజకీయాలు, సినిమా, టెలివిజన్ రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామి వ్యవహారశైలి ఆవేదన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక, సాహితీ ప్రముఖుల్ని కలుసుకుంటారు.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు సత్ఫలితాలనిస్తాయి. హోటల్, ఆస్పత్రులు, బ్యాంకులు, సహకార సంఘాల ఉద్యోగులకు ఆర్థికంగా ప్రోత్సాహకరం. విందు వినోదాలకు ఖర్చులు అధికం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

బాధ ముంచుకొస్తుంది.. కన్నీళ్లు ఆగకుండా వచ్చేస్తుంటాయి. అంతలోనే ఓ ఆత్మీయ స్పర్శ భుజంపై మెల్లిగా తడుతుంది. ప్రేమతో మాట్లాడే ఆ నాలుగు మాటలతో.. బాధ సగం తగ్గిపోతుంది.

* * *

లంచ్ బెల్ మోగుతుంది. చెట్ల కింద అందరూ కూర్చొంటారు. గబగబా లంచ్‌బాక్సులు తెరుస్తారు. వాళ్లకు దూరంగా ఓ పిల్లోడు బాధ పడుతూ, ఒంటరిగా కూర్చొంటాడు. అటుగా చూసినా ఓ ఇద్దరు.. ఆ పిల్లోడిని గుంపులోకి తీసుకొస్తారు. ప్రేమగా గోరుముద్దలు పెడతారు. అంతే ఎక్కడలేని సంతోషం ఆ చిన్నోడి పెదాలపై వచ్చి చేరుతుంది.

* * *

జీవితం ఎటు పోతోందో తెలియదు. 'ఏం చేయాలనుకుంటున్నావు?' అని నాన్న రోజూ తిడుతుంటాడు. 'కెరీర్ సెట్ చేసుకో రా' అని అమ్మ మెల్లగా మందలిస్తుంది. ఆత్మీయులు 'నెక్స్ట్ ఏంటీ?' అని అడుగుతుంటారు. సరిగా అప్పుడే ఓ చేయి.. ఆ వ్యక్తిని పట్టుకుని.. 'ఇదే నీ దారి! ఇదే నీ జీవితం! కష్టపడు, ఇష్టపడు.. సాధించు' అంటూ దిశానిర్దేశం చేస్తుంది.

* * *



అల్లరి.. ఆనందం.. అనుబంధం

అవసరాల్లో, ఆనందంలో.. ఎప్పుడూ చేయి వీడని స్నేహితులారా! మీ కోసం మళ్లీ వచ్చేసింది.. ఓ పుట్టినరోజు! ఒక పండుగ రోజు! ఏ భేద భావం లేని మనసైన మిత్రుల 'మైత్రీ దినోత్సవం'... ఫ్రెండ్‌షిప్ డే!

జీవితంలో మిత్రులనూ, శత్రువులనూ గుర్తించడం నేర్చుకోవాలి. లేదంటే.. సమస్యల్లో చిక్కుకోవాల్సిందే. కొందరు పైకి గంభీరంగా కనిపించినా అవసరానికి ఆదుకుంటారు. ఇంకొందరు వెన్నంటే ఉంటారు, రాసుకు పూసుకు తిరుగుతారు. కానీ అవసరం వస్తే.. తప్పించుకు తిరుగుతారు. మరికొందరు.. ఆత్మీయ స్నేహితుల మధ్య చిచ్చు పెట్టి, వారిని విడదీయాలని చూస్తుంటారు. అందుకే 'స్నేహితులు తమ మధ్య అపార్థాలు రాకుండా చూసుకుంటూనే.. శత్రువుల వల్ల అనర్థాలు కలగకుండా జాగ్రత్త పడాలి'.


"కలిసిమెలిసి ఉండగలగడం, ఒకరి కోసం ఒకరు పోరాడగలగడం, అవసరమైనపుడు తీరిక లేదనో, అలసిపోయాననో అనకుండా, ఆపదలో ఆదుకోవడం - స్నేహంలో ముఖ్య లక్షణాలు."

ఐక్యరాజ్య సమితి మాజీ ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ భార్య నానే అన్నన్ 1998లో 'ఫ్రెండిషిప్ డే'గౌరవార్థం 'విన్నీ ద పూ' అనే కార్టూన్ క్యారెక్టర్‌ని ప్రపంచపు స్నేహదూతగా (ఫ్రెండ్‌షిప్ డే అంబాసిడర్)గా ప్రకటించారు.

2011లో ఐక్యరాజ్య సమితి జూలై 30వ తేదీని 'అంతర్జాతీయ మైత్రీ దినోత్సవంగా అధికారకంగా ప్రకటించింది. అయినా, మన దేశంతో పాటు, మరికొన్ని దేశాలు మాత్రం ఆగస్టు మొదటి ఆదివారాన్ని 'ఫ్రెండ్‌షిప్ డే'గా జరుపుకొంటున్నాయి.

'స్నేహితుల దినోత్సవం' పుట్టింది అమెరికాలో.. 1935లో అయినా.. స్నేహం పుట్టుక మాత్రం మనిషి పుట్టుకంత ప్రాచీనమైంది.

'స్నేహమంటే పాత పరిచయం కాదు. ఎప్పుడూ వీడని అనుబంధం.'



"నేను మారినపుడు మారిపోతూ, నేను తలూపినపుడు తనూ తలూపుతూ ఉండే స్నేహితుడు నాకు అవసరం లేదు. నా నీడ ఆ పనిని ఇంకా మెరుగ్గా చేస్తుంది"
– ప్లుటార్క్, గ్రీకు తత్త్వవేత్త


"నా వెనక నడవకు - నేను నీకు దారి చూపించలేక పోవచ్చు. నా ముందు నడవకు - నేను నిన్ను అనుసరించకపోవచ్చు. నా జతగా నడు, నా స్నేహితుడిగా ఉండిపో"
– ఆల్బర్ట్ కేమస్, రచయిత, తత్త్వవేత్త

"నీ తప్పును, నీ తెలివితక్కువ పనులను నీ ముందుంచేవాడే నిజమైన స్నేహితుడు."
– బెంజిమిన్ ఫ్రాంక్లిన్

"నీవుంటే వేరే కనులెందుకు
నీకంటే వేరే బతుకెందుకు
నీ బాటలోని అడుగులు నావి
నా పాటలోని మాటలు నీవి"
– సి. నారాయణరెడ్డి

Happy Friendship Day

చుక్కలు కలపండి



టంగ్ ట్విస్టర్స్



1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.

సూక్తి

వందమంది స్నేహితులు ఉండక్కర్లేదు...
వంద సమస్యలు వచ్చినా అండగా ఉండే స్నేహితుడు ఒకరు ఉంటే చాలు!

నవ్వుల్ నవ్వుల్



సోని : నాన్నా! శిఖరాగ్ర సమావేశాల్లో అంతా శిఖరాలపై కూర్చొని మాట్లాడుకుంటారా? పడిపోరా మరి?
మిస్టర్ మేధావి : అప్పుడు అక్కడ చదును చేస్తారు రా!
సోని : అవునా!

* * *

పార్థు : నాకు వంద రూపాయలు దొరికాయోచ్!
సోము : ఆ వంద నాదే రా!
పార్థు : నాకు దొరికింది రెండు యాభై రూపాయల నోట్లు.
సోము : అవునా! నా వంద కింద పడినప్పుడు రెండు ముక్కలైనట్లు ఉంది.
పార్థు : !!!!!!!!!!!!!

చెప్పగలరా?

పాతికలో ఉన్నాను, కానీ రతికలో లేను
పావులో ఉన్నాను కానీ, పాకలో లేను
రంగంలో ఉన్నాను కానీ, గంగలో లేను
అయితే నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. హవానం ▸ ....
2. స్వాతంగ ▸ ....
3. కిపల్ల ▸ ....

పదాలు గుర్తించండి



buddy caring forever friends laughter
listen love share together trust

f r i e n d s k f l n s
o t o g e t h e r u s n
r o m r w a a b v y u i
e g j l l t r u s t r e
v h m u r t e v f w q b
e b v t e h j n r e p u
r p o l h c b n l d i d
l i s n y a u c o z z d
p r e w n r d m v v c y
l o y e l i s t e n s s
b e c z i n s h a m u l
t t l a u g h t e r n e

a cupcake for the teacher

జవాబులు

జంతర్‌మంతర్ : 1. వాహనం 2. స్వాగతం 3. పల్లకి
చెప్పగలరా? : పావురం

ఆంధ్రజ్యోతి

16



విశాఖపట్నం

ఆదివారం 6 ఆగస్టు 2017

తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.

రూ.100 : అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.


శ్రీనివాసమ్: అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.

రూ.300 దర్శనం : ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 21 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబరు 5, 19 తప్ప)

రూ.50 దర్శనం : ఖాళీలు లేవు.

ఆర్జిత సేవలు : డిసెంబర్ 5వ తేదీ ఉన్నాయి

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు,

ఇతర సమాచారం కోసం... 139

ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182

అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం



APSRTC

అనకాపల్లి ఎంక్వైరీ 77300 37027

నర్సీపట్నం ఎంక్వైరీ 94932 11969

పాడేరు ఎంక్వైరీ (డీఎం) 73829 14859



పల్లెకు జ్వరం

కలుషిత నీరు, వాతావరణంలో మార్పులే కారణం
దగ్గు, జ్వరంతో మూలుగుతున్న జనం
కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు
మెరుగైన వైద్యం అందిస్తున్న సర్కారు వైద్యులు

నక్కపల్లి : పల్లె ప్రజలు వ్యాధులతో అల్లాడుతున్నారు. వాతావరణంలో మార్పులు, నీటి కాలుష్యం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడం తదితర కారణాల నేపథ్యంలో రోజురోజుకూ వ్యాధిగ్రస్థుల సంఖ్య పెరుగుతోంది. ఎప్పుడూ లేని విధంగా గత పక్షం రోజుల నుంచి నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని అనేక గ్రామాల్లో పిల్లల నుంచి పెద్దల వరకూ తీవ్రమైన దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. ఒకసారి దగ్గు, జలుబు, జ్వరం వస్తే తగ్గడానికి దాదాపు పది రోజులు సమయం పడుతోంది. ఆర్థిక స్థోమత గలవారు తుని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తుండగా, మిగిలిన వారంతా ప్రభుత్వాస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల వైపే రోగులు మొగ్గు

మండల కేంద్రమైన నక్కపల్లి సహా పెదతీనార్ల, చినతీనార్ల, జానకయ్యపేట, సీహెచ్ఎల్పురం, ఉపమాక, కాగిత, న్యాయంపూడి, పెదబోదిగల్లం, రామకృష్ణాపురం, పెదదొడ్డిగల్లు, గొడిచెర్ల, ఉద్దండపురం, రాజయ్యపేట, ఎన్.నర్సాపురం, చందనాడ, అమలాపురం తదితర గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతుండడంతో పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. నక్కపల్లి 30 పడకల ఆస్పత్రికి వచ్చే రోగుల్లో ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరు, కొరుప్రోలు, రామయ్యపట్నం, అడ్డురోడ్డు, తదితర గ్రామాలకు చెందిన వారు కూడా వుంటున్నారు. పెనుగొల్లు, ధర్మవరం, ఎస్.రాయవరం, ఒమ్మవరం, సోముదేవుపల్లి తదితర గ్రామాలవారు పెనుగొల్లు పీహెచ్సీకి వెళ్తున్నారు. నక్కపల్లి మండలం గొడిచెర్ల, ఉద్దండపురం, గుల్లిపాడు, రేబాక, దోసలపాడు, జీ జగన్నాథపురం, చీడిక, దేవవరం, చినరాంభద్రపురం తదితర గ్రామాలకు చెందిన రోగులు గొడిచెర్ల పీహెచ్సీకి వెళ్తున్నారు.

కిక్కిరిస్తున్న 30 పడకల ఆస్పత్రి

నక్కపల్లి 30 పడకల ఆస్పత్రి రోజూ వందలాది మంది రోగులతో కిక్కిరిసిపోతోంది. సగటున రోజుకు ఈ ఆస్పత్రికి 300 మంది వరకూ రోగులు వస్తుండగా వారిలో చాలా మంది కీళ్లనొప్పులు, దగ్గు, జ్వరం, జలుబుతో బాధపడుతున్నవారే కావడం విశేషం. ఈ వ్యాధులతో బాధపడేవారిలో ఎక్కువగా పిల్లలు ఉంటున్నారని నక్కపల్లి ఆస్పత్రి వైద్యాధికారులు చెపుతున్నారు. నక్కపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సహా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు పీహెచ్సీ, నక్కపల్లి మండలం గొడిచెర్ల పీహెచ్సీలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఈ ఆస్పత్రుల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉంటుండడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లడం కన్నా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేందుకే పేద, మధ్యతరగతి వర్గాలవారు మక్కువ చూపుతున్నారు.



ఓపీ కౌంటర్ వద్ద రోగులు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి కిశోర్ కుమార్

జ్వరం, కీళ్లనొప్పులతో బాధపడేవారే ఎక్కువ



నక్కపల్లి ఆస్పత్రికి వస్తున్న రోగుల్లో ఎక్కువమంది కీళ్లనొప్పులు, దగ్గు, జ్వరంతో బాధపడేవారే ఉంటున్నారు. ఆరోగ్యంపట్ల కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే చాలా మంది వ్యాధుల బారిన పడుతున్నారు. పిల్లలకు చల్లని నీరు ఇవ్వడం వల్ల జలుబు ఆ వెంటనే దగ్గు, జ్వరం వచ్చే ప్రమాదం ఉంది. అందుకే పిల్లల నుంచి పెద్దల వరకూ అంతా కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల సాధ్యమైనంత వరకూ ఇటువంటి రోగాలను దరిచేరకుండా కాపాడుకోవచ్చును. రెండువారాలకు మించి దగ్గు తగ్గకపోతే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల వల్ల ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి.

- డాక్టర్ పూర్ణచంద్రరావు, సూపరింటెండెంట్, నక్కపల్లి సీహెచ్సీ

ఈ ఏడాదికి లేనట్టే!

నర్సీపట్నానికి మంజూరుకాని గురుకుల కళాశాల
అమలుకాని మంత్రి 'గంటా' హామీ
నిరాశలో విద్యార్థులు, తల్లిదండ్రులు

నర్సీపట్నం : దాదాపు మూడు దశాబ్దాల క్రితం ప్రారంభించిన నర్సీపట్నం గురుకుల బాలుర పాఠశాల స్థాయిని పెంచి జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనే ఈ ఏడాది కూడా కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా అనేక సంవత్సరాలుగా జూనియర్ కళాశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టాక అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నర్సీపట్నానికి గురుకుల పాఠశాల మంజూరు చేశారు.

ఈ పాఠశాల అప్పట్నుంచి నేటివరకు ఎటువంటి ఎదుగు, బొదుగు లేకుండా కొనసాగుతోంది. గడిచిన 30 ఏళ్లలో ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులెందరో దేశ, విదేశాలలో ప్రముఖ వైద్యులు, ఇంజనీర్‌లు, ఇతర ఉన్నత ఉద్యోగులుగా స్థిరపడ్డారు. గ్రామీణ జిల్లాలో మొట్టమొదటగా స్థాపించిన ప్రభుత్వ గురుకుల పాఠశాల అయినప్పటికీ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు అనేక సంవత్సరాల పాటు ఎవరూ ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అనేక గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఉన్నప్పటికీ సాధారణ గురుకుల పాఠశాలలు కేవలం నర్సీపట్నం, భీమిలి, అచ్యుతాపురం ప్రాంతాల్లో మాత్రమే ఉన్నవి.



నర్సీపట్నంలోని గురుకుల బాలుర పాఠశాల

సభాముఖంగా మంత్రి చెప్పినా..

నర్సీపట్నంలో నిర్మించిన సత్యనారాయణస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన విద్యా శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు గత ఏప్రిల్ 30న మంత్రి అయ్యన్న విజ్ఞప్తి మేరకు నర్సీపట్నంలో గురుకుల కళాశాలను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తామని ఉత్తరవాహిని వద్ద జరిగిన బహిరంగ సభలో ప్రకటించారు. అయితే ఇంతవరకూ ఇందుకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు వెలువడలేదు. కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ రాష్ట్రవ్యాప్తంగా పది జూనియర్ కళాశాలలను మంజూరు చేసింది. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై 40రోజులు దాటినప్పటికీ నర్సీపట్నానికి గురుకుల కళాశాల మంజూరు కాలేదు. ఇక ఈ ఏడాదికి ఈ కళాశాల లేనట్టేనని అధికారులు అంటున్నారు.

అదనపు భవనాలకు నిధులు మంజూరు

గురుకుల జూనియర్ కళాశాల మంజూరు చేయకపోయినా నర్సీపట్నం గురుకుల పాఠశాల ఆవరణలో అదనపు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.7కోట్లు నిధులు మంజూరు చేయడం విశేషం. ఆరు నుంచి పదో తరగతి వరకూ 450 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో డార్మెటరీ, తరగతి గదుల కొరత ఉంది. దాంతో ప్రభుత్వం అదనపు భవనాల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేయడంతో జూనియర్ కళాశాల తరగతుల నిర్వహణకు కూడా భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు ఉండవని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వామిబాబు అన్నారు. నర్సీపట్నంలో గురుకుల జూనియర్ కళాశాల మంజూరుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ స్థాయిలోనే పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చే విద్యా సంవత్సరానికి జూనియర్ కళాశాల మంజూరు కావచ్చన్నారు.



బియ్యపు గింజపై వీణ

హస్త కళాకారుడు చిన్నయాచారి మరో అద్భుతం



ఎలమంచిలి రూరల్ : హస్తకళ ద్వారా ఎన్నెన్నో అపురూప చిత్రాలకు జీవం పోసిన ఏటికొప్పాకకు చెందిన కళాకారుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీశైలపు చిన్నయాచారి మరో అద్భుతాన్ని సృష్టించాడు. నాలుగు మిల్లీ మీటర్ల బూతద్దాన్ని ఉపయోగించి బ్రహ్మజెముడు ముల్లుతో బియ్యపు గింజపై ఐదు రోజులపాటు శ్రమించి సూక్ష్మ రూపంలో అతి చిన్న వీణను తయారు చేశాడు. అంతేకాక దానికి తీగలు కూడా అమర్చడం విశేషం. గతంలో బియ్యపు గింజపై రామ పట్టాభిషేకం, జాతీయ జెండా ఆవిష్కరణ, తాటి ముల్లుతో తల వెంట్రుకపై కొంగ వంటి అతి చిన్న బొమ్మలు తయారు చేసిన ఘనత కూడా ఈయనకు ఉంది.

ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్టుగా జయశ్రీ

పాడేరు రూరల్: ఏరియా ఆస్పత్రి గైనికాలజిస్టుగా జయశ్రీ శనివారం బాధ్యతలు చేపట్టారు. గైనికాలజిస్టు లేకపోవడంతో గర్భిణులు పడుతున్న ఇబ్బందులను ఇటీవల మన్యం పర్యటనకు వచ్చిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు, కమిషనర్ పూనం మాలకొండయ్య గుర్తించారు. ఈ మేరకు పూర్తి స్థాయి గైనిక్‌ను నియమించేవరకూ మైదాన ప్రాంత గైనికాలజిస్టులను నెలకు ఒకరిని డిప్యూటేషన్‌పై నియమించాలని సూచించారు. ఈ మేరకు కోటవురట్ల ఆస్పత్రిలో విధులు నిర్వహించే గైనిక్ జయశ్రీకి బాధ్యతలు అప్పగించారు.

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం!

అటవీ, వ్యవసాయ ఉత్పత్తులే గిరిజనుల జీవనాధారం. వీటి సేకరణ, సాగుకు కొండకోనల్లో నిరంతరం అలుపెరగని పోరాటం సాగిస్తారు. అక్కడితో పనైపోతే సమస్యే లేదు. ఆయా ఉత్పత్తుల విక్రయాలకు ఎదురయ్యే అవాంతరాలు అన్నీ ఇన్నీ కావు. అష్టకష్టాలు పడి వారపు సంతలకు సరుకులు తీసుకొస్తే, అక్కడ దళారులు గెద్దల్లా తన్నుకుపోతారు. వారి అమాకత్వాన్ని ఆసరాగా చేసుకుని తూకాల్లో మోసాలకు పాల్పడి నిలువ దోచేస్తారు. అయితే, ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి డిజిటల్ తూనిక యంత్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడివరకూ బాగానే ఉన్నా, ఈ వినూత్న కార్యక్రమం అమలు కాకపోవడమే గిరిజనుల దౌర్భాగ్యం.

అక్కరకురాని డిజిటల్ తూనిక యాంత్రాలు

- అలంకారప్రాయంగా వారపు సంత షెడ్లు
- అధ్వానంగా పరిసరాలు.. తుప్పు పడుతున్న పరికరాలు
- రూ.లక్షల ప్రభుత్వ ధనం వృథా
- యధాతథంగా తూనికల్లో మోసాలు.. నష్టపోతున్న గిరి రైతులు



ఆకతాయిలకు నిలయంగా మారిన డిజిటల్ తూనిక యంత్రాల షెడ్డు



ప్లాస్టిక్ గ్లాసులు, మద్యం సీసాలు, పాన్ మరకలతో ఉన్న షెడ్డు లోపల పరిసరాలు

చింతపల్లి: గిరిజనుల శ్రమ దళారుల పాలు కాకుండా ఉండేందుకు ఐటీడీఏ గత పీవో హరినారాయణన్ డిజిటల్ తూనిక యంత్రాలను ఏర్పాటు చేయాలని యోచించారు. ఏజెన్సీలోని 11 మండలాల్లో 20 సంతల్లో షెడ్లు నిర్మించి యంత్రాలు ఏర్పాటు చేయడానికి రూ.కోటి 20 లక్షలు మంజూరు చేశారు. ఒక్కో షెడ్డు నిర్మాణంతో పాటు యంత్రాల కోసం రూ.6 లక్షలు చొప్పున వెచ్చించారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు వీటిని నిర్మించి పంచాయతీ అధికారులకు అప్పగించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సమయానికి ఐటీడీఏ పీవో హరినారాయణన్ గ్రేటర్ విశాఖ కమిషనర్‌గా బదిలీపై వెళ్లిపోయారు. ఆపై ఈ సంతషెడ్ల నిర్మాణ బాధ్యతలను పట్టించుకునే నాథులే కరువయ్యారు. షెడ్ల నిర్మాణాలు పూర్తయి దాదాపు పది నెలలు కావస్తున్నా అమలులోకి మాత్రం రాలేదు. సరికదా! వాటిని పూర్తిగా గాలికొదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయాయి. అలాగే డిజిటల్ యంత్రాలు తుప్పు పట్టిపోతున్నాయి.

వినియోగంలోకి రాని షెడ్లు

గూడెంకొత్తవీధి, పెదవలస గ్రామ పంచాయతీ కేంద్రాల్లో డిజిటల్ తూనిక యంత్రాల షెడ్లను నిర్మించారు. పెదవలసలో వారపు సంత ఒకచోట జరుగుతుండగా, సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో డిజిటల్ తూనిక యంత్రాల షెడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఈ షెడ్డును పంచాయతీ అధికారులు ఇతర కార్యక్రమాలకు ఉపయోగించుకుంటున్నారు. గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో నిర్మించిన షెడ్డు ఒక్క రోజు కూడా తెరిచిన పాపానికి పోలేదు.



తుప్పుపట్టి నిరుపయోగంగా ఉన్న డిజిటల్ తూనిక యంత్రాలు

ఆకతాయిల నిలయం

చింతపల్లి డిజిటల్ తూణిక యంత్రాల షెడ్డు ఆకతాయిలకు అడ్డాగా మారిపోయింది. ఈ షెడ్డుకు కనీసం తాళాలు కూడా వేయకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. పగటిపూట కొంత మంది వ్యక్తులు అష్టాచెమ్మా, పేకాట ఆడుతున్నారు. రాత్రయితే మద్యం తాగి బాటిళ్లను అక్కడే పడేస్తున్నారు. అలాగే గోడలపై పాన్ నమిలేసి ఉమ్మతున్నారు. దీంతో సంత షెడ్లతో పాటు పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి.

గిరిజనుల అక్కరకురాని యంత్రాలు

లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన విలువైన డిజిటల్ తూనిక యంత్రాలు, డిజిటల్ వేయింగ్ మీటర్లను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గిరిజనులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. ఎప్పటిలాగే వారు దళారుల చేతిలో దగా పడుతున్నారు. అలాగే డిజిటల్ తూనియ యంత్రాలు ప్రారంభించకుండానే తుప్పు పట్టిపోతున్నాయి.

పంచాయతీలదే నిర్వహణ బాధ్యత



చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో నిర్మించిన డిజిటల్ తూనిక యంత్రాలను పంచాయతీలకు అప్పగించాం. షెడ్లను అప్పగించినప్పుడు సంబంధిత కార్యదర్శి నుంచి లిఖితపూర్వక ధ్రువీకరణ పత్రాలను కూడా తీసుకున్నాం. పంచాయతీ అధికారులే నిర్వహణ బాధ్యతలు చూసుకోవాలి.

- డీవీఆర్ఎం.రాజు, డీఈఈ, టీడబ్ల్యూ



చెత్తాచెదారంతో నిండిపోయిన సంత షెడ్డు

'మన్యంలో బీజేపీకి మంచి ఆదరణ'

కొయ్యూరు: ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలతో మన్యంలో బీజేపీకి ఆదరణ పెరుగుతున్నదని గిరిజన మోర్చ రాష్ట్ర నేత లోకుల గాంధీ అన్నారు. గంగవరం గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులతోఓ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ విషయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు కె.సుబ్రహ్మణ్యం, కూడ నూకరాజు, ఎం.అప్పలరాజు, ఎ.రాజు పాల్గొన్నారు.

మైనింగ్ నిర్వహిస్తే సహించం



సభలో మాట్లాడుతున్న సర్పంచ్

గూడెంకొత్తవీధి: గిరిజనుల భూముల్లో మైనింగ్ నిర్వహిస్తే సహించేది లేదని రింతాడ సర్పంచ్ సాగిన పుష్పకుమారి హెచ్చరించారు. శనివారం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ, సీలేరు-చింతపల్లి రహదారి అవసరానికి మినహా మెటల్, తారు మిక్సింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. అలాగే లీజుకు తీసుకున్న భూమి సమీపంలో ఎటువంటి తవ్వకాలు చేసినా సహించేది లేదన్నారు. గతంలో లీజు పేరిట పంచాయతీ, పెసా తీర్మానాలు లేకుండా సాగు, మైనింగ్ నిర్వహించారని, ఇకపై వాటికి తావు లేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి

పాడేరు రూరల్: గిరిజన ప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.ప్రేమాకరరావు కోరారు. గొండెలి పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ పలాసి కోటేశ్వరరావు అధ్యక్షతన శనివారం మన గ్రామం-మన విశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నదని, అర్హులంతా వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం గ్యాస్ కనెక్షన్ మంజూరైన లబ్ధిదారులకు స్టవ్, సిలిండర్‌లను అందించారు. పంచాయతీలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఈ కొత్తూరులో ఏర్పాటు చేసిన కాఫీ మొక్కల నర్సరీని పరిశీలించారు. కాఫీ మొక్కలు నాటుకొనేందుకు గుంతలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఆర్ఐ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దీపం గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న ఎంపీడీవో ప్రేమాకరరావు

తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం

జి.మాడుగుల: తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని జడ్పీటీసీ సభ్యుడు సింగిడి ఆదినారాయణ అన్నారు. మండల కేంద్రంలోని శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం నిర్వహించిన సదస్సులో జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ, బాలింతలు తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలనే అందించాలన్నారు. అలాగే ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించేందుకు ఈ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ సిబ్బంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరహాలమ్మ, సీడీపీవో ఊర్మిళ, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

16 నుంచి ఇంటర్ ప్రవేశాలు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరానికి సంబంధించి ఈ నెల 16వ తేదీ నుంచి ప్రవేశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుఉ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని మండలంలోని విద్యార్థుల తల్లి దండ్రులు గమనించి పిల్లలకు ప్రవేశాలు కల్పించాలని ఆయన కోరారు.

ఉప రాష్ట్రపతిగా వెంకయ్య ఎన్నికపై బీజేపీ హర్షం

పాడేరు: ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు ఎన్నికపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వెంకయ్య వంటి నేతలు ఉప రాష్ట్రపతి స్థానంలో ఉండడం దేశానికి ఎంతో మేలని బీజేపీ నాయకులు కురుసా బొజయ్య, ఉమామహేశ్వరరావు, రాజారావు, రవికుమార్, రామకృష్ణ తదితరులు అన్నారు. బీజేపీతోనే దేశ సుస్థిరత సాధ్యమన్నారు. వెంకయ్యనాయుడు వంటి నాయకుల వల్ల దేశానికి అంతా మంచి జరుగుతుందని వారు ఆకాక్షించారు.

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	దర్శకుడు
శ్రీసాయిలక్ష్మి	గౌతమ్‌నంద
సాయిలక్ష్మి(ఏసీ)	ఫిదా
పూర్ణ	నక్షత్రం

వీఆర్ పురంలో మన గ్రామం-మన విశాఖ



వెంకటాపురం గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

దేవరాపల్లి: మండలంలోని వెంకటరాజపురంలో శనివారం మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అధికారి మహలక్ష్మి తన బృందంతో గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసకున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అంగన్‌వాడీ భవనాలు అద్దె భవనాల్లో ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తల అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి అధికారులు స్పందించి తాత్కాలికంగా గ్రామ పంచాయతీ భవనంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సాగించడానికి పంచాయతీ కార్యదర్శి ఎరకయ్య, సర్పంచ్ లెక్కల దాలిబాబులతో సంప్రదించారు. దానికి వారు అంగీకరించారు. వెంటనే రెండు కేంద్రాలను పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసుకోవాల్సిందిగా అంగన్‌వాడీ బోధకులకు అధికారులు సూచించారు. పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ డిపోలో సరుకులు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎన్.నీరజ, పశు వైద్యాధికారి సీహెచ్.కిరణ్మయి, ఐసీడీఎస్ పీవో రొంగలి ఉమాదేవి, ఏపీఎం బీడీ తిలక్, ఏపీవో తిరుపతిరావు పాల్గొన్నారు.



ఎం.కోటపాడులో మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్‌పై ర్యాలీ

మాడుగుల రూరల్ : మండలంలోని ఎం.కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్‌పై శనివారం ర్యాలీ నిర్వహించారు. 9 నెలల పిల్లల నుంచి పదిహేనేళ్ల లోపు పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయించాలని వైద్య సిబ్బంది కోరారు. హెచ్‌ఎం సీహెచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పిప్పలమోడి వ్యాపారులకు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి హామీ



పిప్పలమోడి వ్యాపారులతో మాట్లాడుతున్న రామానాయుడు

మాడుగుల: మాడుగుల ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల పిప్పలమోడి వ్యాపారుల సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు వ్యాపారులకు హామీ ఇచ్చారు. శనివారం మాడుగుల వచ్చిన ఆయనను పిప్పలమోడి వ్యాపారులు కలిసి తమ వ్యాపారానికి జీఎస్టీ వర్తిస్తుందా లేదా అన్నది అర్థం కావడం లేదని, వాణిజ్య పన్నుల శాఖ నుంచి కూడా తమకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని తెలిపారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడి దృష్టికి తీసుకెళతానని రామానాయుడు అన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం, ఒకరి అరెస్ట్

మాడుగుల రూరల్ : సారా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి 40 లీటర్ల సారా, బైక్ స్వాధీనపరచుకున్నట్లు మాడుగుల ఎక్సైజ్ సీఐ టి.నాగేశ్వరరావు తెలిపారు. చీడికాడ మండలం శిరిజాం గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం సిబ్బందితో కలిసి రూట్ వాచ్ చేస్తుండగా బైక్‌పై 40లీటర్లు నాటుసారాతో వస్తున్న శిరిజాం గ్రామానికి చెందిన దిబ్బిడి కల్యాణాన్ని అరెస్ట్ చేసి అతడి నుంచి 40 లీటర్ల సారా, అతడి బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న కళావతి

చీడికాడ: తల్లిపాలే చిన్నారులకు ఆరోగ్యమని ఎంపీపీ కుచ్చు కళావతి అన్నారు. మండలంలోని కోనాం క్లస్టర్ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి కోనాం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు అందిస్తే ఎటువంటి వ్యాధులు సోకవన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు పి.సత్యవతి మాట్లాడుతూ పుట్టిన ప్పటి నుంచి ఏడాదివరకైనా తల్లిపాలు అందిస్తే బిడ్డ ఎదుగుదల బాగుంటుందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది పిల్లలకు ఐదేళ్ల వరకూ పౌష్టికాహారం అందించాలన్నారు. సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, ఐసీడీఎస్ పీవో అనంతలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ఆలయ ప్రాంగణంలో మొక్క నాటుతున్న అటవీ అధికారులు

దేవరాపల్లి: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని అటవీశాఖ అధికారి ఎం.రమేష్‌కుమార్ అన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైవాడలో శనివారం సాయిబాబా ఆలయ ప్రాంగణంలో మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ రైతులు గట్లపై వేసుకోవడానికి, టేకు మొక్కలు ఉచితంగా అందజేస్తున్నామని, వాటితోపాటు వేప, కాగు, నేరేడు, బాదం తదితర మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, ఆసక్తి గల రైతులు తమ ఆధార్‌కార్డు తీసుకువచ్చి అటవీశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. అలాగే పెరటిలో వేసుకొనే పండ్లజాతి మొక్కలను కూడా ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు. రైవాడ పంచాయతీలో బాదం 30, వేప 30, కాగు 40 మొక్కలు వేశామని, వాటి సంరక్షణ బాధ్యతను ప్రజలే చూసుకోవాలని ఆయన కోరారు

ఎ.అగ్రహారంలో పోస్టాఫీసు ప్రారంభం

చీడికాడ: ఎ.అగ్రహారంలో ఏర్పాటు చేసిన పోస్టాఫీస్‌ను సర్పంచ్ మైచర్ల నానాజీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వరహాపురం గ్రామంలో ఉన్న పోస్టాఫీస్‌కు తమ గ్రామం నుంచి సుమారు ఐదు కిలోమీటర్లు వెళ్లేవారని, అధికారులకు వినతి మేరకు పోస్టాఫీస్ మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్‌శాఖ చోడవరం సిబ్బంది కె.సత్యనారాయణ, టి.దేముడునాయుడు, కేవీ కామేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడల పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

చీడికాడ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బైలపూడి హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం క్రీడల పోటీలను ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో హోరాహోరీగా జరుగుతున్న బాలుర కబడ్డా పోటీలకు న్యాయనిర్ణేతగా పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రెడ్డి మహేష్‌తో పాటు మరో ఉపాధ్యాయుడు వ్యవహరించారు.

గిరిజన గ్రామాల్లో హోమియో వైద్య శిబిరాలు

దేవరాపల్లి: పెదగంగవరం, వాలాబు గిరిజన గ్రామాల్లో శనివారం నిర్వహించిన హోమియో వైద్యశిబిరాలలో 1500 మందికి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి అరుణ్‌ప్రకాష్ తెలిపారు. గిరిజన గామాల్లో మలేరియా జ్వరాలు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా ప్రతి వ్యక్తికి మూడు రోజులకు సరిపడా మందులను పంపిణీ చేశారు. అలాగే వృద్ధులకు బీపీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు అనంతగిరి మండలం గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్యశిబిరంలో సింహాచలం, యలమంచిలి, ఎ.కోడూరు ఆయుష్ వైద్యులు అరుణ్‌ప్రకాష్, శ్రీదేవి, కె.కళావతి, జి.తమ్మునాయుడు, పైడిరాజు, గంగవరం ప్రధానోపాధ్యాయిని చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

9న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి

కె.కోటపాడు: ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రూ.65వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.రాజు డిమాండ్ చేశారు. ఈ నెల 9న వ్యవసాయ కార్మిక సమస్యలపై నిర్వహించనున్న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టాన్ని ప్రభుత్వం పరిరక్షించాలని, ప్రతి కూలీకి రోజుకు రూ.300లు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు గోగాడ చింతాలు, ఎర్రా దేముడు, ఈర్లె నాయుడు బాబు, యు.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నీటి వనరుల పరిసరాలను శుభ్రపర్చాలి : ఎంపీడీవో

చీడికాడ: మంచినీటి వనరుల వద్ద ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయించాలని సంబంధిత సిబ్బందికి ఎంపీడీవో ఆర్.ఎం.గ్లాడ్సు ఆదేశించారు. మండలంలోని దండిసురవరం గ్రగామంలో శనివారం మన గ్రామం మన విశాఖ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న పారిశుధ్యాన్ని తొలగించి మంచినీటి ట్యాంకులు, బోర్లు వద్ద ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు ప్రక్కన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేపాడ నాగేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, ఏఈలు పి.కనకమ్మ, ఎస్‌వి.రమణమూర్తి, పశువైద్యాధికారి కె.భాస్కరరావు, ఏపీవో మురళీకృష్ణ, ఏపీఎం అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి రాణం రాము తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	దర్శకుడు
శ్రీసాయిలక్ష్మి	గౌతమ్‌నంద
సాయిలక్ష్మి(ఏసీ)	ఫిదా
పూర్ణ	నక్షత్రం

చెక్‌డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన



చెక్‌డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రామకృష్ణ, తదితరులు

రావికమతం: సాగునీటి వనరుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ దంగేటి రామకృష్ణ అన్నారు. మండలంలోని తట్టబందలో రూ.46లక్షలతో రెండు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ గొర్లెగెడ్డ, పెద్దగెడ్డలపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం వల్ల 300 ఎకరాలకు నిరాటంకంగా సాగునీరు అందుతుందన్నారు. సుకుమారమ్మ గెడ్డ, ఊరకొండల ద్వారా వర్షపునీరు వృథాగా నీరు పోతోందని, ఇక్కడ చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ రాము, రమణ, సింబోతు నాయుడు తమ దృష్టికి తెచ్చారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ఆయన నిధులు మంజూరు చేశారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, నాయకులు పరిశం రమణ, సింబోతు నాయుడు, ఉగ్గిన నర్సయ్యానాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బంటు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన



అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమాంతాలు చేస్తున్న దృశ్యం

రోలుగుంట: తల్లిపాలు పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని స్తాయని అడ్డసరం గ్రామ సర్పంచ్ సుందరపు అప్పారావు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం దిబ్బలపాలెంలో గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలను ఇవ్వడంతో పాటు తల్లికి మంచి పౌషకాహారం కూడా ఇవ్వాలని తెలిపారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలను తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో దిబ్బలపాలెం, కె.అడ్డసరం, కె,కొత్తురు అంగన్వాడీ కార్యకర్తలు కె.చంద్రవేణి, రాజేశ్వరి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పద్మకు ఏయూ డాక్టరేట్



చోడవరం టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్రం బోధిస్తున్న బి.పద్మకు ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, వైస్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ ఆడారి అర్జున అప్పారావు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు : ఎమ్మెల్యే

చోడవరం: నియోజకవర్గ కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకూ సొంత భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. శనివారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయ భవన సముదాయాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ చోడవరంలో శిధిల భవనాల్లో ఉన్న తహసీల్దార్ కార్యాలయాలకు 55లక్షల రూపాయల వ్యయంతో భవనాలు నిర్మిస్తున్నామని, ఈ భవనాలకు అదనంగా మరో రూ.కోటి 25లక్షలతో భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి అందుబాటులోనికి తెస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ జీఎస్‌వీ ప్రసాద్, మండల ఇంజినీరు కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ భవనాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

మా భూముల్లో పైపులైన్ నిర్మాణం తగదు



ఆందోళన చేస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట : తమ భూముల నుంచి ఎత్తిపోతల పథకం పైపులైన్ నిర్మాణ పనులను అంగీకరించేది లేదని రైతులు శనివారం ఎల్‌బీపీ.అ గ్రహారం బీసీ కాలనీలో ఆందోళన చేశారు. తమ భూముల్లో పైపులైన్ వేస్తే తమ పంటలకు నష్టం వాటిల్లితుందని రైతులు తమరాన దేముడు, పినబోయిన అప్పారావు, పల్లా వెంకటరమణ, లంకా వరహాలు తదితరులు పేర్కొన్నారు. తమ భూముల్లో పంటలను, మొక్కలను తమ అంగీకారం లేకుండా తొలగించి దౌర్జన్యంగా పైపులైన్ నిర్మాణం పనులు చేయడాన్ని వారు వ్యతిరేకించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

మన గ్రామం-మన విశాఖలో గ్రామస్థుల డిమాండ్

బుచ్చెయ్యపేట : తమ గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మండలం లోని ఆర్.భీమవరం గ్రామస్థులు అధికారు లను డిమాండ్ చేశారు. మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో పలువురు మాట్లాడుతూ గ్రామంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలని, పెరిగిన విద్యుత్ వినియోగానికి అనుగుణంగా అదనంగా డీపీ వేయాలని కోరారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కొండలరావు తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రంలో అమృత హస్తం పథకం అమలు తీరును పరిశీలించారు. ఎంఈవో కెఏ.సత్యనారాయణ, ఏపీవో అప్పలరాజు, ఏఈఈలు సుబ్బలక్ష్మి, జగన్నాథం, శ్రీపాటిచ ఐకేపీ ఏపీఎం కనక రాజు తదితరులు పాల్గొన్నారు.

బెన్నవోలులో పోస్టల్ సేవలు

చోడవరం: మండలంలోని ఏటవతల గ్రామంగా పిలవబడే బెన్నవోలులో శనివారం పోస్టాఫీసు సేవలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకూ జన్నవరం పంచాయతీ పోస్టాఫీసు పరిధిలో ఉండే బెన్నవోలు పంచాయతీ శనివారం నుంచీ సొంతంగా పోస్టాఫీసు కేంద్రంగా ఏర్పాటైంది. పోస్టల్‌శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో శనివారం బెన్నవోలులో పోస్టాఫీసును స్థానిక సర్పంచ్ మజ్జి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్ మాట్లాడుతూ, బెన్నవోలులో పోస్టాఫీసు లేకపోవడం వల్ల ఉపాధి కూలీల వేతనాలు, ఇతర అవసరాల కోసం జన్నవరం వెళ్లాల్సి వచ్చేదని, ఎమ్మెల్యే రాజు కృషి వల్ల బెన్నవోలులో పోస్టాఫీసు ఏర్పాటు కావడం



ముదావహమని అన్నారు. సబ్ డివిజన్ పోస్టల్ అధికారి కె.సత్యనారాయణ, అధికారి కె.భవానీ, ఎంపీటీసీ సభ్యురాలు కంచిపాటి సోములమ్మ, ఉపసర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గోవాడలో ఘనంగా పవిత్రోత్సవాలు

చోడవరం రూరల్: మండలంలోని గోవాడ షుగర్స్ ఆవరణలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్యుంజయహోమం, అంకురారోపణ, యాగశాల ప్రవేశం, మండప ఆవాహన, మంగళాశాసనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సింహాచలం దేవస్థానం విశ్రాంత ప్రధాన పురోహితుడు మోర్తా సీతారామాచార్యులు, విశాఖ పోర్టు దేవాలయం ప్రధాన అర్చకుడు కోయిల్‌కందాడై శ్రీనివాస జగన్నాథాచార్యులు,



పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్న అర్చకులు

ఆలయ ప్రధాన అర్చకుడు జీటీ ఆచార్యులు పవిత్రోత్సవాలను ప్రారంభించారు.

సమాధానాలు చెప్పలేకే టీడీపీ ఎదురు దాడి

మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం టౌన్: నంద్యాల ఎన్నికల ప్రసంగంలో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి సంధించిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేసేందుకే తెలుగుదేశం పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎదురుదాడి చేస్తున్నారని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ విమర్శించారు.

ఇక్కడి పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ మాటలకు ముందు, వెనుక ఉన్న పదాలను తొలగించి ఆయన మాటలను టీడీపీ నేతలు వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, దీనికి ఆ పార్టీ నాయకులు, మీడియా ప్రతినిధులు వంత పాడుతూ రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. హత్యా రాజకీయాలు చంద్రబాబునాయుడుకు వెన్నతోపెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. హామీలతో ప్రజలను మభ్యపెట్టడం కాదని, చేతనైతే జగన్ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అన్నారు. వైసీపీ నాయకులు అప్పికొండ లింగబాబు, బొడ్డేడ సూర్యనారాయణ, మారిశెట్టి శ్రీకాంత్‌పాల్గొన్నారు.



దేవాలయాల మూసివేత రేపు

చోడవరం టౌన్: చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 7న అనంతరం సాయంత్రం 6గంటలకు పట్టణంలోని అన్ని దేవాలయాలనూ మూసివేసి 8న సంప్రోక్షణ అనంతరం ఉదయం 7 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తామని విఘ్నేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు కొడమంచిలి గణేష్, చోడవరం అర్చక బృందం ప్రతినిధులు శనివారం తెలిపారు. గ్రహణం రాత్రి 10.52 గంటల నుంచి రాత్రి 12.49 గంటల వరకూ ఉంటుందని, శ్రవణ నక్షత్ర జాతకులు మకరరాశి ారు గ్రహణం చూడరాదని, వారు మంగళవారం ఉదయం గ్రహణశాంతి చేసుకోవాలని సూచించారు.

రుణాలపై 8న అవగాహన సదస్సు

బుచ్చెయ్యపేట : 2017-18 ఆర్థిక సంవత్సరానికి స్వయం ఉపాధి పథకం కింద దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల 8న అ వగాహన సదస్సు నిర్వహించనున్నామని ఎంపీడీవో కొండలరావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరగనున్న ఈ సదస్సులో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు లబ్ధిదారుల ఎంపికలో బ్యాంకులు నిర్వహించే పాత్రపై అవగాహన కల్పిస్తారన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభంతో రైతుల్లో భయాందోళనలు



రోలుగుంట : పొలాల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతుండ డంతో రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం రోలుగుంట నుంచి కొవ్వూరు గ్రామానికి విద్యుత్ లైన్ వేశారు. వాటిలో కొన్ని స్తంభాలను రైతుల పొలాల మధ్య వేశారు. వాటిలో కొన్ని ఓ పక్కకు ఒరిగి పోయి వైర్లు వేలాడుతున్నాయి. దీంతో ఏ క్షణంలోనైనా అవి కూలిపోయి విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదం సంభవించవచ్చన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవ ుతోంది. భూములను దున్నాలంటే ఈ స్తంభాలు ఎప్పుడు మీదన పడతాయోనని భయపడుతున్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని రైతులు కొట్టె నాయుడు, కొట్టె రవ ుణ, కొట్టె అప్పలనాయుడు. యర్రంశెట్టి సత్యనారాయణ, ముసిలినాయుడు, గోర్లె తాతీలు, ఈశ్వరరావు తెలిపారు.

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

శ్రీకన్య - ఫిదా
కన్య - దర్శకుడు
కన్యమినీ - వశం
సాయిశ్రీకన్య - ఇదేమి! దెయ్యం
రాజుమూవీమ్యాక్స్ - నక్షత్రం
బంగార్రాజు - గౌతమ్‌నందా

- నర్సీపట్నంలో ప్రారంభం కాని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- కొన్నిచోట్ల స్థలాల కొరత
- మరికొన్నిచోట్ల అధికారుల నిర్లక్ష్యం
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్

చెత్త‘శుద్ధి’ లేదు!


వేములపూడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి కేటాయించిన స్థలం

నర్సీపట్నం టౌన్ : మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల (ఘన వ్యర్థాల నిర్వహణ) నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఈ విషయమై ఇటీవల జిల్లా అధికారుల నుంచిమండల పరిషత్ అధికారులకు మెమోలు కూడా జారీ అయ్యాయి. అయినా పనుల్లో ఎలాంటి కదలిక లేదు. తొమ్మిది పంచాయతీలున్న మండలంలో మొదట విడతగా నాలుగు పంచాయతీల్లో వీటిని నిర్మించాలని ప్రతిపాదించారు. రెండేళ్లయినా పనులు ప్రారంభం కాలేదు. సుమారు 12 వేల జనాభా ఉన్న వేములపూడి మేజర్ పంచాయతీలో ఈ కేంద్రం నిర్మాణానికి వారపు సంత సమీపంలో చెరువు పక్కన 25 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఇదిలోతట్టుగా ఉండడంతో నిర్మాణానికి పనికిరాదని పంచాయతీరాజ్ అధికారులు స్పష్టం చేయడంతో పనులు ప్రారంభం కాలేదు. నీరు-చెట్టు పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో ఈ పంచాయతీలో చెరువుల్లో తీసిన పూడికమట్టితో లోతట్టు ప్రాంతాన్ని ఎత్తు చేశారు. మట్టి సర్దుకునే వరకు నిర్మాణానికి వీలు కాదని అధి కారులు పేర్కొన్నారు. కనీసం ఈ ఏడాది డిసెంబర్ వరకు ఆగాల్సిందేనని అంటున్నారు. దీంతో గ్రామంలో ఊడ్చిన చెత్తనంతా యరకన్నపాలెం వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన వేస్తున్నారు. అక్కడే మంట పెడుతున్నారు.ఉప్పరగూడెం వెళ్లే మార్గంలోనూ, ఎస్సీకాలనీ వద్ద కూడా చెత్త పోస్తున్నారు. ఆదర్శ పంచాయతీగా పురస్కారం అందుకున్న ధర్మసాగరంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ కూడా 25 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఇందుకోసం విద్యుత్, నీటి సదుపాయం లేకపోవడంతో పనులు మొదలు కాలేదని అధికారులు అంటున్నారు. చెట్టుపల్లిలో 16 సెంట్లు, గబ్బాడలో పది సెంట్లు స్థలాలు కేటాయించినప్పటికీ గోతులు తీసి వదిలేశారు. ఇకపోతే యరకన్నపాలెంలో ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలంలో కొంత స్థలం ఇవ్వాలని సర్పంచ్ కోరినప్పటికీ అది ఇంకా కార్యరూపం దాల్చలేదు. గురందొరపాలెం, అమలాపురం, ఒ.ఎల్.పురం, నీలంపేట తదితర పంచాయతీల్లో ఇప్పటికీ ఇంకా స్థలాల కేటాయింపే జరగలేదు. దీంతో ఆయా పంచాయతీల్లో చెత్తనంతటిని ఊరికి అవతల ఉన్న రోడ్డుపక్కన పోస్తున్నారు. ఫలితంగా దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

త్వరలోనే ఏర్పాటు చేస్తాం



ఘన,వ్యర్థాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే వేములపూడిలోమట్టి వేయించాం. డిసెంబర్‌లో పనులు ప్రారంభిస్తాం. కొన్ని పంచాయతీల్లో స్థల సమస్య ఉంటే, మరికొన్ని పంచాయతీల్లో అందుకు తగిన నీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం లేకపోవడంతో పనులు ప్రారంభించలేకపోతున్నాం.దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేసాం. త్వరలోనే సమస్య పరిష్కరించి సాలీడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ పార్కుల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలి.

రమణబాబు, ఎంపీడీవో

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


పిల్లలకు పుస్తకాలు అందజేస్తున్న కొప్పర్తి రామారావు

నర్సీపట్నంటౌన్ : పట్టణంలోని వెంకునాయుడుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కొప్పర్తిరామారావు ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత రామారావు శనివారం నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి పదేసి చొప్పున పుస్తకాలు, పలకలు, పెన్నులు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవడమే తమ ట్రస్ట్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి. గోపీనాథ్, ఉపాధ్యాయిని ఆర్.సునీత, కౌన్సిలర్ డి. రాంబాబు, విద్యా కమిటీ ఛైర్మన్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

‘భోజన’ంలో నాణ్యత ఉండాలి


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం : పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో ఉదయశ్రీ నిర్వాహకులకు సూచించారు. శనివారం గిడుతూరులో జరిగిన మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముందుగా ప్రభుత్వ పాఠశాల, రేషన్ డిపోను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. డిజిటల్ తరగతులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం జరిగిన గ్రామసభలో వ్యవసాయ కూలీలకు డిమాండ్ ఉన్నందున పది రోజుల పాటు ఉపాధి కూలీ పనులు నిలిపివేయాలని సర్పంచ్ చినబాబు అధికారులను కోరగా అందుకు అంగీకరించలేదు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె. రమామణి, డీటీ కె. ప్రసాద్‌రావు, ఈవోపీఆర్‌డీ సత్యనారామయణ, తదితరులుపాల్గొన్నారు.

రైతులకు తక్కువ అద్దెకు ట్రాక్టర్లు

నర్సీపట్నం: సన్న, చిన్నకారు రైతుల ఉపయోగార్థం ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ రెండు ట్రాక్టర్‌లు సిద్ధం చేసింది. నాతవరంలోని చెర్లోపాలెం పరిసర గ్రామాల రైతులు తమ పొలాల్లో దుక్కులు, దుమ్ము, కుప్ప నూర్పిడులు తదితర వ్యవసాయ పనులకు కూలీలు దొరక్క అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు ట్రాక్టర్‌లు భారీగా అద్దె వసూలు చేస్తుండడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.ఈనేపథ్యంలో అమెరికాలో ఉంటున్న చెర్లోపాలేనికి చెందిన వ్యాపారవేత్త లెక్కల వెంకటేశ్వరరావు తన ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ద్వారా రెండు ట్రాక్టర్‌లు కొనుగోలు చేసి రైతుల అవసరార్థం ఆ గ్రామంలో ఉంచారు. వీటిని రైతులు తమ పొలం పనులకు వినియోగించుకోవచ్చునని, దుక్కులు, దుమ్ము, వరి నూర్పిడులు వంటి పనులకు బయట మార్కెట్‌లో వసూలు చేసే ధరలో 30 శాతం తగ్గించి తీసుకుంటామని ఆయన తెలిపారు. వీటి సేవలను ఆదివారం లాంఛనంగా చెర్లోపాలెం గ్రామంలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

నర్సీపట్నం రూరల్ : ఉద్యోగమైనా ఇవ్వాలని లేదా నిరుద్యోగ భృతి అయినా చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. శనివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులు, విద్యార్థులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసగిస్తే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటల గారడీతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. కమలనాథన్ కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో లక్షా 42 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వయో పరిమితి పెంపు గడువు గత నెలతో ముగియడంతో ఈ ఏడాది పదవీ విరమణ చేస్తున్నవారు 35 వేలకు పైగా ఉన్నారన్నారు.ఏపీపీఎస్సీ ద్వారా 20,250 పోస్టులు భర్తీ చేస్తామని 2016 ఫిబ్రవరిలో ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటి భర్తీకి నోటిఫికేషన్‌లు ఇవ్వలేదన్నారు. తక్షణమే ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతిని అమలు చేయాలన్నారు. అనంతరం ఆర్డీవో సూర్యారావుకి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు కె. సోమునాయుడు, ఆర్.ఎ.నాయుడు, నూకరాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నర్సీపట్నం రూరల్ : డివిజన్‌లోని పలు సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడతూ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని, సన్న బియ్యం సరఫరా చేయాలని, నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, మెస్ చార్జీలు ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని, హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంత లో ఆర్డీవో సూర్యారావు బయటకు వచ్చి తన పరిధిలోని సమస్యలు పరిష్కరించగలనని, మిగిలిన సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. దీంతో యూనియన్ నాయకులకు, ఆర్డీవోకు మధ్య స్వల్ప వాగ్వావాదం జరిగింది. ఈ నేపథ్యంలో పట్టణ సీఐ సింహాద్రినాయుడు కలుగజేసుకుని సర్ది చెప్పడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కో-కన్వీనర్ సతీష్, పట్టణ కార్యదర్శి సాయి, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న హాస్టల్ విద్యార్థులు

చురుగ్గా చెత్తశుద్ధి కేంద్రం పనులు

గొలుగొండ:మండలంలోని పాకలపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద రూ.4 లక్షల మంజూరు చేసింది. వీటితో ప్రస్తుతం కేంద్రం షెడ్ నిర్మాణం చురుగ్గా జరుగుతోంది.


పాకలపాడులో జరుగుతున్న షెడ్ నిర్మాణ పనులు

బూరుగుపాలెం మాజీ సర్పంచ్ మృతి



మాకవరపాలెం: బూరుగుపాలెం మాజీ సర్పంచ్, మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి మేనమామ పోతల సన్యాసినాయుడు (నాయుడబ్బాయి) శుక్రవారం సాయంత్రం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ అవిర్భావం నుంచి పార్టీకి ఎనలేని కృషి చేశారు. బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడిగా, సర్పంచ్‌గా, టీడీపీ మండల ప్రధానకార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం సాగునీటి సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా ఉన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. సీనియర్ నాయకుడిగా, మంత్రిఅయ్యన్న బంధువుగా గుర్తింపు పొందారు. ఆయన అంత్యక్రియల్లో అయ్యన్న సతీమణి పద్మావతి, నర్సీపట్నం మున్సిపల్ ఛైరపర్సన్ చింతకాయల అనిత, మంత్రి తమ్ముడు జేమీలు,నర్సీపట్నం ఎంపీపీ రమణమ్మ, మండల బీజేపీ నాయకులు రుత్తల ఎర్రాపాత్రుడు, ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు రుత్తల శేషుకుమార్, తామరం సొసైటీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు, తహసీల్దార్ కె. రమామణి, ఎంపీడీవో ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	:	08854 254044
ఎంపీడీవో కార్యాలయం	:	9441953611
తహసీల్దార్ కార్యాలయం	:	9441836336
వెలుగు ఏపీఎం	:	9866074067

సినిమా గైడ్

గౌతమ్ : నిన్ను కోరి
సూర్యమహల్ : వాసుకి
సాయిమహల్ : గౌతమ్‌నంద
లక్ష్మి (ఏసీ) : ఫిదా

ఖరీఫ్‌కు కూలీల కొరత



ఆరుగురు కూలీలతో నాట్లు వేయిస్తున్న దృశ్యం

- ఉన్న కూలీలతో సర్దుకుపోతున్న రైతులు
- ఉపాధి పనుల ప్రభావం

పాయకరావుపేట : మండలంలో గత కొంత కాలంగా వ్యవసాయ పనులకు కూలీల సమస్య వెంటాడుతోంది. ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతాంగానికి కూలీలు దొరకడం లేదు. మండలంలో ఏటా సుమారు మూడు వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. గత పదేళ్లగా మండలంలో పనులు దొరక్క ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు కూలీలు వలసబాట పట్టారు. అలాగే ఉపాధి పనులకు కొందరు వెళతున్నారు. దీంతో వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో సైతం కూలీలు దొరక్కపోవడంతో ఇతర ప్రాంతాల కూలీలను తీసుకొచ్చి పనులు చేయించుకుంటున్నారు. దీనివల్ల వ్యవసాయంలో పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది నీటి సదుపాయం ఉన్న చోట మాత్రమే వరి నాట్లు వేస్తున్నారు. ఐదు ఎకరాల ఉన్న రైతు సుమారు 20 మంది కూలీలతో నాట్లు వేయించాల్సి ఉన్నా ప్రస్తుతం ఆరుగురికి మించి దొరికే పరిస్థితి లేకపోవడంతో సర్దుకుపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే తాండవ నీరు విడుదలైతే పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూలీలు దొరకడం లేదు



వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదు. ఉపాధి హామీ పనులకు అలవాటుపడిన కూలీలు వ్యవసాయ పనులకు వచ్చేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. కూలీలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావడం వల్ల పెట్టుబడులు పెరుగుతున్నాయి.

కలిగట్ల మూలా స్వామి,
పెదరాంభద్రపురం

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కోటవురట్ల: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం శ్రేష్ఠమని ఐసీడీఎస్ పూడి సెక్టార్ సూపర్‌వైజర్ రాఘవ అన్నారు. శనివారం స్థానిక కె.వెంకటాపురం సెక్టారులో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కె.వెంకటాపురం సెక్టారు పరిధిలో కొడవటిపూడి, కె.వెంకటాపురం, తంగేడు, లింగాపురం, తిమ్మాపురం, జగ్గంపేట, తడపర్తి గ్రామాల్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.వెంటాపురం సర్పంచ్ కాళ్ల శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.సత్యవతి, వి.రమణమ్మ, కె.భాస్కర్, కె.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి నివారించాలి

కేశవరం గ్రామ మహిళల వినతి

పాయకరావుపేట : పాయకరావుపేట మండలం కేశవరం గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని ఆ గ్రామ మహిళలు ఎంపీడీఓ సాంబశివరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వున్న పంచాయతీ కొళాయి కనెక్షన్ల నుంచి కొందరు వ్యక్తులు హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేసుకున్నారని, దీనివల్ల కొళాయిల ద్వారా నీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిందెడు నీటి కోసం నరకయాతన పడుతున్నామని వాపోయారు. పలుమార్లు పంచాయతీ సర్పంచ్, కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.లక్ష్మీకుమారి, ఎం.వెంకటలక్ష్మి, కె.గౌరీదేవి, ఎం.ఉమామహేశ్వరి, ఎం.వీరబాబు,అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానాలు లేకుండా పనులు

- ఎంపీపీ శివకుమార్ ఆరోపణ
- ఉపాధి పనులపై ప్రజావేదిక
- ఉద్యోగుల తీరుపై ఏపీడీ ఆనందరావు ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ శివకుమార్

పాయకరావుపేట : ఉపాధి పనులు చేపట్టేటప్పుడు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని, పంచాయతీ తీర్మానాలు లేకుండా పనులు చేస్తున్నారని ఎంపీపీ అల్లాడ శివకుమార్ అన్నారు. ఈ ఏడాది మార్చి 31 వరకూ మండలంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదికను ఏర్పాటు చేశారు. గ్రామాల వారీగా చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ అల్లాడ శివకుమార్ మాట్లాడుతూ ఏ పనులు చేస్తున్నారో ప్రజాప్రతినిధులకు కూడా తెలియడం లేదన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభల్లో సర్పంచ్‌లు లేకుండా తీర్మానాలు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. పాల్తేరు, పెదరాంభద్రపురం, అరట్లకోట, పెంటకోట, గ్రామాల సర్పంచ్‌లు కూడా తమను పట్టించుకోవడం లేదని, గ్రామాల్లో ఏ పనులు చేస్తున్నారో తెలియడం లేదన్నారు. పెంటకోటలో మూడేళ్ల నుంచి చేపలు ఎండబెట్టేందుకు ప్లాట్‌ఫారాలు నిర్మించాలని చెప్పినా, నిధులు మంజూరైనా పనులు మొదలు పెట్టలేదని టీడీపీ నాయకుడు చిక్కాల శ్రీను అన్నారు. ఈ అంశాలపై అడిషనల్ పీడీ ఆనందరావు స్పందించారు. ఉపాధి హామీ పథకం ఉద్యోగుల పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీల్లో భాగంగా కూలీలకు గునపాలు అందకపోవడం, ఒకచోట చేయాల్సిన పనులను మరోచోట చేయడం, పనులు పూర్తికాకుండా పేమెంట్లు చేయడం తదితర లోపాలను తనిఖీల్లో గుర్తించారు. దీనిపై స్పందించి అడిషనల్ పీడీ ఆనందరావు సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేస్తామని చెప్పారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట : మండలంలోని రాజవరం గ్రామంలో రూ.2 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను శనివారం ఈఓపీఆర్‌డీ వెంకటనారాయణ పరిశీలించారు. ఈ పనులు జరుగుతున్న తీరుపై సర్పంచ్ కె.సత్యవతితో చర్చించారు. గ్రామంలో ప్రజలందరికీ తడి,పొడి చెత్తను వేరు చేయడం, తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఘన, వ్యర్థాల నిర్వాహణ ప్లాంట్ వల్ల కలిగే ఉపయోగాలను వివరించాలని సూచించారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ



బూట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వినోద్‌రాజు

ఎస్.రాయవరం(నక్కపల్లి) : ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బూట్లును జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం పంపిణీ చేశారు. వీటిని విద్యార్థులకు ఎంపీపీ వినోద్‌రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సర్పంచ్ వియ్యపు సూర్యకుమారి, టీడీపీ సీనియర్ నాయకులు అల్లు నర్సింహమూర్తి, కోన అప్పలరాజు, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధి కె.వెంకటరమణ, ఎంఈవో మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పందూరు గెడ్డలో నిలిచిన మురుగు

- గెడ్డలో పెరిగిన తుప్పలు
- విజృంభిస్తున్న దోమలు



గెడ్డలో నిలిచిన నీరు

కోటవురట్ల: మండలంలో పందూరు గ్రామంలో ఉన్న గెడ్డలో నిలిచిన మురుగునీటి వల్ల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ఆ గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు పడినప్పుడు గెడ్డలో నీటి ఉధృతి వల్ల ఇళ్ల స్థలాలు కోతకు గురవుతున్నాయని గురించి సర్పంచ్ నారాయణరావు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించారు. గెడ్డలో తుప్పలు పెరిగిపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండిపోతుంది. గెడ్డ ఎత్తు పల్లాలతో ఉండటంతో వర్షపునీరు, వాడుక నీరు నిలిచిపోతుంది. గెడ్డలో చెత్తచెదారం పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. వీటివల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కొందరు గెడ్డలోనే చెత్తాచెదారం వేస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెడ్డలో పూడికతీత చేపట్టాలని, గ్రామంలో పారిశుధ్యపనులు నిర్వహించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.



గెడ్డలో పెరిగిన పిచ్చి మొక్కలు

రైతుల్లో వానందం

- మూడు మండలాల్లో భారీ వర్షం
- ఏకధాటి రెండు గంటల పాటు కురిసిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొలాల్లో చేరిన నీరు
- వరినారుమళ్లకు ఊరట


అప్పన్నపాలెం వద్ద పడుతున్న వర్షం


పూడిమడకలోని లోతట్టు ప్రాంతాల్లో చేరిన నీరు


అప్పన్నపాలెం కాలనీలో వర్షం నీరు

ఎలమంచిలి/రాంబిల్లి/అచ్యుతాపురం : నియోజకవర్గంలోని ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో శనివారం భారీ వర్షం పడింది. సాయంత్రం 4 గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై రెండు గంటలపాటు ఏకధాటి వాన కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. వరి నారుమళ్లకు ఈ వర్షం ఎంతోమేలు చేస్తుందని సంబరపడుతున్నారు. రాంబిల్లిలో ఈదురుగాలులు,ఉరుములతో వర్షం పడడంతో ప్రజలు భయపడ్డారు. గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లు జలమయమ య్యాయి. కాగా వారం రోజులుగా ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు వర్షంతో కొంత ఉపశమనం పొందారు. అలాగే పూడిమడకలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షం కురిసింది. సాయంత్రంమూడున్నర నుంచి సముద్ర తీరం నుంచి సుమారు మూడు కిలో మీటర్ల పరిధిలో మాత్రమే వర్షం కురిసింది. దీంతో పూడిమడకలోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కడపాలెం, కొండ పాలెంలో కమ్మల పాకల చుట్టూ నీరు చేరింది.


మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

వెదురువాడ కాలనీ అభివృద్ధి సమావేశం వాయిదా

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని వెదురువాడలో నూతనంగా కాలనీ నిర్మించడానికి ఏర్పాటు చేసిన గ్రామసభ సోమవారానికి వాయిదా పడింది. వెదురువాడ పరిధిలో సర్వే నెంబరు 1లో ఉన్న 75 ఎకరాల డిఫారం భూములు తీసుకోడానికి అధికారులు లబ్ధిదారులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు తమకు ఇచ్చే నష్టపరిహారం విషయమై పూర్తిస్థాయిలో వివరణ కావాలని నిలదీశారు. దీనికితోడు లబ్ధిదారులు తక్కువ మంది రావడంతో సభను వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా గంటి పంట


అప్పారాయుడుపాలెంలో గింజ కట్టే దశలో ఉన్న పంట

రాంబిల్లి : మండలంలోని రాజుకోడూరు, అప్పారాయుడుపాలెం,ఆర్.నర్సాపురం, వెంకటాపురం, హరిపురం, పంచదార్ల, వెంకటాపురం గ్రామాల్లోని 200 ఎకరాల్లో వేసిన గంటి పంట ఆశాజనకంగా ఉంది. రెండు వారాలుగా అడపాదడపా పడుతున్న వర్షాలకు పంట ఆశాజనకంగా ఉంది. గంటి గింజ కడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ ఇళ్లు : తహసీల్దార్

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికి గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని తహసీల్దార్ జి. రాంబాబు తెలిపారు. శనివారం గణపర్తిలో సర్పంచ్ కర్రి జయలక్ష్మి, అరబుపాలెంలో సర్పంచ్ లంబా అప్పారావుఅధ్యక్షతన జరిగిన హౌసింగ్ గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సర్వే చేసి గృహ నిర్మాణ పథకానికి అర్హులైన వారి జాబితా తయారు చేస్తామని, ఈ మేరకు అర్హులైన వారు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మారిశెట్టి కనకరామలక్ష్మి, సాగునీటి సంఘం అధ్యక్షుడు కర్రి రామనాగేశ్వరరావు, మారిశెట్టి వెంకటరమణ, జన్మభూమి కమిటీ సభ్యులు శంకర్, పాల్గొన్నారు.


గణపర్తిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాబు

పారిశుధ్యం మెరుగుకు సహకరించండి

మునగపాక : ఎవరో వచ్చి పరిసరాలు శుభ్రం చేస్తారని చూడకుండా ఎవరింటి వద్ద పరిసరాలను వారే శుభ్రం చేసుకునే విధంగా బాధ్యత తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఆయన గణపర్తి పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల సీజన్ కావడంతో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు.అనంతరం ఆయన వివాదాస్పదమైన కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీవో శాంతలక్ష్మి, సాగునీటి సంఘం అధ్యక్షుడు కర్రి రామనాగేశ్వరరావు, మారిశెట్టి వెంకటరమణ, శంకర్, పాల సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు


భాగ్యలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రిటైర్డ్ ఉపాధ్యాయినికి సన్మానం

అచ్యుతాపురం : గురువుల చేతిలోనే విద్యార్థుల భవిత ఉంటుందని ఎంపీడీఓ బలరాం అన్నారు. శనివారం దిబ్బపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేసి పదవీ విరమణ పొందిన రుద్రాక్షల భాగ్యలక్ష్మి దంపతులను సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులను పిల్లలు జీవితాంతం గుర్తించుకుంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవరాయల్, గ్రామ సర్పంచ్ బైలపూడి భవానీ, స్కూల్ కమిటీ చైర్మన్ నాగరాజు, హెచ్ఎం బి. సువర్ణలత, తదితరలు పాల్గొన్నారు.


బ్రాండిక్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ సృజన

బ్రాండిక్స్‌ని సందర్శించిన జేసీ

అచుతాపురం : సెజ్‌లోని బ్రాండిక్స్ కర్మాగారం రాష్ట్రానికే తలమానికమని జేసీ సృజన అన్నారు. శనివారం ఆమె బ్రాండిక్స్ కర్మాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కర్మాగారంలో సుమారు 18 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించడం సామాన్య విషయం కాదన్నారు. ఇక్కడ తయారవుతున్న దుస్తులకు అంతర్జాతీయ గుర్తింపు రావడం అభినందనీయమన్నారు.అనంతరం ఆమె కర్మాగారం పరిసరాలను పరిశీలించారు.మహిళలు దుస్తులు ఏ విధంగా తయారు చేస్తున్నారు. ఎంతమంది పని చేస్తున్నారన్న వివరాలను బ్రాండిక్స్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మహిళా కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

అచ్యుతాపురం రూరల్ : వెదురువాడలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శనివారం ప్రారంభోత్సవం చేశారు. రూ.పది లక్షల ఉపాధి నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, జెడ్‌పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ ధూళి రంగనాయకులు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు రాజాన రమేష్‌కుమార్, సర్పంచ్ గొర్లె లోవకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై 55 మంది ఎస్‌జీటీలు

రాంబిల్లి : మండలానికి 55 మంది ఎస్‌జీటీలు బదిలీపై వచ్చారని ఎంఈఓ ఎం. సూర్యారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఇందులో 51 మంది విధుల్లో చేరగా నలుగురు చేరాల్సి ఉందన్నారు. అలాగే 14 మంది స్కూల్ అసిస్టెంట్లు కూడా బదిలీపై వచ్చారని, అందరూ విధుల్లో చేరారని తెలిపారు.

దుకాణాల్లో రాఖీల సందడి


దుకాణాల్లో విక్రయిస్తున్న రాఖీలు

అచ్యుతాపురం : మండలంలోని పలు దుకాణాల్లో శనివారం రాఖీల సందడి నెలకొంది. అచ్యుతాపురంతో పాటు పూడిమడక, హరిపాలెం, సెజ్ పునరావాస కాలనీల్లో రకరకాల రాఖీలు విక్రయించారు. వ్యాపారులు పది రూపాయల నుంచి వెయ్యి రూపాయల వరకు ఖరీదైన రాఖీలను అందుబాటులో ఉంచారు.

10న మరిడిమాంబ పండుగ

గవరపాలెం : ఇక్కడి జేఎల్ స్కూల్ వద్ద ఉన్న మరిడిమాంబ పండగ ఈ నెల 10న జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఉత్సవ కమిటీ చైర్మన్ బీఎస్ఎంకే జోగినాయుడు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ కేఎం నాయుడు, కార్యదర్శి కాండ్రేగుల హరికిశోర్, కోశాధికారి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

నేడు వికలాంగులకు పరికరాల పంపిణీ

కొత్తూరు : అనకాపల్లిలోని వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం విభిన్న వికలాంగులకు ఉచితంగా పరికరాలు పంపిణీ చేయనున్నట్టు రిటైర్డ్ ఎస్ఐ గోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- నిన్నుకోరి
శ్రీసత్య - వశం
రాజా - గ్రీన్‌కార్డు
షిర్డీసాయి - దర్శకుడు
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : గౌతమ్‌నంద
శ్రీసత్యనారాయణ: నక్షత్రం

చెబుతూనే.. ఉన్నాం!

■ పరిష్కారం కాని సమస్యలపై నిలదీత ■ అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం ■ వాడి వేడిగా అనకాపల్లి మండల సమావేశం


సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీలా, వేదికపై ఎంపీపీ వెంకటసావిత్రి

అనకాపల్లి రూరల్ : అనకాపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం వాడి వేడిగా సాగింది. ఎంపీపీ కొణతాల వెంకటసావిత్రి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటైన ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమస్యల పరిష్కారంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ధ్వజమెత్తారు.

సభ్యులు ప్రధానంగా ప్రస్తావించిన సమస్యలు

ఈ ఏడాది నిర్వహించిన జన్మభూమి గ్రామ సభలకు సంబంధించి పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసినా ఇంతవరకు పంచాయతీల్లో ఎందుకు జమ చేయలేదని గోపాలపురం సర్పంచ్ గొర్లి సూరిబాబు ఎంపీడీవోను నిలదీశారు. నిధులు విడుదలై నాలుగు నెలలు కావస్తున్నా మీ వద్దే ఎందుకు ఉంచుకున్నారని ప్రశ్నించారు. నీరు-చెట్టులో భాగంగా మండలంలో చేపట్టిన పనులు పూర్తిచేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు ఎందుకు చెల్లించలేదని ఎంపీపీ సావిత్రి, పలువురు సభ్యులు ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావును నిలదీశారు. పనులు పూర్తి చేయడానికి నెల రోజులు, దానిని ఎం-బుక్స్‌లో నమోదుకు నెల రోజులు పడితే పూర్తయిన పనులకు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఆరు నెలలపైనే ఎందుకు పడుతోందన్నారు. ఈ


సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్లు ఇప్పించి త్వరలోనే బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని డీఈ హామీ ఇచ్చారు.

కొండుపాలెం సర్పంచ్ జిరాయితీ భూమికి చెరువు గట్టుపై గ్రావెల్ రోడ్డు వేయించారని, దీనికి అప్పటి ఇన్‌చార్జి తహసీల్దార్, ప్రస్తుత డీటీ శ్రీరామమూర్తి ఐదు లక్షల లంచం తీసుకున్నారని, దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఎంపీటీసీ శెట్టి వెంకటరమణ తహసీల్దార్ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఓటర్ల జాబితాలు సక్రమంగా లేవని, కొంతమంది వృద్ధులకు వేలిముద్రలు పడక రేషన్ అందడం లేదని గతంలో మాదిరిగా అన్ని సరుకులు వచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదించాలని పలువురు సభ్యులు తహసీల్దార్‌ను కోరారు. గత ఏడాది మండలంలో రైతులు ఫసల్ బీమా చెల్లించినా చాలామందికి వర్తించలేదని వ్యవసాయాధికారులను పలువురు ప్రశ్నించారు. ఇలాగైతే ఈ ఏడాది రైతులు బీమా ఎలా చెల్లిస్తారన్నారు. కోడూరు-గోపాలపురం రహదారి చాలా అధ్వానంగా ఉందని, ఈ మార్గంగుండా సుమారు వంద గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీటీసీ సేనాపతి శ్రీనివాసరావు వివరించారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని కోరారు.

తుమ్మపాల ప్రధాన రహదారి గోతులమయంగా ఉందని, దీనికి కనీసం మరమ్మతులు కూడా చేయరా అని ఆర్అండ్‌బీ అధికారులను ఎంపీపీ సహా పలువురు సభ్యులు నిలదీశారు. ప్రతిసారీ గ్రామాల్లో సమస్యలు చెప్పడమే తప్ప, అధికారుల్లో స్పందన ఉండడం లేదని సభ్యులంతా మండిపడ్డారు. అనంతరం మరిన్ని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పీవీ రమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పల్లెల గంగాభవానీ, వైస్ ఎంపీపీ గొర్లి అప్పలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయండి

అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే పీలా సూచన

మండలంలో ప్రారంభమైన పంచాయతీ భవనాలు, శ్మశానవాటికలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేయాలని సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అధికారులకు సూచించారు. అలాగే గ్రామాల్లోని అభివృద్ధి పనుల వేగవంతానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కూడా సహకరించాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధులకు ఎటువంటి కొరత లేదన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేస్తామని చెప్పారు.

'జమాదులపాలెం రైతులకు న్యాయం'

అనకాపల్లి రూరల్ : కశింకోట మండలం జమాదులపాలెం రైతులందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే పీలా తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొంతమంది ఈ విషయంపై కావాలనే రాద్ధాంతం చేస్తున్నారన్నారు. గత పాలకుల తప్పిదం వల్లే ఇక్కడి భూములు వక్ఫ్ బోర్డు భూములుగా నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాయల మురళీ, టీడీపీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, గొర్లి శ్రీను, పచ్చికోరు తదితరులు పాల్గొన్నారు.

తీడలో 'మన గ్రామం- మన విశాఖ'



కశింకోట రూరల్ : మండలంలోని తీడ గ్రామంలో శనివారం మన గ్రామం- మన విశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోఆర్‌డీ ధర్మారావు, ఏపీవో శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశరావు, సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



నెహ్రూచౌక్ : ఇక్కడి శారదా నదీ తీరాన ఉన్న ఉమా సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గల నవగ్రహ మండపంలో శనివారం శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. ప్రధాన అర్చకులు సాలిగ్రామ రఘుబాబు ఈ పూజలు జరిపించారు. దేవస్థానం చైర్మన్ జామి రామయ్య, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాళ్లపాలెంలో సామూహిక సీమంతాలు



కశింకోట రూరల్ : తాళ్లపాలెంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. పిల్లలకు అన్నప్రాసన చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.అమ్మాజీ, పి.ధనలక్ష్మి, జి.వరలక్ష్మి, సీహెచ్.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

273 మంది రైతులు వినతుల సమర్పణ



కశింకోట రూరల్ : ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం కూడా జమాదులపాలెం వివాదాస్పద భూములకు సంబంధించిన వినతులు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు 273 మంది రైతులు వీటిని అందజేశారు. ఆయా రైతులకు ఇందుకు సంబంధించి రశీదుల అందజేసినట్టు చెప్పారు.

వెంకయ్య విజయంపై సంబరాలు



కొత్తూరు : భారత ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఎన్నిక కావడం పట్ల బీజేపీ, టీడీపీ నాయకులు కొత్తూరులో శనివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ నాయకులు గంగుపాం నాగేశ్వరరావు, ఉడా రమేష్, బర్నికాన నర్సింహమూర్తి, ఆడారి రవి టీడీపీ నాయకులు గైపూరి వెంకటరమణ, వార్డు మెంబర్ వర్మ, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

బెల్లం వ్యాపారాభివృద్ధిలో వర్తకులు, కార్మికుల కృషి అమోఘం


యూనియన్ వజ్రోత్సవాల్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి

గవరపాలెం : బెల్లం వ్యాపారాభివృద్ధికి వర్తకులు, కార్మికులు నిరంతరం చేస్తున్న కృషి అమోఘమని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. ది అనకాపల్లి షాపు ఎంప్లాయీస్ యూనియన్ వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. కార్మికులంతా మరింత ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం గుమస్తాల సంఘం సీనియర్ సభ్యుడు పొలమరశెట్టి సూర్యనారాయణను సత్కరించారు. జాయింట్ లేబర్ కమిషనర్ ఎన్.ఎం.వరహాలరెడ్డి, సీఐటీయూ నాయకుడు సీహెచ్.నరసింగరావు, కార్మిక సంఘ అధ్యక్షుడు సూరిశెట్టి నూకరాజు, కార్యదర్శి శివ అప్పారావు, గుమస్తాల సంఘ అధ్యక్షుడు పెంటకోట త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీలు

కొత్తూరు : పిసినికాడ, రామభద్రాపురం, రామాపురం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతకు వివరిస్తూ అవగాహన ర్యాలీలు జరిపారు. పిసినికాడలో సర్పంచ్ దాడి కమలాదేవి మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచి తల్లిపాలను ఇవ్వడం వల్ల శారీర దృఢత్వం, మానసిక ఎదుగుదల ఉంటాయన్నారు. పంచాయతీ శివారు రామభద్రాపురం, కొత్తూరు పంచాయతీ శివారు రామాపురంలలో అవగాహ ర్యాలీ చేపట్టారు.

పాడేరులో విద్యుత్ సమస్యలకు చెల్లు



గుడివాడవీధిలో స్తంభం మార్చుతున్న ఎక్స్‌కవేటర్

పట్టణంలో పాత స్తంభాలు మార్పు

ఎక్కడికక్కడ కొత్తగా ఏర్పాటు

లో వోల్టేజీ తలెత్తకుండా చర్యలు

పాడేరు:
పట్టణ వాసులను వేధిస్తున్న విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టేందుకు సంబంధిత అధికారులు రంగంలోకి దిగారు. ప్రధానంగా లో వోల్టేజీ తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా చాలా ఏళ్ల క్రితం వేసిన స్తంభాలను తొలగించేస్తున్నారు. అంతే కాకుండా ఎక్కడికక్కడ కొత్త స్తంభాలను వేస్తున్నారు.

పట్టణంలో గుడివాడవీధి, మోదమాంబ కాలనీతో పాటు పలు వీధుల్లో ఉన్న పాత స్తంభాలను పూర్తిగా తొలగిస్తున్నారు. ఆయా స్తంభాల స్థానంలో పొడుగ్గా ఉన్న కొత్త స్తంభాలను వేస్తున్నారు. అలాగే ఎక్స్‌కవేటర్ సాయంతో స్తంభాలను మారుస్తుండడంతో పని శరవేగంగానే జరుగుతోంది. పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపేసి మరీ ఈ పనులనే చేపడుతున్నారు.

అలాగే గుడివాడ వీధిలో ఉన్న పాత ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు పడడంతో, ఆ ప్రాంతంలోని లైన్లను మార్చుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు పడకుండా, ఆ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య తీరేలా మొత్తం సరి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లోనూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకరరావు తెలిపారు.



పాత స్తంభం పక్కనే వేసిన కొత్త విద్యుత్ స్తంభం

అలాగే పట్టణంలో ఎక్కడైనా విద్యుత్ పరంగా ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా పోన్ నంబర్: 08935-250213కు సమాచారం అందించాలని సూచించారు. సమస్య పరిష్కారానికి తక్షణమే తగిన చర్యలు చేపడతామని ఆయన ప్రకటించారు.



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరి

బాలికలకు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

చింతపల్లి: గిరిజన బాలికలకు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సూచించారు. మండలంలోని లంబసింగి ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిది పూర్తి చేసుకుని పదిలోకి వచ్చిన 39 మంది విద్యార్థినులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత సైకిళ్లను శనివారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థినులు ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకుని పురుషులకు దీటుగా రాణించాలని సూచించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. బాలికలతో పాటు బాలురకు కూడా ఉచిత సైకిళ్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవడం మచ్చమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు పద్మకుమారి, ఎంఈవో పనసల ప్రసాద్, సర్పంచ్ కోర రఘునాథ్, జన్మభూమి కమిటీ సభ్యుడు చల్లంగి లక్ష్మణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బేరా సత్యనారాయణ, నాయకుడు కిముడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

108 పొమ్మంది.. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ రానంది!

ఇంటికి వెళ్లేందుకు బాలింత అగచాట్లు

ప్రైవేటు ఆటోలో గ్రామానికి పయనం

వాహనాలు ఇవ్వడానికి వైద్యాధికారి నిరాకరణ





తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఇవ్వకపోవడంతో ఆటోలో ఇంటికి వెళ్తున్న బాలింత

జి.మాడుగుల: మండలంలోని నుర్మతి పంచాయతీ ఇసుకగరువు గ్రామానికి చెందిన నిండు గర్భిణి పాంగి దివ్య(28) పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. శుక్రవారం అర్ధ ఆమెకు పురిటినొప్పులతో వచ్చాయి. కుటుంబీకులు 108 వాహనానికి ఫోన్‌సమాచారం అందించారు. తక్షణం స్పందించాల్సిన వాహనం, తెల్లవారు 5 గంటలకు వచ్చింది. అలోగా దివ్య ప్రసవమైంది. అయితే బిడ్డ పరిస్థితి విషమంగా ఉందని భావించిన కుటుంబీకులు, అదే వాహనంలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన అనంతరం బిడ్డ పరిస్థితి బాగానే ఉందని, ఇంటికి వెళ్లవచ్చని వైద్యులు సూచించారు. అయితే బాలింత దివ్య, ఆమె భర్త రాజు తమ వద్ద డబ్బులు లేవని, 108 వాహనం లేదా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం సౌకర్యం కల్పించాలని వైద్యుడు వినోద్‌ను వేడుకున్నారు. దీనికి ఆయన కనీసం స్పందించలేదు. దీంతో వారు పసిబిడ్డలో ఆటలో తిరుగు ప్రయాణమయ్యారు. అలాగే ఆస్పత్రిలో ప్రసవించలేదని రూ.1000 ప్రోత్సాహం దక్కలేదని, తిరుగు ప్రయాణంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సౌకర్యం కల్పించలేదని బాధిత మహిళ, కుటుంబీకులు వాపోయారు.

'చంద్రన్న బీమా'లో పేర్లు నమోదు చేసుకోండి

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్

కొయ్యూరు: చంద్రన్న బీమా పథకంలో గిరిజనులంతా పేర్లు నమోదు చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంవీవీ ప్రసాద్ సూచించారు. మండలంలోని ఆడాకుల గ్రామంలో శనివారం మన ఊరు-మన విశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ వ్యాప్తంగా చంద్రన్న బీమా పథకంలో పేర్లు నమోదుకాని వారు సుమారు నాలుగు లక్షల వరకు ఉన్నారని చెప్పారు. వారి సౌకర్యార్థం బీమా నమోదు గడువును ఈ నెల 15వ తేదీ వరకు ప్రభుత్వం పెంచిందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే సాధారణ మరణం పొందిన వారి కుటుంబాలకు అందించే రూ.30 వేల ఆర్థిక సాయాన్ని పెంచాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. అంతకు ముందు గ్రామంలో దోమలపై దండయాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇమ్మానుయేలు, జడ్పీటీసీ సభ్యుడు జి.శ్రీరామ్మూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



చంద్రన్న బీమా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

పినపాడులో పారిశుధ్య పనులు

చింతపల్లి: పినపాడు గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో వ్యాధులు, మరణాల పరిస్థితిపై శనివారం పత్రికల్లో వచ్చిన కథనాలకు ఎంపీడీవో కె.భాగ్యారావు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో తాజా పరిస్థితిని పరిశీలించి క్లోరినేషన్, బ్లీచింగ్ పనులు తక్షణమే చేపట్టాలని కార్యదర్శి గంగరాజును ఆదేశించారు. దీంతో కార్యదర్శి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోగృహాలు చుట్టూ, పలు వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. అలాగే తాగునీటి బావిని క్లోరినేషన్ చేశారు. వీధుల్లో చెత్త, మురుగు నీటిని తొలగించారు. నివాసాలను దూరంగా పశులను ఉంచాలని, వేడి చేసిన నీటిని మాత్రమే తాగాలని గ్రామస్థులకు కార్యదర్శి సూచించారు.

గ్యాస్ వాడకంతో ఆదా

ముంచంగిపుట్టు: గ్యాస్ వాడ కంతో ఆదా అవు తుందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి జి.రామ్మూర్తి అన్నా రు. శనివారం మండల కేంద్రంలో గ్యాస్ గొడౌన్‌ను ప్రారంభించారు. పలువురు ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ఉచిత గ్యాస్ కనెక్షన్లను గిరిజనులకు అందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.బలరాం, ఎంపీటీసీ సభ్యులు కె.గాసిరావు, జె.రాంచందర్, వైసీపీ మండల అధ్యక్షుడు ఎ.చిట్టిబాబు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు కృషి చేయాలి

గర్భిణులకు సీమంతాలు: ఎంపీడీవో భాగ్యారావు

చింతపల్లి: మన్యంలో ఆదివాసీలు ప్రధానంగా ఎదుర్కొంటున్న రక్తహీనత సమస్యను నివారించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని ఎంపీడీవో కె.భాగ్యారావు తెలిపారు. మండల కేంద్రంలో ఐసీడీఎప్ ప్రాజెక్టు అధికారి డి.నీలవేణి ఆధ్వర్యంలో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు, లింక్ వర్కర్లు, ఆయాలతో భారీ ర్యాలీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోషకాహార లోపంతో మన్యంతో గర్భిణులు, బాలింతల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తోటి ఆదివాసీలకు సేవ చేస్తున్నామనే అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎంపీపీ మచ్చమ్మ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి గిరిజనుడు అవసరమైన ఆకుకూరలు, కూరగాయలను సాగు చేయాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం ప్రీ స్కూల్ కార్యకర్తలకు పఠన, క్రీడల కిట్‌లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పద్మకుమారి, సర్పంచ్ సాగిన దేవుడమ్మ, ఐసీడీఎప్ పీవో నీలవేణి, సూపర్‌వైజర్ కొండమ్మ, ఎంఈవో పనసల ప్రసాద్, జన్మభూమి కమిటీ సభ్యుడు చల్లంగి లక్ష్మణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బేరా సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

టీడీపీ బూత్ కమిటీల ఎన్నిక

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని రైతుబజార్ తూనిక కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన తెలుగుదేశంపార్టీ సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు ఆధ్వర్యంలో బూత్‌కమిటీ, పంచాయతీ కమిటీని ఎన్నుకున్నారు. 18 గ్రామ పంచాయతీలకు చెందిన కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల సమక్షంలో కమిటీలను నిర్వహించారు. తెలుగుదేశం పార్టీని మన్యంలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ మండలంలో బూత్‌కమిటీ, పంచాయతీ కమిటీలను పార్టీ ఆదేశాల మేరకే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.సుబ్బారావు, ఎం.స్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంత ఆశీలుకు వేలం

డుంబ్రిగుడ: కించుమండ వారపు సంతలో ఆశీలు వసూలుకు శనివారం వేలం పాట నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి పాట ఏర్పాటు చేయగా, హరిబారికి గాసినాయుడు రూ.1.32 లక్షలకు ఆశీలు టెండర్‌ను దక్కించుకున్నాడు. టెండర్ నిర్వహణ అనంతరం 50 శాతం డబ్బులు పంచాయతీకి కట్టాల్సి వుండగా రూ.68వేలు పంచాయతీకి కట్టారు. ఈ ఆశీల ద్వారా పంచాయతీ అభివృద్ధికి నిధులు వినియోగిస్తామని మీనాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ డొమిని, కార్యదర్శి భానుప్రియా, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, హరిబారికి సూర్యారావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మాడుగుల
5
విశాఖపట్నం। ఆదివారం 6 ఆగస్టు 2017
మాడుగుల • దేవరాపల్లి • కె.కోటపాడు • చీడికాడ



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు



జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

జగన్‌కు బుద్ధి చెప్పాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే రామానాయుడు
- వైసీపీ అధినేత దిష్టిబొమ్మ దహనం

మాడుగుల: తాను నాయకుడినని చెప్పుకోడానికి కూడా కనీస లక్షణాలు లేని వైసీపీ అధినేత వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల బహిరంగ సమావేశంలో ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిని షూట్ చెయ్యాలనడం దారుణమని, అలాంటి వ్యక్తికి గట్టిగా బుద్ధి చెప్పాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ మండల అధ్యక్షుడు మజ్జి రామారావు ఆధ్వర్యంలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని అంతటిమాట అన్నారంటే, ఆయన గానీ అధికారంలోకి వస్తే ఇక ప్రజలకు ఎన్ని ఇక్కట్లు తెచ్చి పెడతారో అన్న విషయం అర్థమవుతోందన్నారు. రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక 2019లో జరగబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన జగన్ మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబును విమర్శించే స్థాయి, ఆయను ఎదుర్కొనే సత్తా జగన్‌కి లేవని అన్నారు. తన తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అడ్డగోలుగా వేల కోట్ల అక్రమ ఆస్తులు గడించాడని, ఆ సొమ్మంతా ప్రజలది కాదా అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తులకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షుడు మజ్జి రామారావు, ఎంపీపీ ఒంప్రు గంగమ్మ, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మాజీ మండల పార్టీ అద్యక్షుడు మజ్జి రామారావు, టౌన్‌పార్టీ అద్యక్షుడు శ్రీఘు మధు, డైరీ డైరెక్టర్ సీరం రెడ్డి సూర్యానారాయణ, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ



రొంగలినాయుడుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కె.కోటపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు జూరెడ్డి రాము అన్నారు. శనివారం మండలంలోని రొంగలినాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బాపాల వల్ల పిల్లలు అనారోగ్యం పాలవుతారని, వారికి స్వచ్ఛమైన తల్లిపాలనే అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీవీవీ.రత్నం, సర్పంచ్ రొంగలి సత్యవతి, టీడీపీ నాయకులు రొంగలి అప్పలనాయుడు, పైల నారాయణమూర్తి, కొల్లి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు జేడీ పేటలో హృద్రోగ వైద్య శిబిరం

మాడుగుల రూరల్ : మండలంలోని జేడీ పేటలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించనున్నారు. విశాఖపట్నం మైక్రో హాస్పిటల్ హృద్రోగ నిపుణులు శంకర నారాయణ, కింతలి పీహెచ్‌సీ వైద్యుడు ఉమా మహేశ్వరరావు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఈసీజీ తీస్తారని సమరసత సేవా సమితి మండల ప్రచారక్ తవ్వా సన్యాసయ్యశెట్టి, యూత్ అధ్యక్షుడు వడ్డి రాజ్‌కుమార్ తెలిపారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు : తహసీల్దార్



బెల్ట్‌షాప్ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాణి

కె.కోటపాడు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బీవీ రాణి హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో ఎ.కోడూరు పోలీస్ స్టేషన్ పరిధి ఎ.కోడూరు, ఎ.భీమవరం, గవరపాలెం, దాలివలస, ఆర్.వై.అగ్రహారం, పోతనవలస, గుడివాడ, పిండ్రంగి తదితర గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వాహకులు 21మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భవిష్యత్తులో బెల్ట్‌షాపులు ద్వారా మద్యం అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు చేస్తే రూ.50 వేలు జరీమానా విధిస్తామన్నారు. ఎ.కోడూరు ఎస్ఐ ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోతనవలసలో దోమలపై దండయాత్ర ర్యాలీ

కె.కోటపాడు: సమస్యల పరిష్కారానికే మన గ్రామం-మన విశాఖ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బీవీ రాణి అన్నారు. మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పోతనవలసలో దోమలపై దండయాత్ర జరిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మన గ్రామం మన విశాఖ కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. వీటిలో తాగునీటికి, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిచ్చి తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

ఈవోపీఆర్‌డీ ఎస్.అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రకిరణ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో భాగ్యలతశ్రీ, వెలుగు ఏపీఎం బండారు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నూకరత్నం మృతికి కారకులను సస్పెండ్ చేయాలి

- జడ్పీటీసీ సభ్యురాలు సత్యవతి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సత్యవతి

చీడికాడ: కోనాం గురుకుల కళాశాల విద్యార్థిని నూకరత్నం మృతికి కారకులైన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని చీడికాడ జడ్పీటీసీ సభ్యురాలు పి.సత్యవతి డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం కోనాం గురుకుల బాలికల కళాశాలను ఆమె సందర్శించి విద్యార్థిని మృతికి కారణాలను ఆరా తీశారు. అనంతరం ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడారు. నూకరత్నం కుటుంబానికి ప్రభుత్వం రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాల, కళాశాలల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

పౌష్టికాహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం

- మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు
- అంగన్‌వాడీ పిల్లలకు కంచాల పంపిణీ





పిల్లలకు కంచాలు, అంగన్‌వాడీ సిబ్బందికి కుక్కర్ అందజేస్తున్న రామానాయుడు

కె.కోటపాడు: పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. శనివారం మండలంలోని గొండుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సర్పంచ్ వంటాకు శ్రీను సమకూర్చిన స్టీల్ కంచాలు, గ్లాసులు, కుక్కర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యకర్తలు పోషకాహారంపై వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనును రామానాయుడు అభినందించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు ముందుకురావాలని కోరారు. భవిష్యత్తులో మాడుగుల నియోజకవర్గం పరిధిలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవన నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొరుపోలు జయరాం, ప్రధాన కార్యదర్శి బండారు దేముడుబాబు, వైస్ ఎంపీపీ బండారు మంగపతి, టీడీపీ నాయకులు కొటాన ఈశ్వరరావు, రొంగలి మహేష్, బొడ్డు అక్కునాయుడు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతపై అవగాహన

మాడుగుల రూరల్ : తల్లిపాలు చంటి బిడ్డలకు ఆరోగ్యకరమని అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. శనివారం మండలంలోని జేడీ పేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల విశిష్టతను ఆమె వివరించారు.

బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టడం వల్ల బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు, పాలు, గుడ్లు తీసుకోవడం వల్ల పసవ సమయాల్లో తల్లిబిడ్డలకు రక్తహీనత సమస్యను అరికట్టవచ్చునని చెప్పారు.

అనంతరం చిన్నారులకు అన్నప్రాసన జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోరుకొండ రాజుబాబు, యూత్ అధ్యక్షులు వడ్డి రాజ్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.పార్వతి, కె.పద్మ, బి.సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో మన గ్రామం-మన విశాఖ



గ్రామ సభలో పాల్గొన్న అధికారులు

మాడుగుల రూరల్ : మన గ్రామం మన విశాఖ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మండల ప్రత్యేకాధికారి కె.శైలజ అన్నారు. శనివారం మాడుగుల శివారు రామచంద్రాపురంలో అధికారులు పర్యటించారు. వాతావరణంలో మార్పులు కారణంగా వ్యాధులు ఎక్కువగా ఉంటాయని, వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత ద్వారా వాటిని నివారించవచ్చని అన్నారు.

ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజ్, ఈవోపీఆర్డీ కొంకి అప్పారావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు
- గజపతినగరంలో మన గ్రామం-మన విశాఖ



గ్రామ సభలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు

చోడవరం టౌన్: ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, ఏవైనా లోటు పాట్లు ఉంటే వాటిని గ్రామ సభలలో సంబంధిత అధికారులతో ముఖాముఖి చర్చించి పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేక అధికారి పి.వెంకటేశ్వరరావు అన్నారు. మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గజపతినగరంలో శనివారం జడ్పీటీసీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం గ్రామసభలో పాల్గొన్నారు. ఎన్‌టీఆర్ గృహకల్ప పథకం లబ్ధిదారులను గుర్తించడంతోపాటు, గ్రామంలో సమస్యల గురించి ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ముఖ్యంగా గ్రామంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, లైన్‌మన్ లేకపోవడంతో ఏ చిన్నపాటి సమస్య తలెత్తినా పరిష్కారానికి నెలలు పడుతోందని ఉప సర్పంచ్ కనిశెట్టి రామునాయుడు తదితరులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ఈ-పోస్‌లో వేలిముద్రలు సమంగా పడకపోవడం వల్ల రేషన్ డిపోలో సరుకులు పొందలేకపోతున్నామని పలువురు లబ్ధిదారులు అధికారులకు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్. ఏఈ ఎన్.రేఖ, ఎంపీటీసీ సభ్యుడు మళ్ల చినప్పడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బొడ్డేడ నాగగంగాధర్, వీఆర్‌వో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేక అధికారి, జడ్పీటీసీ, తదితరులు

నాట్లకు ముందు కలుపు తీయాలి

వ్యవసాయాధికారి విజేత

రోలుగుంట : ఖరీఫ్ వరి సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.విజేత తెలిపారు. శనివారం చంద్రన్న రైతు క్షేత్రం కార్యక్రమంలో భాగంగా రైతులకు వరినాట్లు వేసే పద్ధతిని వివరించారు. నాట్లను వరుసగా ఓ క్రమపద్ధతిలో వేయాలని, దీని వల్ల ప్రతి మొక్కకూ గాలి బాగా తగిలి దోమపోటు రాకుండా ఉంటుందన్నారు. తేమశాతం కూడా అనుకూలంగా ఉంటుందన్నారు. నాట్లు వేసే ముందు కలుపు మొక్కలను తప్పనిసరిగా తొలగించాలని, సకాలంలో స్పందించకుంటే దిగుబడిపై 20 నుంచి 50 శాతం వరకూ వాటి ప్రభావం ఉంటుందని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సకాలంలో కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. గడ్డి, తుంగ, వెడల్పాకు జాతులకు చెందిన మూడు రకాల కలుపు మొక్కలు వరిలో ఎక్కువగా పెరుగుతాయన్నారు. ఇవి వరితోపాటు సూర్యరశ్మిని, తేమను గ్రహించి పంటకు నష్టం కలగజేస్తాయన్నారు. సాగుచేసిన భూముల్లో నాట్లు వేసిన 6 వారాల వరకూ ఏ రకమైన కలుపూ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాట్లు వేసిన అయిదారు రోజుల్లోపు గడ్డి జాతి కలుపు నివారణకు పైరజో సల్ఫ్యూరాన్ 80 నుంచి 100 గ్రాములు లేదా ప్రెటిలాక్లోర్ + సేఫర్ 600 మిల్లీలీటర్లు లేదా బుటాక్లోర్ 1.5 లీటర్లు లేదా అనిలోఫాస్ 500 మిల్లీలీటర్ల మందులో ఏదో ఒకటి పిచికారీ చేయాలన్నారు. గడ్డిజాతి, వెడల్పాకు కలుపు నివారణకు ఎకరానికి ఆక్సాడైయార్జిల్ 30-40 గ్రాములు లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్, ప్రెటిలాక్లోర్ 4 కిలోల గుళికలు చల్లుకోవాలన్నారు. అలాగే ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని కలుపు లేతగా 3-4 ఆకుల దశలో ఉన్నప్పుడు మొక్కలపై చల్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయాధికారి కె.చిరంజీవి, ఎంపీఈవో కె.వాణి తదితరులు పాల్గొన్నారు.



కె.నాయుడుపాలెంలో చంద్రన్న రైతు క్షేత్రంలో వరినారు నాటుతున్న దృశ్యం

జెండా పండగకు విద్యార్థులకు పోటీలు

చోడవరం టౌన్: స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకుని చోడవరం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్థానిక బార్ అసోసియేషన్ సభ్యుల సౌజన్యంతో మండలంలోని ఆయా పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ పి.శివరాంప్రసాద్ తెలిపారు. ఈ నెల 9న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ స్వతంత్ర భారతం-ప్రముఖుల పాత్ర అనే అంశంపై చిత్రలేఖనం, అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకూ జాతీయపతాకం-వివిధ చట్టాలు అనే అంశంపై వ్యాసరచన పోటీ ఉంటాయని పేర్కొన్నారు. 10న మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకూ దేశభక్తి-భారతీయుల కర్తవ్యం అనే అంశంపై వకృత్వ పోటీ ఉంటుందని తెలిపారు. మొదటిగా పేర్లు నమోదు చేసుకున్న 200 మందికి మాత్రమే పోటీ నిర్వహిస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి 15న బహుమతులు అందజేస్తామని తెలిపారు. చిత్రలేఖనం పోటీలో పాల్గొనాలనుకునే విద్యార్థులు రంగులు, బ్రష్‌లు వంటి పరికరాలను వారే సమకూర్చుకోవాలని పేర్కొన్నారు.

భూలక్ష్మిది డెంగ్యూ మృతి కాదు

కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి నరేంద్రకుమార్

ఊపిరితిత్తుల సమస్యతో మృతి చెందిందని వివరణ

రావికమతం: భూలక్ష్మిది డెంగ్యూ జ్వరంతో మృతి చెందలేదని, ఊపిరితిత్తుల సమస్య కారణంగా మృతి చెందినట్టు తమ విచారణలో గుర్తించామని కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని టి.అర్జాపురం గ్రామానికి చెందిన కరణం భూలక్ష్మి డెంగ్యూ లక్షణాలతో మృతి చెందిన కథనాలను పత్రికల్లో వెలువడ్డాయన్నారు.

దీనిపై తాము మృతురాలి కుటుంబ సభ్యులను, బంధువులను అడిగి మృతికి గల కారణాలను తెలుసుకున్నామన్నారు. భూలక్ష్మి జూలై 31న ఆరోగ్యం బాగోకపోవడంతో రావికమతం ఆస్పత్రికి వెళ్లిందన్నారు. అయినప్పటికీ కుదుటపడకపోవడంతో అదేరోజు సాయంత్రం నర్సీపట్నం ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా, అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, విశాఖపట్నం కేజీహెచ్‌కు మెరుగైన వైద్యం కోసం తీసుకువెళ్లాలని సూచించడంతో ఈ నెల 1న కేజీహెచ్‌కు తీసుకువెళ్లారన్నారు.

అక్కడ వైద్యం ఆలస్యం అవుతుందని బావించి కుటుంబ సభ్యులు విశాఖలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో అదేరోజు సాయంత్రం జాయిన్ చేసి స్కానింగ్, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర రక్తపరీక్షలు చేయగా, అవన్నీ నెగిటివ్‌గా వచ్చాయన్నారు. స్కానింగ్‌లో ఊపిరితిత్తుల పనితీరు ఆగిపోవడంతోనే భూలక్ష్మి మరణించినట్టు అక్కడి వైద్యులు ధృవీకరించారని వైద్యాధికారి నరేంద్రకుమార్ తెలిపారు.

గర్నికంలో మన గ్రామం-మన విశాఖ

రావికమతం: సమస్యల పరిష్కారం కోసమే మన గ్రామం-మన విశాఖ లక్ష్యమని ఎంపీడీవో జయప్రకాశరావు అన్నారు. మండలంలోని గర్నికంలో శనివారం అధికారులు గ్రామంలో అన్ని వీధుల్లో పర్యటించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. వర్షపునీరు జనావాసాల్లో నిల్వ లేకుండా జాగ్రత్తపడాలన్నారు. కేజీబీవీ పాఠశాల వాడుకనీరు పోయేందుకు కాలువలు లేక జనావాసాలు, ఇళ్ల మధ్య నీరు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే కాలువలు నిర్మించాలని గ్రామస్థులు అధికారులను కోరారు. రక్షి త నీటి పథకం ద్వారా తగినంత తాగునీరు అందడం లేదని, మరో పథకం మంజూరు చేయాలని పలువురు కోరారు. శివారు గ్రామాలైన కానాడ, పెదపాచిల గ్రామాలకు రక్షిత నీటి పథకాలు మంజూరు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరినందున కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.రాము, తహసీల్దార్ సిద్ధయ్య, ఈవోపీఆర్‌డీ మహేష్, వైద్యాధికారి వాసవి, హౌసింగ్ ఏఈ ఎర్రాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



గర్నికం గ్రామసభలో పాల్గొన్న అధికారులు

శ్రీనివాస క్షేత్రంలో గ్యాస్ లీకై మంటలు

చోడవరం టౌన్: పట్టణంలోని ఆపదహార శ్రీనివాస క్షేత్రం ప్రసాదశాల (మోటు)లో శనివారం అపశృతి చోటు చేసుకుంది. వంటశాలలో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగి పైన ఉన్న విద్యుత్ బోర్డుకు అంటుకోవడంతో వైరింగ్ కాలిబూడిదైంది. గమనించిన ఆలయ అర్చకులు, భక్తులు వెంటనే స్పందించి మంటలను అదుపు చేశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

రోలుగుంట : రోలుగుంట గ్రామానికి సుమారు 48 ఏళ్లపాటు సర్పంచ్‌గా సేవలందించిన సర్లు సత్యనారాయణ చిరస్మరణీయులని టీడీపీ మండల ప్రచార కార్యదర్శి మడ్డు రమణ పేర్కొన్నారు సత్యనారాయణ 92వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సత్యనారాయణ గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా, అప్పట్లో నర్సీపట్నం సమితి అధ్యక్షుడిగా సత్యనారాయణ అందించిన సేవలను ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ సుర్ల వెంకునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు రుత్తల శ్రీనివాసరావు, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు సుర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు


కొండల అగ్రహారంలో వరినారుకు మందు కొడుతున్న రైతు

- రసం పీల్చే పురుగు ఉధృతి
- వర్షాలు లేకపోవడమే కారణం
- ఎండిపోతున్న పొలాలు


వరినారుకి తెగుళ్లు


తెగులు రావడంతో ఎండిపోతున్న నారు

మాకవరపాలెం : వరినారుకి తెగుళ్లు సోకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పది రోజులు నుంచి వర్షాలు లేకపోవడంతో ఎండల తీవ్రతకు తెగుళ్ల ఉధృతి పెరుగుతోంది. దీంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి.మండలంలో మెట్ట ప్రాంతాలైన పైడిపాల, రామన్నపాలెం, వెంకయ్యపాలెం,తామరం, మాకవరపాలెం, కొండల అగ్రహారం, బూరుగుపాలెం, తూటిపాల, మామిడిపాలెం గ్రామాల్లో రైతులు వరి నార్లు వేశారు. రెండు వారాలుగా వర్షాలు లేకపోవడంతో నారుకి తెగుళ్లు సోకుతున్నాయి. ముఖ్యంగా రసం పీల్చే పురుగు వల్ల నారు ఎండిపోతోంది. నీటి తడులు లేకపోవడంతో ఈ తెగులు ఉధృతి పెరుగుతోంది. అంతేకాదు ఎండలకు మళ్లు కూడా బీటలు వారుతున్నాయి. ఖరీఫ్ మొదట్లో వర్షాలు పడడంతో రైతులు ఈసారి పంట బాగుంటుందని ఎంతో ఆశ పడ్డారు. కానీ ప్రస్తుత పరిస్థితి వారి ఆశలను నిరాశ చేసేలా కనిపిస్తోంది.

కాగా ఈ విషయమై ఏఓ హేమ వద్ద ప్రస్తావించగా రసం పీల్చే పురుగు నివారణకు మోనోప్రోటోపాస్ పోర్లైడ్ మందు లీటరు నీటికి 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నీటి తడులు లేకపోవడం వల్లే తెగుళ్ల సోకుతున్నాయని చెప్పారు. మరో పది రోజుల్లో నారు ముదురుతుందని, నీరు ఉన్న ప్రదేశాల్లో రైతులు దమ్ములు పట్టి నాట్లు వేయాలన్నారు. అధికారుల సూచనలు పాటించాలన్నారు.

అప్పుడే తెగుళ్లు



నేను మూడు ఎకరాల్లో నారు వేసి 40 రోజులు అయ్యింది. నీటి తడులు లేకపోవడంతో తెగుళ్ల సోకుతు న్నాయి. రసం పీల్చే పురుగు రావడంతో నారు ఎండిపోతోంది. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. వర్షం పడకపోతే నష్టం తప్పదు

సుర్ల ఎల్లయ్య కొండలఅగ్రహారం

నారు ఎండిపోతుంది



దమ్ములు పట్టకముందే నారుమళ్లు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం నీటి వసతులు ఉన్నప్పటికీ నారు ఎండకుండా ఉండేందుకు మాత్రమే నీరు సరిపోతుంది. వర్షాలు పడకపోతే ముదురు నారు అవుతుంది.

కన్నూరి అప్పలనాయుడు

అంగన్‌వాడీల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు

నర్సీపట్నం రూరల్ : నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ ప్రీస్కూళ్లకు పూర్తిస్థాయిలో సౌకర్యాలతో పాటు వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు డి. సత్తిబాబు మాట్లాడుతూ ప్రీస్కూల్‌కి పిల్లల్ని పంపించడానికి తల్లిదండ్రులు అంగీకరించడం లేదన్నారు. సెంటర్లు దూరంగా ఉండడంతో అన్న అమృతహస్తం పథకానికి గర్భిణి, బాలింతలు రావడం లేదని చెప్పారు. అలాగే కేంద్రాల అద్దె చెల్లించేది మున్సిపాలిటీనా లేక ఐసీడీఎస్ అన్నది స్పష్టత లేదన్నారు. ప్రీస్కూళ్లలో పని చేస్తున్న వర్కర్లను టీచరుగా గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగా వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ. రాజు, ఐద్వా నాయకురాలు ఎల్. గౌరి, కేవీ సూర్యప్రభ, అంగన్‌వాడీ కార్యకర్తలు వి. సామ్రాజ్యం, ఆర్. కృష్ణవేణి, వరలక్ష్మి, పార్వతి, వాణి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

నర్సీపట్నం రూరల్ : గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సుకల రమణమ్మ అన్నారు. శనివారం వేములపూడి పంచాయతీ శివారు బంగారయ్యపేట గ్రామంలో జరిగిన మన ఊరు-మన విశాఖ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు, మాజీ సర్పంచ్ బోళెం నరసింహమూర్తి, సీడీపీవో ఎం. శ్రీకళ, ఏసీడీపీఓ జీవీ రమణి, ఎంఈవో సాయిశైలజ, ఏపీఎం సత్తిబాబు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

నర్సీపట్నం రూరల్ : మండలంలోని వేములపూడి, బంగారయ్యపేట గ్రామాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా సీడీపీవో ఎం.శ్రీకళ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, ప్రతి తల్లి పిల్లలకు తల్లిపాలనే తాగించాలన్నారు. శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు అందిస్తే వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుకల రమణమ్మ, ఎంపీడీఓ రమణబాబు, సర్పంచ్ బోళెం కుమారిలక్ష్మి, మాజీ సర్పంచ్ బోళెం నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ గుడివాడ కనక సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జువాలజీ పోస్టు భర్తీ చేయరూ!

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం కేడీపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ పోస్టు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.కళాశాలలోతరగతులు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా.. జువాలజీ సిలబస్ జరగడం లేదు. గతంలో ఇక్కడ కాంట్రాక్ట్ అధ్యాపకురాలిని నియమించారు. ప్రస్తుతం ఆమెను కొనసాగించే ఉత్తర్వులు జారీ కాలేదు. దీంతో ప్రథమ, ద్వితీయ సంవత్సరం (300 మంది) విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది నుంచి ఇక్కడ ఇంగ్లీష్ మీడియం కూడా ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యలో గిరిజన, మైదాన ప్రాంతాల విద్యార్థులు చేరారు. ఈ నేపథ్యంలో జువాలజీ తరగతులు జరగకపోవడంతో అంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే జువాలజీ పోస్టును భర్తీ చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

గొలుగొండ : సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహ రించరాదని ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులను గుర్తించి, వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి నివేదిక తయారు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో మండల పరిషత్ పరిపాలనాధికారి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోతుల పట్టివేతకు బోనులు ఏర్పాటు


కేడీపేట అటవీ శాఖ కార్యాలయానికి వచ్చిన బోను

కృష్ణాదేవిపేట : కృష్ణాదేవిపేట అటవీ శాఖ పరిధిలో కోతుల పట్టివేతకు ఇనుప బోనులు ఏర్పాటు చేస్తున్నామని ఆ శాఖ రేంజర్ మహ్మద్ షఫీ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం జరిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణాదేవిపేట అటవీశాఖ పరిధిలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్ల వద్ద కోతులను పట్టు కునేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు లక్షరూపాయలతో కేడీపేట, గొలుగొండ, కొయ్యూరు పరిధిలో రెండేసి బోనులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పట్టుబడిన ఆడకోతులకు కుటుంబ నియంత్రం ఆపరేషన్లు జరిపి అడవుల్లో విడిచిపెడతామని చెప్పారు. గ్రామాల్లో కోతుల బెడద ఉంటే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయనతో పాటు డీఆర్‌వో అచ్చుత రామారావు, గార్డు శ్రీరాములు, వరహాలబాబు, తదితరులు ఉన్నారు.

ధర్మసాగరంలో వనం-మనం

నర్సీపట్నం రూరల్ : మండలంలోని ధర్మసాగరం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా శనివారం నర్సీపట్నం అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుకల రమణమ్మ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి విద్యార్థి తమ ఇంటి ఆవరణలో విధిగా మొక్కలు నాటాలన్నారు.ప్రభుత్వం ఉచితంగా మొక్కలు అందజేస్తుందని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో బాదం, గానుగ, దానిమ్మ తదితర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద సుకల అప్పలనాయుడు, హెచ్‌ఎం రామకృష్ణ, అటవీశాఖాధికారులు, పాల్గొన్నారు.

11న రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

గొలుగొండ : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించి అభ్యర్థులకు ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్య ర్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

నేడు పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం

నర్సీపట్నం : నర్సీపట్నం గురుకుల పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం జరగనున్నట్టు ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బండారు రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఆదివారం ఉదయం విద్యార్థులతో కలసి వ్యాయామం, యోగాసన కార్యక్రమాలు, అనంతరం ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ పాయింట్లు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

నాతవరం : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ ఎల్. యాదగిరేశ్వరరావు తెలిపారు. శనివారం వైబీ అగ్రహారంలో జరిగిన మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైబీ అగ్రహారంలో కాలువల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని పంచాయతీ పాలకులకు సూచించారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ వి. రాధ, ఎంఈవో అమృత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం. జయరామ్, పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో...

అందని కంప్యూటర్ విద్య



+ నాలుగేళ్లుగా బోధకుల పోస్టులు ఖాళీ
+ అలంకారప్రాయంగా కంప్యూటర్లు

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదేళ్ల కిందట కంప్యూటర్ విద్యను అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2008-09లో పాములవాక, జల్లూరు, కె.వెంకటాపురం ఉన్నత పాఠశాలలతో పాటు కోటవురట్ల బాలికల ఉన్నత పాఠశాలను సక్సెస్ స్కూళ్లగా ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యాను ప్రవేశపెట్టారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం 75 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం నిధులు మంజూరు చేశాయి. ఒక్కో పాఠశాలకు ఐదు లక్షల రూపాయలు వెచ్చించి గదులకు సీలింగ్ చేయడం, 11 మానిటర్లు, మూడు సీపీయూలు, ఒక ప్రింటర్, ఒక జనరేటర్, కంప్యూటర్ టేబుళ్లు సమకూర్చి, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. వీటి నిర్వహణకు ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. ఆ సంస్థ ఇద్దరు బోధకులను నియమించి ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించింది. ఆ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం 2013 అక్టోబర్‌తో ముగిసింది. అదే ఏడాది నవంబర్‌లో కంప్యూటర్ బోధకులను ఆ సంస్థ తొలగించింది. అప్పటి నుంచి కంప్యూటర్ విద్య విద్యార్థులకు అందడం లేదు.

2013 నుంచి కంప్యూటర్లు వినియోగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కంప్యూటర్లు వాడకం లేక దుమ్ముపట్టి పోతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కంప్యూటర్, కీబోర్డులు, ఫర్నీచర్ పాడై మూలన పడ్డాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని కంప్యూటర్ విద్యను అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ డీఈఓ రేణుక వద్ద ప్రస్తావించగా గత ప్రభుత్వం కంప్యూటర్ విద్య అందించడానికి, కంప్యూటర్ల నిర్వహణకు ఒక ఏజెన్సీకి అప్పగించింది. కాలపరిమితి కావడంతో ఆ తర్వాత బోధకులను నియమించలేదు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు అదనపు బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. బోధకుల నియమించే విషయం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

ఎంపీపీ వినోద్‌రాజు



మొక్కలు నాటుతున్న ఎంపీపీ వినోద్‌రాజు

ఎస్.రాయవరం(నక్కపల్లి) : స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం, కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని ఎస్.రాయవరం ఎంపీపీ ఏజర్ల వినోద్‌రాజు అన్నారు. శనివారం మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వినోద్‌రాజు, టీడీపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు తన్నీరు ఎరకయ్య మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అందుకే ప్రభుత్వం వనం-మనం కార్యక్రమంలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దుబాసి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి వ్రతాలు



ఏడుకొండల వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం(నక్కపల్లి) : ఎస్.రాయవరంలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఏడుకొండల స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎస్.రాయవరం పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి వ్రత క్రతువులో పలువురు మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవింద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీహరి నేతృత్వంలో పండితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమోగింది.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

❖ ఎంపీపీ వినోద్‌రాజు
❖ సామూహిక సీమంతాలు

ఎస్.రాయవరం(నక్కపల్లి) : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎస్.రాయవరం ఎంపీపీ వినోద్‌రాజు అన్నారు. శనివారం మండలంలోని కర్రివానిపాలెం, గోకులపాడు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సామూహిక సీమంత కార్యక్రమాలు నిర్వహించారు. కర్రివానిపాలెంలో సర్పంచ్ పినపాత్రుని సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వినోద్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణులకు స్వీట్లు అందజేశారు. తల్లీ, బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం తరపున గర్భిణులకు పసుపు, కుంకుమలు, జాకెట్లు అందజేసి సీమంతం జరిపించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శారదాదేవి, తిమ్మాపురం ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సీమంత కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉపమాక శివాలయంలో శని త్రయోదశి పూజలు

నక్కపల్లి : మండలంలోని ఉపమాక శివాలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వున్న నవగ్రహాల మండపం వద్ద శనేశ్వరునికి తైలాభిషేకం చేశారు. నక్కపల్లి, ఉపమాక పరిసర గ్రామాల నుంచి పలువురు భక్తులు శనీశ్వరుడికి పూజలు చేశారు. శని గ్రహ దోష పరిహారార్థం అర్చకుడు వెలవలపల్లి మహేష్ భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. శనివారం ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకూ శనీశ్వరుడికి పూజలు నిర్వహించారు. ఈ నెల 19న కూడా శనిత్రయోదశి వున్నందున ఆ రోజు కూడా గ్రహశాంతులు, శనిదోష పరిహారం చేసుకోవడం ఎంతో మంచిదని అర్చకుడు మహేష్ చెప్పారు.

ఉపమాక వెంకన్నకు ప్రత్యేక పూజలు



నక్కపల్లి : మండలంలోని ఉపమాక వెంకటేశ్వర స్వామికి శనివారం వివిధ ప్రాంతాల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కొండ పైనున్న స్వామివారి నిజరూపానికి అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకం నిర్వహించి హారతులిచ్చారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు గోవిందనామస్మరణతో గరుడాద్రి పర్వతం ఎక్కి స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. కింద వున్న ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, క్షేత్రపాలకుడైన వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, స్వామికి పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



భోజన పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నక్కపల్లి : మండలంలోని రేబాక గ్రామంలో 'మన గ్రామం -మన విశాఖ' కార్యక్రమంలో భాగంగా అధికారులు ఆ గ్రామంలో పర్యటించారు. తొలుత పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గొట్టుముక్క శ్రీహరిరాజు గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం ఎంపీపీ లావణ్య, ఎంపీడీవో పిడుగు ఉమామహేశ్వరరావు, ఎంఈవో డి.వి.డి.ప్రసాద్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతి రోజూ భోజనం బాగా పెడుతున్నారా ?లేదా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు దీనిపై పర్యవేక్షణ జరిపి నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు అందజేయాలని ఎంఈవో సూచించారు.

నిధులు ఖర్చవుతున్నా కానరాని పారిశుధ్యం

❖ అవసరమైనచోట నిర్మించని కాలువలు
❖ ప్రాధాన్యత క్రమంలో చేపట్టని పనులు



అవసరం లేని చోట నిర్మించడం వల్ల నిరుపయోగమైన కాలువ



అభివృద్ధికి నోచని కచ్చా కాలువ

పాయకరావుపేట : మండలంలోని అరట్లకోట గ్రామంలో నిధులు ఖర్చవుతున్నా పారిశుధ్య సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్థులు అన్నారు. గ్రామంలో ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న కచ్చా కాలువను సీసీ కాలువగా అభివృద్ధి చేయకుండా ఉపయోగం లేని చోట కాలువలు నిర్మిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. దీనివల్ల అలాంటి కాలువలు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామంలో ఓరుగుంటాలమ్మ గుడి దాటిన తర్వాత నుంచి ఆర్‌అండ్‌బీ రహదారి ఆనుకుని గుంటపల్లి కాలువ వంతెన వరకు సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ వీధిలో వాడుక నీరు పారుదలకు కచ్చా కాలువ నిర్మించారు. కచ్చాకాలువలను సీసీ కాలువగా అభివృద్ధి చేయాలని పంచాయతీ అధికారులకు ఆ వీధి నివాసితులు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేశారు. 13, 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనా పారిశుధ్య సమస్య పరిష్కారం కావడం లేదని ఆ వీధి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

'రైతు రథానికి' భారీగా దరఖాస్తులు

- పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్న రైతులు
- అడ్డదారిలో పొందేందుకు కొందరు ప్రయత్నాలు
- రాజకీయ నేతల అండ

అచ్యుతాపురం : మండలంలోని రైతులు రైతు రథం పథకానికి భారీగా దరఖాస్తు చేస్తున్నారు. ఈ పథకంలో రాయితీ అధికంగా ఉండడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. అయితే కొందరు బడాబాబులు అడ్డదారిలో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకు పెద్ద ఎత్తున పైర వీలు సాగిస్తున్నారు. వ్యవసాయం యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం ట్రాక్టర్లను రైతులకు రాయితీపై ఇవ్వాలన్న ఉద్దేశంతో రైతు రథం పేరుతో పథకాన్ని ప్రారంభించింది. నియోజకవర్గానికి 40 ట్రాక్టర్లు చొప్పున రాష్ట్రంలో 150 గ్రామీణ నియోజకవర్గాలకు 60 వేలు, జిల్లాలోని పది గ్రామీణ నియోజకవర్గాల్లో 4 వేలు ట్రాక్టర్లు మంజూరు చేసింది. ఇందులో నియోజకవర్గా నికి కేటాయించిన 40 ట్రాక్టర్లలో నాలుగు నాలుగు చక్రాల ట్రాక్టర్లు కాగా మిగ తావి రెండు చక్రాల ట్రాక్టర్లు. వీటిలో 20 శాతం ఎస్సీలకు కేటాయించగా మిగతావి జనరల్ కేటగిరికి కేటాయించారు. సుమారు రూ. 6.25 లక్షలు ఖరీదు చేసే 4 చక్రాల ట్రాక్టర్‌కి రెండు లక్షలు, రూ. 5. 5 లక్షలు విలువ చేసే రెండు చక్రాల ట్రాక్టర్‌కి రూ. 1.5 లక్షల రాయితీ ప్రకటించారు. అలాగే మండలంలో పంటల సాగు విస్తీర్ణం బట్టి కూడా ఆయా మండలా లకు ట్రాక్టర్‌లను కేటాయించారు. ఉదాహరణకు ఎలమంచిలి నియోజక వర్గానికి మంజూరైన 40 ట్రాక్టర్‌లలో ఎలమంచిలి, అచ్యుతాపురం మండ లాలకు చెరో 9, మునగపాక, రాంబిల్లి మండలాలకు చెరో 11 చొప్పున మంజూరు చేశారు. దీంతో రైతులు ట్రాక్టర్‌ల కోసం ఎగబడుతున్నారు. అచ్యుతాపురంలో 40 మంది దరఖాస్తు చేయగా రాంబిల్లిలో 140 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో జరగాల్సి ఉంది. దీంతో పైరవీలు మొద లయ్యాయి. ట్రాక్టర్‌లు కావలసిన వారు వివిధ మార్గాల ద్వారా స్థానిక ఎమ్మెల్యేలకు పైరవీలు జరుపుతున్నారు. ముఖ్యంగా ఆయా ఎమ్మెల్యేల పీఏలు ఈ విష యంలో చక్రం తిప్పుతున్నారు. వచ్చిన రాయితీలో సగం సగం అని కొందరు ఆఫర్ చేస్తుండగా, సబ్సిడీ మొత్తం తీసుకొని ట్రాక్టర్ ఇప్పిస్తే చాలని మరికొందరు ఆఫర్లు ఇస్తున్నారు. కేవలం పేద రైతుల కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. కానీ బడాబాబులకే ట్రాక్టర్‌లు దక్కుతాయని బక్కచిక్కిన రైతులు బహిరంగంగానే అంటున్నారు.ఇందులో తమక ఏ సంబంధం లేదని, ఎమ్మెల్యే సూచించిన వారికి మాత్రమే తాము ట్రాక్టర్‌లను ఇస్తామని అధికారులు చెబుతున్నారు.



ఏటికొప్పాక అంగన్‌వాడీ కేంద్రానికి పాడైన పాల ప్యాకెట్లు

ఎలమంచిలి రూరల్ : మండలంలోని ఏటికొప్పాక 5వ అంగన్‌వాడీ కేంద్రానికి పాడైన పాల ప్యాకెట్లు వచ్చాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న అమృతహస్తం పథకం ద్వారా గర్భిణిలకు, బాలింతలకు పాలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే.ఈ పథకం మొదలు పెట్టి కొద్ది రోజులు కూడా గడవకముందే పాల ప్యాకెట్లలో డొల్ల బయటపడింది.అంగన్‌వాడీ కేంద్రాలకు విజయ వజ్ర పరిశ్రమకు చెందిన పాల ప్యాకెట్లు వస్తున్నాయి. గత నెల 18వ తేదీన ఏటికొప్పాకలోని 5వ కేంద్రానికి 200 పాల ప్యాకెట్లు వచ్చాయని కార్యకర్త ఆదిలక్ష్మి కుమారి తెలిపారు. ఇందులో 10 ప్యాకెట్లు పాడైనట్టు ఆరోపించారు. ప్యాకెట్లపై 90 రోజులు నిల్వ ఉండే విధంగా రాసి ఉన్నా.. పది ప్యాకెట్లు నెల రోజుల్లోనే దుర్వాసన వస్తున్నాయని చెప్పారు.



మున్సిపల్ కమిషనర్ సత్యన్నారాయణ నుంచి వివరాలు తెలుసుకుంటున్న వుడా ప్రతినిధులు

పట్టణంలో వుడా అధికారుల సర్వే

ఎలమంచిలి:మున్సిపాలిటీలో శనివారం వుడా ప్రతినిధుల బృందం పర్యటించింది. పట్టణంలోని పలు అంశాలపై సర్వే చేపట్టింది. మున్సిపాలిటీలో వచ్చే 20 ఏళ్లలో ప్రజలకు అవసరమైన వనరులపై సర్వే చేస్తున్నట్టు వుడా బృంద ప్రతినిధి రాజలక్ష్మి తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల అవసరాలు రానున్న 20 ఏళ్ల నాటికి వసతుల కోసం ఈ సర్వే దోహదపడుతుందని చెప్పారు. అంతకుముందు కమిషనర్ నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నేడు స్నేహితుల దినోత్సవం

అనకాపల్లి టౌన్ : గౌరీ సేవా సంఘం కొణతాల సుబ్రహ్మణ్యం హాలులో ఆదివారం బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కర్రి చిన అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మర్రిబంద స్కూల్ నిర్వహణ భేష్

ఎలమంచిలి : మర్రిబంద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ సందీప్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో హెచ్‌ఎం వినోద్‌కుమార్‌ను అభినందిం చారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్నేహితుల దినోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కన్నూరి పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సందీప్

చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ

నెహ్రూచౌక్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరశనగా శనివారం టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు అనకాపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత వీరంతా తహసీల్దార్ కార్యాలయం నుంచి చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ ప్రతినిధులు బాలాజీ, రెడ్డి, పృథ్వీ, నాయుడులతో పాటు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



నెహ్రూచౌక్ జంక్షన్‌లో విద్యార్థుల ర్యాలీ

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

మునగపాక:గ్రామాల్లోఅభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. మెలిపాకలో శనివారం జరి గిన మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆయన రేషన్‌డిపో, అంగన్‌వాడీ కేంద్రం, ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శాంతలక్ష్మి,తహసీల్దార్ రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు మారిశెట్టి కనకరామలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె. వీరరాజశేఖర్, పాలసంఘం అధ్యక్షుడు ప్రగడ రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్, సర్పంచ్ ఉమా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేతల చేతుల్లో అసైన్డ్ భూమి

మునగపాక : మండలంలోని వెంకటాపురం రెవెన్యూ పరిధిలోని 279 సర్వే నంబరులో ఉన్న అసైన్డ్ భూమిని కొంతమంది పట్టాలు సృష్టించుకొని స్వాధీనంచేసుకున్నారు. గతంలో ఈసర్వే నంబరులో 21 ఎకరాలు అసైన్డ్ భూమిగా ఉండేది. అయితే భూమిలో కోట్ని అయ్యన్నదొర సర్వే నంబరు 279/3లో నాలుగు ఎకరాల 84 సెంట్లకు పట్టాదారు పాసు పుస్తకాన్ని రప్పించుకున్నారు.పుస్తకంలో భూమి జిరాయితీ భూమిగా పేర్కొనడం విశేషం. అలాగే సుందరపు మురళీకృష్ణ 279/4లో రెండు ఎకరాల ఎనిమిది సెంట్ల భూమికి పట్టాదారుపాసు పుస్తకాన్ని సృష్టించుకున్నారు.ఇది కూడా జిరాయితీగానే నమోదు కావడం విశేషం. ఈ విషయమై తహసీల్దార్ రాంబాబును వివరణ కోరగా ఈ విషయం ఇంతవరకు తమ దృష్టికి రాలేదని 279 సర్వే నంబరులో ఉన్న భూమి అసైన్డ్ డీఫాం పట్టాగానే నమోదై ఉందన్నారు. ఇది జిరాయితీ భూమి కాదని పరిశీలించి ఎవరైనా తప్పుడు పట్టాదారు పుస్తకాలు తీసుకుంటే వాటిని రద్దు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎలమంచిలి రూరల్ : మండలంలోని పురుషోత్తపురం పెట్రోల్ బంకు సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ చక్రధర్ తెలిపిన వివరాల మేరకు..తుని వైపు నుంచి విశాఖ వెళ్తున్న పురుషోత్తపురం సమీపంలో ఉన్న బంకు వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను అదుపు తప్పి ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ తరలించారు. గాయాలైన వారి పేర్లు తెలియవని ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపం



రేకుల వద్ద బీటలు వారిన గోడ (ఇన్‌సెట్లో) -మూత లేకుండా ఉన్న సెప్టిక్ ట్యాంక్

మునగపాక : నాగులాపల్లి పంచాయతీ పరిధిలోని ముదిరాజ్ కాలనీలో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్ల పనులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనుల్లో నాణ్యత లోపించిందని లబ్ధిదారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల తలుపులు ఊడిపోగా...మరికొన్ని చోట్ల రేకు లకు ఏర్పాటు చేసిన చోట గోడలు పగుళ్లు ఇచ్చాయి. ఇంకొన్ని రూమ్‌లకు సెప్టిక్ ట్యాంక్ నిర్మించినప్పటికీ వాటికి మూతలు వేయలేదు. లబ్ధిదారులు వ్యక్తిగతంగా నిర్మించుకుంటే అనేక నిబంధనలు పెట్టే అధికారులు నాసిరకంగా వీటిని నిర్మించినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్‌కు మాత్రం బిల్లులు చెల్లించారని ఆరోపిస్తున్నారు. కనీసం బిల్లులు చేసేటప్పుడైనా రూమ్‌ల నాణ్యత పరిశీలించలేదని ఆరోపిస్తున్నారు.

మా సిమెంట్, ఇసుక వాడేశారు



కాలనీలో నిర్మించిన వ్యక్తిగత మరుగు దొడ్లన్నీ నాసిరకంగా ఉన్నాయి. మా ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న సిమెంట్, ఇటుక, ఇసుక వాడేశారు. బిల్లు అయిన తర్వాత పేమెంట్ చేస్తామని చెప్పారు. పేమెంట్ చేయకపోగా కట్టిన మరుగు దొడ్డికి సెప్టిక్ ట్యాంక్‌కు మూత కూడా వేయలేదు. అధికారులకుఫిర్యాదు చేసినా... పట్టించుకోవడం లేదు.

మొలుగు వరలక్ష్మి,
ముదిరాజ్‌కాలనీ

రారండోయ్.. ఇళ్లు చూద్దాం..



డబుల్ బెడ్‌రూం గదులు



రావుగోపాలరావు కళాక్షేత్రంలో మోడల్ గృహాల నిర్మాణం

నేడు లబ్ధిదారులంతా చూసే విధంగా ఏర్పాట్లు

ఎమ్మెల్యే 'పీలా' ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని రావుగోపాలరావు కళాక్షేత్రంలో మోడల్ గృహాల నిర్మాణం పూర్తయ్యింది. వీటిని లబ్ధిదారులంతా సోమవారం సందర్శించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దగ్గరుండి పర్యవేక్షించారు. సాధారణంగా ఓ ఇంట్లో కుటుంబం నివసిస్తే ఎటువంటి సౌకర్యాలు ఉంటాయో వాటన్నింటినీ ఇందులో చూపుతుండడం విశేషం.

అనకాపల్లికి 2220 ఇళ్లు మంజూరు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అనకాపల్లికి 2220 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందుకు సత్యనారాయణపురం లే అవుట్‌లో నిర్మాణ పనులు చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించారు. లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తి చేశారు. మూడు కేటగిరీల్లో ఈ ఇళ్ల నిర్మాణాలకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొట్ట మొదటిసారిగా అనకాపల్లిలో లబ్ధిదారులకు ముందుగానే ఇళ్ల నమూనా చేపించాలని ఎమ్మెల్యే పీలా సంకల్పించారు. ఇందులో భాగంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి రావుగోపాలరావు కళాక్షేత్రంలో మూడు కేటగిరీల్లో లబ్ధిదారులకు ఇవ్వబోయే ఇళ్లు ఏవిధంగా ఉంటాయో రూపొందింపజేశారు.

మూడు కేటగిరీల్లో ఇళ్ల ధరలు, సౌకర్యాలు ఇలా..

- ఒకటో కేటగిరీలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక బెడ్‌రూం, హాలు, వంట గది, బాత్‌రూము ఉంటాయి. ఇందుకు మొత్తం అంచనా వ్యయం రూ.ఆరు లక్షల 46వేల 200 కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో లక్షన్నర సబ్సిడీ అందిస్తున్నాయి లబ్ధిదారుడు ఈ ఇంటికి సంబంధించి ఐదొందల రూపాయలు చెల్లించాల్సి ఉంది. బ్యాంకు రుణం మూడు లక్షల 45వేల 700 రూపాయలు. 20 ఏళ్ల కాలపరిమితిలో నెలకు లబ్ధిదారుడు బ్యాంకుకు రూ.3,100 చెల్లించాల్సి ఉంటుంది.
- రెండో కేటగిరీలో 365 చదరపు గజాల విస్తీర్ణంలో ఒక బెడ్‌రూం, ఒక హాలు, వంట గది, బాత్‌రూము ఉంటాయి. దీని అంచనా విలువ ఏడు లక్షల 42వేల 45 రూపాయలు. దీనికి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో లక్షన్నర రూపాయలు సబ్సిడీగా ఇస్తున్నాయి. అయితే లబ్ధిదారుడు ముందుగా రూ.50 వేలను నాలుగు వాయిదాల్లో చెల్లించాలి. బ్యాంకు రుణం మూడు లక్షల 92 వేల 45 రూపాయలు. 20 ఏళ్ల కాల పరిమితిలో లబ్ధిదారుడు నెలకు రూ.3,500 బ్యాంకుకు చెల్లించాలి.
- మూడో కేటగిరీలో 430 చదరపు అడుగులలో రెండు బెడ్ రూములు, ఒక హాల్, ఒక వంటగది, బాత్‌రూము ఉంటాయి. దీని అంచనా విలువ ఎనిమిది లక్షల 36వేల 780 రూపాయలు. దీనికి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు లక్షలు సబ్సిడీ ఇస్తున్నాయి. ఈ కేటగిరీలో ఇల్లు కావాల్సినవారు తన వాటా ధనంగా లక్ష రూపాయలను నాలుగు విడతలుగా చెల్లించాల్సి ఉంది. బ్యాంకు రుణం నాలుగు లక్షల 36వేల 780 రూపాయలు. 20 ఏళ్ల కాలపరిమితిలో లబ్ధిదారుడు బ్యాంకుకు నెలకు 3,900 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

లబ్ధిదారుల కోసం వాహనాల ఏర్పాటు

వాహనాల్లో లబ్ధిదారులను తొలుత ఇళ్లు నిర్మించబోయే సత్యనారాయణపురం లే-అవుట్‌కు తీసుకువెళ్లి స్థలాన్ని చూపించనున్నారు. అనంతరం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన మూడు కేటగిరీల ఇళ్లను చూపిస్తారు. ఇల్లు నిర్మించుకునేటప్పుడు బాత్‌రూం, వంట గదిలతో పాటు హాల్, బెడ్‌రూములలో సేదదీరేందుకు అవసరమైన సౌకర్యాలు యజమాని ఏ విధంగా సమకూర్చుకుంటాడో ఈ నమూనా ఇళ్లలో అవన్నీ ఏర్పాటు చేయడం విశేషం.



టాయిలెట్



వంట గది

నేడు స్నేహ దినోత్సవం

అనకాపల్లి టౌన్ : గౌరీ సేవా సంఘం కొణతాల సుబ్రహ్మణ్యం హాలులో ఆదివారం బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కర్రి చిన అప్పలనాయుడు తెలిపారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆరు గంటలకు స్నేహంజలి సూపర్ మస్త్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయన్నారు.

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు

నెహ్రూచౌక్ : ఉడ్‌పేట ముత్యంవారి వీధిలో రోడ్డుకు పడిన గోతులను ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శనివారం పూడ్చివేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు ఆధ్వర్యంలో శ్రమదానం ద్వారా ఈ పనులు చేపట్టారు. కార్యదర్శి మావూరి రవికుమార్, సభ్యులు సి.రామకృష్ణ, ఎం.అర్జున్, కె.రామకృష తదితరులు పాల్గొన్నారు.



గోతులు పూడ్చుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ

నెహ్రూచౌక్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరశనగా శనివారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు అనకాపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత వీరంతా తహసీల్దార్ కార్యాలయం నుంచి చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు బాలాజీ, రెడ్డి, పృథ్వీ, నాయుడులతో పాటు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



నెహ్రూచౌక్ జంక్షన్‌లో విద్యార్థుల ర్యాలీ

జగన్‌కు ఆదరణ పెరగడంతో టీడీపీలో గుబులు

◆ ఓర్వలేకనే శవ యాత్రలు ◆ వైసీపీ శ్రేణుల ఎద్దేవా

అనకాపల్లి : వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు అతనికి వ్యతిరేకంగా శవయాత్రలు, దిష్టి బొమ్మల దహనాలు వంటివి చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు మళ్ల బుల్లిబాబు, మందపాటి జానకిరామరాజు, సూరిశెట్టి రమణ అప్పారావు, జాజుల రమేష్, ఒమ్మి రాము ఆరోపించారు. పూడిమడక రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నంద్యాలలో జగన్ సభకు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన రావడంతో టీడీపీ నాయకులు జీర్ణించుకో లేకపోతున్నారన్నారు. పోలీసులు కూడా ఆ పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. నంద్యాలలో వైసీపీ విజయం తథ్యమన్నారు. ఈ సమావేశంలో వేగి త్రినాథ్, భీశెట్టి జగన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వైసీపీ నాయకులు

10న మరిడిమాంబ పండుగ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

గవరపాలెం : ఇక్కడి జేఎల్ స్కూల్ వద్ద ఉన్న మరిడిమాంబ పండగ ఈ నెల 10న జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ఛైర్మన్ బీఎస్ఎంకే జోగినాయుడు శనివారం ఆవిష్కరించారు. కమిటీ వైస్ ఛైర్మన్ కేఎం నాయుడు, కార్యదర్శి కాండ్రేగుల హరికిశోర్, కోశాధికారి కాండ్రేగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఊంజల్ సేవ

గవరపాలెం : ఇక్కడి సంతోషిమాత ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారి ఊంజల్ సేవను అత్యంతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీడీపీ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాగ్గేయ వరదాయిని బృందం విద్యార్థుల కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయ ఛైర్మన్ దాడి వాసు, టీడీపీ నాయకులు కొణతాల నూకునాయుడు, మళ్ల సత్యనారాయణ, మళ్ల కృష్ణ, పొలిమేర నాయుడు, దూలం రాంప్రసాద్, ధర్మకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సేవలో పాల్గొన్న బుద్ద నాగజగదీశ్వరరావు



బాలికల కోలాటాలు